: fb.com/vaartha Digital

WWW.VAARTHA.COM

epaper.vaartha.com

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఖమ్మం

21-6-2025 శనివారం

సంపుటి: 31 సంచిక: 140

పేజీలు: 8+16 వెల: 6.50

# బాబుతో చర్చలకు సిద్ధం



**● ఎవరికోసం తెలంగాణ వాక్కులు వదులుకోం.. ● బనకచర్లపై ఎపితో తేల్చుకుంటాం ● 23న కేబినెట్ భేటీ తర్వాత చర్చలు ● గతంలో ఎపికి అన్ని వాక్కులు రాసిచ్చింది కెసిఆరే ● వచ్చే 6,7 తేదీల్లో మరోసారి కేంద్రం వద్దకు.. ● ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్20:** ప్రస్తుత ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే.. తెలంగాణ, ఎపి ఒకరికొకరు చెప్పుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తాము ఎవరితో వివాదాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేస్తూ పలు కీలక విషయాలను మాట్లాడారు. విభజన చట్టం ప్రకారం గతంలో సిఎంల స్థాయిలో చర్చలు జరిపామని, అనేక అంశాలను చర్చించామని పేర్కొన్నారు. బనకచర్లపై కూడా తమతో చర్చించి ఉంటే బాగుండేదని అన్నారు.

తెలుగువారిమధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దని, తెలంగాణకు పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదని స్పష్టం చేశారు. ఈ నెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉందని, ఈ భేటీలో బనకచర్లపై చర్చిస్తామని, ఆ తర్వాత ఒక అడుగుముందుకేసి మేమే ఎపిసిఎం చంద్రబాబును చర్చలకు పిలుస్తామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సపోర్టు కావాలని, చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలని రేవంత్ అన్నారు. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉందని, బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు అని తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే అని స్పష్టం చేశారు. 2016, 2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు జివోలు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్. జివోల ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చిందని అన్నారు. గోదావరి-పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగమని, 86 రోజుల్లో 400 టిఎంసిలు తరలించేలా బనకచర్లను డిజైన్ చేశారని చెప్పారు. ఎపి కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తే మొదట తెలంగాణకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని, కానీ ప్రాజెక్టుల అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్తుందని, కేంద్రం సైతం ఆంధ్రప్రదేశ్ నిర్మించనున్న >>2

# వన్ ఎర్త్.. వన్ హెల్త్

## నేటి 'యోగా డే' సందేశం

### దేశ, విదేశాల్లో పెద్దఎత్తున వేడుకలు

### లక్ష పైగా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

### విశాఖలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జూన్ 20:** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షకు పైగా ప్రత్యేక కేంద్రాల్లో యోగా దినోత్సవం జరగనున్నది. ప్రధాని మోడీ స్వయంగా పాల్గొనే ఈకార్యక్రమాన్ని ప్రతి ఏటా జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినంగా పరిగణించాలని ఐక్యరాజ్యమితి 2014డిసెంబరు 11వ తేదీన ప్రకటించింది. అంతకుముందు 2014 సెప్టెంబరు 27వ తేదీ జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధుల సభ 69వ సదస్సులో ప్రధాని మోడీ స్వయంగా యోగా దేను ప్రతిపాదించారు. >>2



డెహ్రాడూన్‌లోని ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము కంటతడిపెట్టిన దృశ్యం

## పుట్టిన రోజున రాష్ట్రపతి కంటతడి

### అంధ విద్యార్థుల గీతాలాపనతో భావోద్వేగం

**డెహ్రాడూన్, జూన్ 20:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన పుట్టిన రోజున ఒక ప్రత్యేక కార్యక్రమంలో భావోద్వేగానికి గురయ్యారు. డెహ్రాడూన్‌లోని అంధ విద్యార్థులు తమ గానంతో శుభాకాంక్షలు తెలుపగా, ఆమె కంటతడి పెట్టారు. ఈ సంఘటన పలువురి హృదయాలను హత్తుకుంది. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన జన్మదినోత్స >>2



శుక్రవారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన యోగా వేడుకలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

## ప్రపంచానికి భారత్ బహుమతి 'యోగా'

### ఎల్‌బి స్టేడియంలో ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు

**పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఎల్‌బి స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎల్‌బి స్టేడియంలో 24 గంటల >>2

## నాటి ఇద్దరు డిజిపిలు చెప్పినట్లే 'ట్యాపింగ్'

### ఐదోసారి సిట్ విచారణలో ప్రభాకరరావు

### రాజకీయ నేతలెవరూ తెలియదని వెల్లడి

### కొత్తమలుపు తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై జరుగుతున్న పోలీసుల విచారణ అనూహ్య మలుపు తిరిగింది. ఈ కేసులో ఇప్పటి వరకు పెద్దగా నోరు మెదపని ఎస్ఐబి తాజా విచారణలో అప్పట్లో డిజిపిలుగా పనిచేసిన మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్‌తో పాటు నిఘా విభాగం బాస్‌లుగా వున్న నవీన్ చంద్, అనిల్ కుమార్‌ల ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఎవరెవరి ఫోన్లను ట్యాపింగ్ చేయాలనే దానిపై వారే >>2


## ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్ ముప్పేట దాడి

### లక్ష్యాలపైకి దూసుకువెళ్లిన 60 యుద్ధ విమానాలు

2లో

PATANJALI®

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన, సుసంపన్నమైన మరియు ఉజ్వలమైన భారతదేశ నిర్మాణంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేయండి



ప్రపంచంలోనే ప్రముఖ యోగా గురు

యోగా ఋషి స్వామి రామ్‌దేవ్ మహరాజ్ నుండి నేరుగా యోగా నేర్చుకోండి

ప్రతీరోజూ ఉ.5.30 గం. నుండి 7.30 గం. మరియు రాత్రి 8.00 గం. | ప్రతీరోజూ ఉ.7.56 గం. నుండి



యోగాతో నిండిన భారత్: స్వామీ రామ్‌దేవ్‌జీ ఆహ్వానం

ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవంనాడు స్వామీజీ నేతృత్వంలో యోగవ్రతులు, స్వదేశీవ్రతులుగా మారి ఆరోగ్యవంతమైన, సుసంపన్నమైన, సమర్థవంతమైన, వ్యవస్థీకృతమైన మరియు అత్యంత ఉజ్వలమైన భారతదేశ నిర్మాణంలో పాల్గొనండి.

పతంజలి ద్వారా గత మూడు దశాబ్దాలలో యోగా, ఆయుర్వేదం మరియు స్వదేశీ విధానాలు ప్రపంచంలోని 200 దేశాలలో 200 కోట్ల మందికి పైగా ప్రజలకు వ్యాధుల నుండి విముక్తి, వ్యసనాల నుండి విముక్తి మరియు ఆధ్యాత్మిక జాగృతికి మార్గాలను చూపించాయి. దీనివలన లక్షల కోట్ల రూపాయలు ఆదా కావడమే కాకుండా ఆధ్యాత్మిక, సనాతన జీవన విధానానికి పునాది వేయడం జరిగింది.

"మేల్కొలిపే దేవుడు"

దేశంలోని అగ్రశేణి సాధువులు మరియు ఋషులతోసహా కోట్లాది మంది ప్రజలు స్వామీజీ మహరాజ్‌ను "మేల్కొలిపే దేవుడు"గా భావిస్తారు. దేశమంతటా 25 లక్షల కంటే ఎక్కువ కిలోమీటర్లు ప్రయాణించి 10 కోట్ల మందికిపైగా వ్యక్తులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఒక కోటి మంది కంటే ఎక్కువ అంకితభావం గల వాలంటీర్లను తయారు చేశారు. వీరు నిస్వార్థంగా మరియు కోరికలు లేకుండా మానవాళికి సేవలందిస్తున్నారు. శిక్షణ పొందిన పతంజలి యొక్క ఈ యోగా సోదరులు, సోదరీమణులు ఒక లక్షకంటే ఎక్కువ యోగా శిబిరాలు మరియు దేశంలోని ప్రతీ గ్రామం, నగరం, వీధి మరియు ప్రాంతాలలో క్రమబద్ధంగా యోగా తరగుతుల ద్వారా ఆరోగ్యం మరియు జాగృత సందేశాన్ని వ్యాపింపజేస్తున్నారు. ప్రతీరోజూ ఉదయమే మేల్కొని యోగా ఆచరించడమనే ఈ విప్లవం భారతదేశాన్ని నూతన దిశగా తీసుకువెళుతోంది.

**నిస్వార్థంగా మానవ సంక్షేమం కొరకు ప్రచారం** దేశమంతటా వ్యాపించిన 10,000 కంటే ఎక్కువ పతంజలి కేంద్రాలు మరియు 2,500 మంది అర్హత పొందిన, శిక్షణ పొందిన వైద్యుల ద్వారా యోగా, ఆయుర్వేదం మరియు స్వదేశీ రంగాలలో పతంజలి విస్తృతమైన సేవలను అందిస్తోంది. ఆర్థికపరంగా మనము లెక్కించినట్లయితే, దేశ నిర్మాణం నిమిత్తం ఒక లక్ష కోట్ల రూపాయల కంటే ఎక్కువగా తోడ్పాటు అందించినట్లవుతుంది. పతంజలి యొక్క ప్రతీ ప్రాజెక్టు భారతమాత సేవకు అంకితం చేయబడుతోంది.

**స్వదేశీ నుండి సుసంపన్నత : దాతృత్వం కొరకు సంపన్నత** ఆక్స్‌ఫామ్ గ్లోబల్ (యూకే) మరియు ఇతర ఏజెన్సీల సర్వే ప్రకారం, 1765 మరియు 1900 మధ్య, అక్రమణదారులైన విదేశీ కంపెనీలు 100 ట్రిలియన్ డాలర్లకు పైగా విలువ గల వాటిని భారతదేశం నుండి దోచుకున్నాయి మరియు ఈ దోపిడీ నేటికీ కొనసాగుతున్నది. స్వదేశీ ఉద్యమం ద్వారా ఈ దోపిడీని ఆపాలని మరియు భారతదేశాన్ని ఆర్థికపరంగా శక్తివంతంగా తీర్చిదిద్దుటలో సహకరించాలని స్వామీజీ నిర్ణయించుకున్నారు. "దాతృత్వం కొరకు సంపన్నత": పతంజలి తన లాభాలలో 100% భారతదేశ సేవ కోసం నిస్వార్థంగా పెట్టుబడి పెట్టింది. పెడుతోంది మరియు పెట్టుబడి పెట్టుట కొనసాగిస్తుంది.

**భారతీయ శిక్షా బోర్డ్ ద్వారా మెకాలే విద్యా విధానం నుండి విముక్తి** 1835 తర్వాత బ్రిటీష్‌వారి ద్వారా అమలులోకి తీసుకురాబడిన మెకాలే విద్యా విధానం నుండి భారతదేశానికి విముక్తి కల్పించేందుకు, పతంజలి గురుకులం మరియు ఆచార్యకులం వంటి సంస్థలలో పిల్లలను భారతీయ శిక్షా బోర్డ్ మార్గదర్శకత్వంలో ఉత్తమ వ్యక్తిత్వం, స్వభావం మరియు నాయకత్వ లక్షణాలు కలిగిన వారిగా తీర్చిదిద్దుతోంది. తదుపరిగా, భారతీయ శిక్షా బోర్డ్‌తో లక్షలాది పాఠశాలలను అనుబంధంగా చేసుకుని మేము నూతన భారత దేశాన్ని నిర్మిస్తున్నాం. పతంజలి గురుకులం, ఆచార్యకులం, పతంజలి విశ్వవిద్యాలయాలలో మీ పిల్లలను చదివించండి మరియు BSBతో కలిసి దేశ నిర్మాణమనే ఉత్తమ యజ్ఞంలో మీ పాత్ర పోషించండి.

**ఆరోగ్య విప్లవం : ఆరోగ్యవంతమైన భారతదేశం** చరక, సుశ్రుత, ధన్వంతరి మరియు పతంజలి వంటి గొప్ప ఋషుల నుండి పొందిన సాంప్రదాయ పరిజ్ఞానం ఆధారంగా శాస్త్రీయ పరిశోధనతో పతంజలి వెల్‌నెస్, యోగాగ్రాం మరియు నిరామయం వంటి ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ ట్రీట్‌మెంట్ సెంటర్లు నెలకొల్పబడినవి. ఈ సెంటర్ల ద్వారా కోట్లాది మంది ఆరోగ్యవంతంగా, దృఢంగా మారుతున్నారు. ప్రతీ వ్యక్తి స్వయంగా యోగా ఆచరించాలని మరియు 10 మంది ఇతరులను యోగా ఆచరించుటకు ప్రోత్సాహించాలని స్వామీజీ పిలుపునిస్తున్నారు. అవగాహన కలిగిన కనీసం 1% మంది ప్రజలైనా ఉదయమే యోగా చేయడం మరియు యోగా ఆధారిత సనాతన జీవన విధానాన్ని అనుసరిస్తూ ఉంటే, భారతదేశ హెల్త్ బడ్జెట్ ఒకనాటికి జీరోకు చేరుకుంటుంది.

**పరిశోధన మరియు పరిష్కారాలు : సైన్స్ మరియు సాంప్రదాయాల సంగమం** పతంజలి వద్ద 500 మందికి పైగా శాస్త్రవేత్తలు కాలేయం, మూత్రపిండాలు, గుండె మెదడు మరియు శ్వాసకోస వ్యవస్థ వ్యాధుల కొరకు ఏళ్ల తరబడి పరిశోధన చేసిన తరువాత రుజువు ఆధారిత ఔషధాలను అభివృద్ధి చేశారు. మా శాస్త్రవేత్తలు 5,000కు పైగా పరిశోధన ప్రోటోకాల్స్ మరియు పరిశోధన పత్రాలు 500కు పైగా అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయి. ఆయుర్వేదాన్ని ఔషధాల పరిశోధన మరియు రుజువు ఆధారిత వ్యవస్థగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేందుకు దోహదం చేసింది.

**యోగా ధర్మం ఇప్పుడు యుగధర్మంగా మారాలి : సనాతనమే ఏకైక పరిష్కారం** ప్రస్తుతం యోగా మరియు సనాతన ధర్మం ప్రపంచానికి అవసరం. యోగా మరియు సనాతన విలువల ద్వారా పతంజలి ఒత్తిడి, వ్యాధులు, సామాజిక మరియు సాంస్కృతిక క్షీణతతో పోరాడుతున్న ప్రపంచానికి క్రొత్త దిశానిర్దేశం చేస్తుంది. **రండి, యోగా ధర్మం ఆధారంగా సనాతన జీవన విధానాన్ని స్వీకరించండి.**

**ఐదు గొప్ప విప్లవాలకు ఆహ్వానం** విద్య, వైద్యం, ఆర్థిక మరియు సాంస్కృతిక బానిసత్వం నుండి విముక్తి కల్పిస్తూనే భారతదేశాన్ని ఆర్థిక మరియు ఆధ్యాత్మిక శక్తిగా మార్చడానికి పతంజలి కృషి చేస్తోంది. పతంజలి లక్షకుపైగా గోవులను పెంచుతోంది మరియు గోవులను రక్షించడానికి ఒక పెద్ద కార్యాచరణ ప్రణాళికపై పనిచేస్తోంది.

**పతంజలి వారి స్వచ్ఛమైన మరియు సాత్విక ఉత్పత్తులను ఉపయోగించండి, మీ పిల్లలను మరియు కుటుంబాన్ని కల్తీ అనే విషం నుండి రక్షించండి.**





శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఏపి సీఎం చంద్రబాబు

# విశాఖలో నేడు మహా 'యోగా'

## ప్రధాని మోడీ సహా పలువురు కేంద్రమంత్రులు హాజరు

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త:** యోగాంధ్ర కార్యక్రమానికి విశాఖ ముస్తాబైంది. అంతర్జాతీయ యోగా దినోత్సవంని గిన్నీస్ బుక్ రికార్డు లక్ష్యంగా భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసారు. సాగరతీరం 26 కిలోమీటర్లలో ఐదు లక్షలమందితో యోగా కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు మూడు రోజులుగా నగరంలో తిష్టవేసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారంఉదయం మంత్రి నారా లోకేష్ రాగా సాయంత్రం ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచ్చేసారు. విశాఖపట్నం సముద్ర తీరంలో గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సుమారు 5 లక్షలమందితో శనివారం యోగా ప్రదర్శన నిర్వహించేందుకు ప్రభుత్వం యంత్రాంగం శుక్రవారం నాటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రదర్శనకు భారీ ఏర్పాట్లు విశాఖ సముద్ర తీరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి భీముని పట్టణం వరకు మొత్తం 26 కిలోమీటర్ల మేర యోగాభ్యాస ప్రదర్శనను నిర్వహిస్తారు. దీని కోసం మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు గెజిటెడ్ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రతీ కంపార్ట్‌మెంట్లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, పదిమంది వాలంటీర్లు, ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్, పోలీసు అధికారి, గిన్నీస్ రికార్డు నమోదు కోసం కంపార్ట్‌మెంట్‌కు 10 మంది చొప్పున మొత్తం 4,600 మంది ప్రతినిధులు, ఫుడ్ ఇన్‌ఛార్జి ఒకరు, ఇద్దరు సూపర్‌వైజర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, నలుగురు పారిశుధ్య పనివారు ఉంటారు. యోగా ప్రదర్శకులు 1,438మంది, శిక్షకులు 907మందిఈ కంపార్ట్ మెంట్లలో సిద్ధంగా ఉంటారు. మొత్తం 4,280 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా 35మంది పాములు పట్టేవారితో పాటు పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పర్యవేక్షణకు డిప్యుటీ కలెక్టర్లతో పాటు, అఖిల భారత అధికారులు సైతం బాధ్యత తీసుకున్నారు. ప్రతీ కంపార్ట్‌మెంట్‌లో తాగునీరు, 100 మందికి ఒకటి చొప్పున మరుగుదొడ్లు, స్ట్రెచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్నాక్స్ బాక్సులు సిద్ధంగా ఉంటాయి.

# ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్ ముప్పేట దాడి

**జెరూసెలెం,జూన్ 20:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం రాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడింది. 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లోని లక్ష్యాలపై నిప్పులు చెరిగింది. ముఖ్యంగా, ఇరాన్ అణు కార్యక్రమంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఫెన్సివ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ (ఎస్పీఎన్‌డీ) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో దాదాపు 640 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం. ఇరు దేశాల మధ్య ఈ ఘర్షణ వాతావరణం రెండో వారంలోకి ప్రవేశించింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడమే తమలక్ష్యమని ఇజ్రాయెల్ మొదటి నుంచి వాదిస్తోంది. అయితే, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, యూరోపియన్ దేశాలు దౌత్య మార్గాల ద్వారా ఇరాన్‌ను శాంతియుత చర్చలకు తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ విషయంలో తమ దేశం జోక్యంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటామని సంకేతాలిచ్చారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ఐడిఎఫ్ వెల్లడించిన వివరాల ప్రకారం, 60కి పైగా యుద్ధ విమానాలు, సుమారు 120 శక్తివంతమైన ఆయుధాలతో ఈ దాడులు జరిగాయి. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లోని పలు క్షిపణి తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నారు. వీటిని ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కీలక పారిశ్రామిక ప్రాంతాలుగా ఐడీఎఫ్ అభివర్ణించింది. క్షిపణి విడిభాగాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడులు కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనాన్ని ఈ ఆపరేషన్‌లో విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

క్షిపణి విడిభాగాల ఉత్పత్తికి సంబంధించిన సైనిక పారిశ్రామిక ప్రాంతాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి వాడే ముడిపదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడి చేశాం. ఇరాన్ అణ్వాయుధ ప్రాజెక్టును దెబ్బతీసే చర్యల్లో భాగంగా, టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనంపై కూడా దాడి చేయడం జరిగిందని ఐడీఎఫ్ తెలిపింది. ఎస్పీఎన్‌డీ సంస్థ ఇరాన్ సైనిక సామర్థ్యానికి అవసరమైన అధునాతన సాంకేతికతలు, ఆయుధాల పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమ రూపశిల్పిగా పేరుగాంచిన ఫఖ్రి జాదే 2011లో ఈ సంస్థను స్థాపించారు. తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముసురుకుంది.

# కంటతడి

>> వాన్ని జరుపుకున్నారు. ప్రస్తుతం మూడు రోజుల పర్యటన నిమిత్తం డెహ్రాడూన్‌లో ఉన్న ఆమె, ఈ సందర్భంగా అక్కడి అంధుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ పాఠశాల లోని పలువురు అంధ విద్యార్థులు ప్రత్యేక గీతాలను ఆలపించి రాష్ట్రపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల నిష్కల్మష మైన ప్రేమ, వారి గాన మాధుర్యానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చలించిపోయారు. వారి ప్రదర్శన సమయంలో ఆమె భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీటి పర్యంతమయ్యారు. ఈ అపురూపదృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ తన ప్రజా జీవితంలో ఇది అత్యంత హత్తుకున్న క్షణాలలో ఒకటని పేర్కొన్నారు. "కల్మషం లేని ఈ చిన్నారుల స్వరం, వారిలోని అంతర్గత బలం, స్ఫూర్తి మనభారతదేశ నిజమైన ఆత్మను ప్రతిబింబిస్తున్నాయి"అని ఆమె వ్యాఖ్యానించారు. విద్యార్థుల ప్రతిభను, వారి ఆత్మ విశ్వాసాన్ని ఆమె ప్రశంసించారు. ఈ సంఘట నకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## ఎసిబి కస్టడీలో నీటిపారుదల ఇఇ శ్రీధర్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖలో ఇఇగా పనిచేస్తూ అక్రమాస్తుల కేసులో అరెస్టయిన నూనె శ్రీధర్‌ను మరింతగా విచారించేందుకు ఎసిబి అధికారులు శుక్రవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఆయనను వారంరోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఎసిబి అధికారులు కోరగా ఐదురోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతించడం తెలిసిందే. ఈ క్రమంలో చంచల్‌గూడ జైల్లో వున్న శ్రీధర్‌ను ఎసిబి అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించసాగారు. 200 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు కలిగివున్న శ్రీధర్ కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక విభాగంలో పనిచేసినట్లు గుర్తించారు.

## కొండా మురళి వ్యాఖ్యలపై రాజేందర్‌రెడ్డి ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్20:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలపై పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లోని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మంత్రులు కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్ నాగ రాజు, గండ్ర సత్యనారాయణరావు, మాజీ మంత్రులు బస్వరాజు సారయ్య, విజయ రామా రావు, మాజీ ఎంపీ సుధారాణి హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 21-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
దశమి ఉ.7.18, ఏకాదశి రా.4.28
అశ్వని రా.7.47
వర్జ్యం సా.4.06-5.35
దు.ఉ.8.13-9.05, మ.12.36-1.28
శుభసమయం: ఉ.5.20-6.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** బంధువుల తాకిడి పెరుగును. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** దూర ప్రాంతాలనుండి వచ్చిన వార్తవల్ల కొంత ఊరటచెందుతారు. వస్తుసేకరణ.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :** ముఖ్యమైన క్రయవిక్రయాలు నిదానంగా పూర్తిచేస్తారు. ప్రయాణాలలో పరిచయాలు.

**సింహం:** కోర్టుకేసుల నుండి బయట పడతారు. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

**కన్య :** పనులలో ఎదురైన అవరోధాలు, తొలగి ఊరటచెందుతారు. స్వల్ప ధనలాభం.

**తుల :** పరపతి పెరుగుతుంది. పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**వృశ్చికం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు.

**ధనుస్సు:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** శ్రమాధికంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. బాధ్యతలు నెరవేరుస్తారు.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వాహన సౌఖ్యం.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెరుగుతాయి. వివాహయత్నాలు సాగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చర్చలకు సిద్ధం

>> ప్రాజెక్టులపై సమావేశాలు నిర్వహిస్తుందని,దీంతో తెలంగాణ ఆందోళన పడాల్సి వస్తుందని చెప్పారు. గోదావరిలో 968 టిఎంసిలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉందని,కేటాయించింది వాడుకునేందుకు అవకాశం ఇవ్వడం లేదని,కేటాయింపులు వాడుకునే అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదమని పేర్కొన్నారు.కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిదని, వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదని అన్నారు. గోదావరి- బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రీఫీజిబులిటీ రిపోర్ట్ (పిఎఫ్ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోందని,బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైందని అన్నారు. కేంద్రానికి పిఎఫ్ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైందని, పిఎఫ్ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేది కాదని రేవంత్ రెడ్డి తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దామని, ఒక రోజు కాదు 4 రోజులైనా చర్చిద్దామని కోరారు. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని, న్యాయ, సాంకేతికఅంశాలను పరిశీలిద్దామని, వివాదాల పరిష్కారంలో తనకు ఎలాంటి బేషజాలు లేవని చెప్పారు. ఇద్దరు వ్యక్తులు కాదని, రాష్ట్రాల మధ్య వ్యవహారమని ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. కర్ణాటకతో ఏర్పరచుకున్న స్నేహపూరిత సంబంధాలను ఎపితో కూడా కొనసాగించాలని తన ఆకాంక్షనువెల్లడించారు. కింది రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు హక్కులు ఉన్నాయంటున్నారు.. కానీ, అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కూడా జలవివాదాలు అలాగే కొనసాగుతున్నాయని రేవంత్ పేర్కొన్నారు.

రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు రావొద్దనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. 2016లోనే బనకచర్ల ప్రాజెక్టు కోసం పునాదిరాయి పడిందని ఎపి సిఎం అర్థం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టులకు నీళ్లు ఉపయోగించిన తర్వాత మిగిలిన నీళ్లు వరద నీళ్లు అనేది తేలుతుందని, కాబట్టి కూర్చుని చర్చిస్తే ఎవరి గ్రీవెన్స్ ఎంటి అనేది తెలుస్తుందన్నారు. కేంద్రంపై కానీ, ఎపి ప్రభుత్వంపై కానీ ఎటువంటి కామెంట్స్‌చేయను, డిస్కషన్ కోరుకుంటున్నాం. లిటిగేషన్స్ అవసరం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టులో మార్పులు చేయడానికి తెలంగాణ అనుమతి తప్పనిసరిఅని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఎపి మొదట ఎందుకు తెలంగాణను సంప్రదించలేదని ప్రశ్నిచారు. నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడమే తమ అభ్యంతరమని, ఎపి విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు.

ఎవరితోనూ తాము వివాదం కోరుకోవడం లేదని.. ఎవరికోసమో తెలంగాణ హక్కులు వదులుకోమని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో తమ ప్రాజెక్టులు పూర్తయి, పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకున్న తర్వాతే ఎపి వారి ప్రాజెక్టుల గురించి ఆలోచించాలని కోరారు. జలవివాదాలు పెట్టుకోవడం తమ విధానం కాదని, చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకుంటామని అన్నారు. జూలై 6,7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటిస్తామని తెలిపారు. మాకు ఎగువ దిగువ రాష్ట్రాలు ఉన్నాయి, పై రాష్ట్రాతో సమస్య ఉంటే ఆంధ్రప్రదేశ్‌తో కలిసి మాట్లాడాల్సిన అవసరం కూడా ఏర్పడుతుందని చెప్పారు. తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించిన వారిలో నిజాం,కాంగ్రెస్ మాత్రమే ఉన్నారని, కెసిఆర్ ఏదీ నిర్మించలేదని ఆయన స్పష్టం చేశారు. గోదావరి నీటి విషయంలో బిఆర్ఎస్ పార్టీ రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. కృష్ణా జలాల్లో 500 టిఎంసిలకు బ్లాంకెట్ ఎన్ఒసీకి తాను అడిగినందుకు మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పస లేదని చెప్పారు.2023లో కేంద్రానికి హరీష్‌రావు రాసిన లేఖలో కేవలం 405 టిఎంసిలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. నీళ్లు, నిధుల పేరిట మోసపూరిత సెంటిమెంట్‌ని గతంలో బిఆర్ఎస్ నేతలు అడ్డుపెట్టుకున్నారని, ఇప్పుడు జలాలను సంజీవని అని భావిస్తున్నారని సీఎం అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు పునాది పడింది కెసిఆర్ హయంలో, కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీష్‌రావులే, రాయలసీమను రత్నాలసీమ చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కెసిఆర్ అనలేదా అని ప్రశ్నించారు. ఈ ఏడాదిలో పండిన అత్యధిక పంటలకు కాళేశ్వరం నీళ్లకు సంబంధం లేదని, తెలంగాణ ధాన్యాగారంగా మారేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో సంబంధం లేదని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కెసిఆర్ హరీశ్‌రావులు అడ్డగోలు తప్పులు చేశారని, వాళ్ల అబద్ధాలకు దేవుడు కూడా ఆశ్చర్యపోతున్నాడు, బిజెపి గెలిచేందుకు తెలంగాణలో బిఆర్ఎస్ ఆర్గాన్ డొనేషన్ చేసిందని, దీంతో కమలం పార్టీ 8 సీట్లలో విజయం సాధించిందన్నారు.కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మా ఆల్ పార్టీ మీటింగ్‌కు రాకుండా డిల్లీలో వేరే పనులు ఉన్నాయని చెప్పి, మేము కలవాలనుకున్న కేంద్రమంత్రులను ఒకరోజు ముందే కిషన్‌రెడ్డి కలిశారని చెప్పారు. కేటీఆర్‌కు కిషన్‌రెడ్డి లైజనింగ్ అధికారిగా పనిచేస్తున్నారని,కెటిఆర్‌ను తెలంగాణలో ట్విట్టర్ టిల్లు అని పిలుస్తామని సెటైర్లు వేశారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ఎటిఎంలా మారిందని మోడీ, అమిత్‌షా అన్నారని గుర్తుచేశారు. కేబినెట్ నిర్ణయం తర్వాతే కాళేశ్వరం కట్టారని ఎంపీ ఈటల రాజేందర్ చెబుతున్నారని అన్నారు. ఏది నిజమో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రాజకీయాలపై కూడా రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి ఇప్పుడు చంద్రబాబు నాయుడు అవసరమని, ఆంధ్రలో తెలుగుదేశం గెలవాలంటే గోదావరి నీళ్లు అవసరమని ఆయన అన్నారు.

# ప్రపంచానికి భారత్ బహుమతి 'యోగా'

>> ముందు కౌంట్ డౌన్ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో ప్రముఖ యోగా సంస్థలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖ నటినటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మన భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన అద్భుత బహుమతి యోగా అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, ఆ దేశాధినేతలు, ఆ దేశాల ప్రభుత్వాల ఆధ్వర్యంలో యోగాను గుర్తించి, ఆచరిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగాను ప్రపంచానికి పరిచయం చేసి నందుకు తెలంగాణ గడ్డ నుంచి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో వేడుకలు జరుపుకోవాలన్నారు. యోగా 24 గంటల కౌంట్ డౌన్ వేడుకలను ఎల్బీ స్టేడియంలో నిర్వహించుకుంటున్నాం అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలుగు నేల విశాఖపట్నంలో 5 లక్షల మందితో కలిసి యోగాలో పాల్గొనడం సంతోషకరం. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి. యోగా ద్వారా మానసికంగా, శారీరకంగా బాగుంటే మన ఆరోగ్యం బాగుంటుంది. మన కుటుంబం, సమాజం, ప్రపంచం బాగుంటుంది. యోగా సర్వరోగ నివారిణి.యోగా పాటించినట్లయితే జీవితంలో మెరుగైన ఫలితాలు వస్తాయి. యోగాను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరుతున్నానని అన్నారు.మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఎల్బీ స్టేడియంలో పెద్దఎత్తున యోగా కౌంట్ డౌన్ వేడుకలను నిర్వహిస్తున్నందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని అభినందిస్తున్నానని అన్నారు. యోగా వల్ల యోగ్యులవుతారు. మానసికంగా, శారీరకంగా సమతుల్యం సాధించగలరు. ఈరోజుల్లో పని ఒత్తిడితో సతమతవుతున్నారు.

యోగా ఒక థెరపీ, మెడిసిన్, అన్ని సమస్యలకు రెమిడీ యోగా అనేది వన్డే ఈవెంట్, ప్రోగ్రాం కాదు. మన జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ యోగాను అనుసరించాలి. ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా పేరుతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపుతో కనీవినీ ఎరుగని రీతిలో యోగా వేడుకల నిర్వహణకు అన్ని రాష్ట్రాల్లో సన్నాహాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రేపు యోగాడే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొననున్నారని తెలిపారు. ఆదియోగి పతంజలి మహర్షిని స్మరించుకోవడం మనందరి ధర్మం. ఆపరేషన్ సింధూర్‌తో ప్రపంచమంతా విస్తుపోతోంది. మన ఇంట్లో పిల్లలు, స్త్రీ, పురుషులందరికీ యోగాభ్యాసం చేసేలా చేయాలి.యోగా సర్వధర్మాలకు సంబంధించిన ఆరోగ్య శాస్త్రం.యోగా విషయంలో అనవసరమైన వివాదాలు, రాజకీయాలు పనికిరావు. ఎవరు యోగా చేస్తే వారి ఆరోగ్యం బాగుపడుతుందన్నారు.



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో రాష్ట్రపతి తపోవన్ మరియు రాష్ట్రపతి నికేతన్‌లను ప్రారంభిస్తున్న దృశ్యం

# వన్ ఎర్త్.. వన్ హెల్త్

>> సభలో 69/131కింద ప్రవేశపెట్టిన నాటి తీర్మానానికి మొత్తం 175 సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. అప్పటినుంచి ఒక్కొక్క సందేశంతో ప్రతి ఏటా జూన్ 21వ తేదీ యోగా డే నిర్వహిస్తున్నారు. 11వ పర్యాయం నిర్వహిస్తున్న 21వ తేదీ యోగా డేకు 'ఒకే పుడమి ఒకే ఆరోగ్యం'(వన్ ఎర్త్, వన్ హెల్త్) అన్న సందేశాత్మక ప్రచారంతో ఈ యోగా దినోత్సవం అమలుచేస్తున్నారు. ప్రాచీన సాంప్రదాయంనుంచి వచ్చిన అమూల్యమైన వ్యాయామ కసరత్తులుగా పేర్కొంటున్న యోగా వల్ల మన శరీరం, ఆలోచనలు మెరుగుపడతాయని ప్రాచీనకాలంనాటి రుషి పుంగవులే చెప్పారు. వాస్తవానికి ప్రకృతి పరంగా జూన్ 21వ తేదీ సంవత్సరంలో అత్యంత సుదీర్ఘసమయం ఉన్న వేసవి కాలపు చివరిరోజు అని చెపుతారు. ఆరోజు ప్రకృతి మానవశ్రేయస్సు మధ్య సామరస్యాన్ని సూచించేరోజు అయినందున జూన్21వ తేదీనే యోగాడే నిర్వహించాలని నిర్ణయించారు. శనివారం యోగాను దేశంలోని లక్షకుపైగా కేంద్రాల్లో ఏకకాలంలోనిర్వహించనున్నారు. యోగా సంగమంగా పేర్కొంటున్న ఈ ఏడాది కార్యక్రమంలో విశాఖలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న యోగాడే కార్యక్రమాల్లో ప్రధానిమోడీ స్వయంగా పాల్గొని యోగాసనాలు వేస్తారు. ఉదయం 6.30 గంటలనుంచి 7.45 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోకూడా ఈ యోగాడేను ప్రతిఏటా సభ్యదేశాలునిర్వహిస్తున్నాయి. శారీరక మానసిక వికాసం కోసం యోగాభ్యాసన ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నదే భారత్ అభిలాష అని ప్రాచీనకాలనుంచి కొనసాగుతున్న ఈ యోగాప్రక్రియల అభ్యాసన ద్వారా శారీరక ధృఢత్వంతోపాటు మానసిక వికాసం పెరుగుతుందని భారత్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, ప్రైవేటు పారిశ్రామిక వాణిజ్యసంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్‌సంఘాలు, స్వచ్ఛందసంస్థలు, కమ్యూనిటీ బృందాలు, ఇతర ఆసక్తికలిగిన అన్ని సంస్థల్లోను ఈ యోగాడేను నిర్వహించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చైతన్యపరుస్తున్నాయి. అలాగే ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్‌లోకూడా ఈ కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం ఐదునుంచి 6.30 గంటలప్రాంతంలో ఉత్తరభాగం లాన్‌లో యోగాడేను నిర్వహిస్తున్నారు. అలాగే విశాఖలో నిర్వహించే యోగాడే కార్యక్రమంలో మూడునుంచి ఐదులక్షలమంది పాల్గొంటారు. రామకృష్ణబీచ్‌లోని 26 కిలోమీటర్ల పొడవునా భోగాపురం వరకూ ఈ యోగాను నిర్వహించి ప్రపంచంలోనే అతిపెద్ద యోగాడేగా నిర్వహించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో గోనె ప్రకాశ రావు వాంగ్మూలం

## ఓటుకు నోటు ఫోన్ ట్యాపింగ్‌తోనే బయటపడిందని వెల్లడి

## కేంద్రమంత్రి బండి సంజయ్ వాంగ్మూలానికి సిట్ పిలుపు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనంరేపిన ఫోన్ ట్యాపింగ్‌పై సాక్షుల వాంగ్మూలం నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురి వాంగ్మూలం నమోదు చేసిన సిట్ అధికారులు శుక్రవారం నాడు మాజీ ఎంఎల్ఎ గోనె ప్రకాష్ రావు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఉదయం పదిన్నర గంటలకు గోనె సిట్ కార్యాలయానికి వచ్చి జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరికి తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ సర్కారు తన ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసిందని ఆరోపించారు. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్ గోల్‌మాల్ అంతా నాటి సిఎం కెసిఆర్ ఆ దేశాల మేరకు, ఆయన కనుసన్నలలోనే జరిగిందని గోనె ఆరోపించారు. 2015లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు కూడా ఫోన్ ట్యాపింగ్ ద్వారానే జ రిగిందని ఆయన తెలిపారు. ఇందులో పోలీసులను కెసిఆర్‌సర్కారు పావులుగా వాడుకుందని ఆయన ఆరోపించారు. ఇదే క్ర మంలో మూడవసారి అధికారంలోకి వచ్చేందుకు ఎస్ఐబిలో విశ్రాంత ఐజి ప్రభాకర్ రావును నియమించి అడ్డగోలు కార్యకలాపాలకు తెరలేపిందని గోనె తెలిపా రు. పదేళ్ల బిఆర్ఎస్ సర్కారు పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద తప్పిదమని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. దీనిపై జరుగుతున్న విచారణలో ఇప్పటికే అనేక మంది దోషులుగా తేలారని, మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం వుందని ఆయన తెలిపారు. ఈ కేసులో దోషులకు కచ్చితంగా శిక్షలు పడాలని ఆయన తెలిపారు. ఇదిలావుండగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పట్లో కరీంనగర్ బిజెపి ఎంపిగా వున్న బండి సంజయ్‌తో పాటు ఆయన అనుచరుల ఫోన్‌లను కూడా ప్రభాకర్‌రావు బృందం ట్యాపింగ్ చేసినట్లు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు తాజాగాతేల్చారు. ఈక్రమంలో బండి సంజయ్‌కు సిట్ అధికారులు శుక్రవారం ఫోన్ చేసి, మీరు సమయం ఇస్తే ఈ కేసులో వాంగ్మూలం తీసుకుంటామని తెలిపారు.

# డిజిపిలు చెప్పినట్లే 'ట్యాపింగ్'



ప్రభాకర్ రావు

>> నిర్ణయం తీసుకునే వారని, వారు చెప్పినదాని ప్రకారమే తాను తన బృందం నడుచుకుందని సిట్ అధికారుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలిసారిగా ఇద్దరు మాజీ డిజిపిల పేర్లు తెరపైకి వచ్చినట్లయ్యింది. ఇప్పటి వరకు నాలుగుసార్లు సిట్ విచారణకు హాజరైన ప్రభాకర్ రావు శుక్రవారం నాడు ఐదవసారి హాజరుకాగా ఆయనను ఎనిమిదిన్నర గంటల పాటు ప్రశ్నించిన అధికారులు వాటికి సమాధానాలు రాబట్టారు. తనకు రాజకీయ నేతలతో పెద్దగా సంబంధం లేదని, వారెవరో కూడా తనకు తెలియదని, తనను ఎస్ఐబిలో నియమించిన తరువాత ఫోన్ ట్యాపింగ్ విభాగం చూడమని చెప్పింది కూడా నాటి డిజిపిలు మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్‌లేనని ప్రభాకర్ రావు చెప్పారని తెలిసింది. వీరితో పాటు నిఘా విభాగం బాస్‌లుగా వున్న నవీన్ చంద్, అనిల్ కుమార్‌లు కూడా కీలకంగా వ్యవహరించానని వెల్లడించినట్లు సమాచారం. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ఏర్పాటయ్యాక డిజిపిలుగా పనిచేసిన అను రాగ్ శర్మ, మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్‌లతో పాటు అప్పట్లో హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా వున్న జితేందర్, నిఘా విభాగం బాస్‌లుగా పనిచేసిన నవీన్‌చంద్, అనిల్ కుమార్‌ల వాంగ్మూలాలను కూడా సిట్ అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది. కాగా వాంగ్మూలంలో ఈ అధికారులు తాము అప్పటి పరిస్థితుల మేరకు వ్యవహరించామని చెప్పారని తెలిసింది. ఈ విషయాలను సిట్ అధికారులు గోప్యంగా వుంచుతున్నట్లు సమాచారం. ఇందులో జితేందర్, అనిల్ కుమార్‌ల వాంగ్మూలం మాత్రం ఆలస్యంగా బయటపడింది. ఈ కేసులో ప్రభాకర్ రావు మాజీ తాజాగా ఇద్దరు మాజీ డిజిపిలతో పాటు ఇద్దరు నిఘా విభాగం మాజీ బాస్‌ల పేర్లు తెలపడంతో వారిని మరోదఫా విచారించాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు అమెరికా నుంచి తిరిగివచ్చాక విచారణ వేగం పుంజుకోగా కొత్త కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆయనను విచారిం చడం మొదలుపెట్టిన తరువాతే ఈ కేసులో మాజీ డిజిపిలు, నిఘా విభాగం మాజీ బాస్‌ల పాత్ర వుందన్న విషయం రూఢీ అయ్యింది. అయితే ఇందులో ఇప్పటి వరకు ప్రభాకర్‌రావు నేరుగా ఎవరిపేరును వెల్లడించక పోగా శుక్రవారం నాడు మాజీ డిజిపిలు మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్‌తో పాటు నిఘా విభాగం బాస్‌లుగా వున్న నవీన్‌చంద్, అనిల్ కుమార్‌ల పాత్ర వుందని చెప్పారని తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ యూనిట్ ఏర్పాటు మొదలుకొని అన్ని వ్యవహారాలు వీరికి తెలిసే జరిగిందని, తాను నిమిత్తమాత్రుడినని ప్రభాకర్ రావు సిట్ అధికారుల ఎదుట స్పష్టం చేశారని సమాచారం. తన వాదనలకు బలం చేకూరే విధంగా ఆయన కొన్ని పత్రాలను సిట్ అధికారులకు ఇచ్చినట్లు తెలిసింది. ప్రభాకర్ రావును విచారించే క్రమంలో సిట్ అధికారులు ఆయన ఎదుట ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు వాంగ్మూలంతో పాటు ఇదే కేసులో సాక్షులుగా నిలిచిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంఎల్ఎ గోనె ప్రకాష్ రావు, గద్వాల మాజీ జడ్‌పి ఛైర్మన్ సరితతోపాటు ఇతరులవాంగ్మూలాలను వుంచినట్లుతెలిసింది. శుక్రవారం నాటి విచారణలో సిట్ అధికారులు ప్రభాకర్ రావును ఎనిమిదిన్నర గంటల పాటు విచారించగా అవసరం అయితే మరోసారి విచారణకు పిలుస్తామని చెప్పినట్లు తెలిసింది.

**2023 జనవరికి ముందు ట్యాప్ అయిన ఫోన్ల వివరాలు గయాబ్**

ఇదిలావుండగా ఎస్ఐబి ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌లో 2023 జనవరికి ముందు వుండాల్సిన రికార్డులన్నీ మాయం అయినట్లు తేలింది. అయితే ఈ రికార్డుల కు సంబంధించిన చిన్నపాటి ఆధారాలను కూడా ప్రభాకర్ రావు బృందం లేకుండా చేసినట్లు సిట్ విచారణలో తేలింది. 2023 జనవరి నుంచి నవంబర్ నెల వ రకు ట్యాపింగ్ జరిగిన ఫోన్ల వివరాలు మాత్రమే వున్నట్లు తేలింది. ఇందులో 2023 నవంబర్ నెలలో ప్రభాకర్ రావు బృందం 615 మంది ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు సిట్ తేల్చింది. 2023 నవంబర్ నెలలో జరిగిన 615 ఫోన్ల ట్యాపింగ్ వివరాలు తెలుసుకున్న సిట్ అధికారులు వీరిని వరుసగా విచారించేందుకు నిర్ణయించింది. ఇందులో ఇప్పటికే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంఎల్ఎ గోనె ప్రకాష్ రావు సహా పలువురిని విచారించి వారి వాంగ్మూలం తీసుకుంది. బిజెపి ముఖ్యుల వాంగ్మూలం సోమవారం నుంచి నమోదయ్యే వీలుంది.

# రైతు సంక్షేమానికి రూ. లక్ష కోట్లు

## యేడాదిన్నర వ్యవధిలో వ్యవసాయానికి పెద్దపీట

## భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం

## వరి సాగు, దిగుబడిలో తెలంగాణ నంబర్ వన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేసిందని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఒ ప్రకటన విడుదల చేసింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర వ్యవధిలోనే (18 నెలల్లో) రైతుల సంక్షేమం, రైతు కుటుంబాలకు అభ్యున్నతికి అమలు చేసిన పథకాలకు రూ. 1.04 లక్ష కోట్లను ఖర్చు చేసింది.దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తం ఖర్చు చేసిన దాఖలాలు లేవు. తొలి ఏడాదిలోనే ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసి కొత్త రికార్డును రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పింది. ఏకకాలంలో రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసి 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది. గతంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసేందుకు నాలుగైదు విడతలుగా అరకొరగా నిధులు విడుదల చేయటంతో రైతులపై వడ్డీల భారం తడిసి మోపెడైంది. పదేండ్లయినా వాళ్ల అప్పు తీరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్లు పంట రుణాలను మాఫీ చేసింది. రెండు లక్షల రుణమాఫీతో పాటు ఏడాదిన్నరలోనే రాష్ట్రంలో రైతు భరోసాకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసింది. ఇప్పటి వరకు రూ.12,682 కోట్లు రైతు భరోసాను చెల్లించిన ప్రభుత్వం ఈసారి వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం అందించటంలో కొత్త రికార్డు నెలకొల్పింది.జూన్ 16వ తేదీ నుంచి వరుసగా ఐదు రోజుల్లో రూ. 7310.59 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. మొత్తం 65.12 లక్షల మంది రైతులు రైతు భరోసాను అందుకున్నారు. గతంలో రైతు భరోసాను పంపిణీ చేసిన వ్యవధిలో పోలిస్తే ప్రభుత్వం ఈసారి రైతు భరోసాను వేగంగా పంపిణీ చేసిన రికార్డు నమోదు చేసింది. తొమ్మిది రోజుల్లో రూ.9000 కోట్లు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ ఈసారి రైతు భరోసా పంపిణీని వేగంగా పూర్తి చేశాయి.24 గంటల పాటు వ్యవసాయానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్తును అందించింది. రాష్ట్రంలోని 29 లక్షల పంప్ సెట్లకు ఉచిత కరెంట్ సరఫరాకు రూ.16,691 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది. దీంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలోనూ ఈసారి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేసింది. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి రైతులకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో సన్నాల దిగుబడి గణనీయంగా పెరిగింది. దాదాపు 29వేల 562 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని కొను గోలు చే శాం. వడ్లు అమ్మిన 21లక్షల 59 వేల మంది రైతులకు 48 గంటల్లోనే డబ్బు లను వారి ఖాతాల్లో జమ చేశాం. 2023-24లో రూ.20 వేల 964 కోట్ల ఖర్చుతో95.31 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని 15 లక్షల రైతుల నుండి ప్రభుత్వం సేకరించింది. ఈ ఏడాది దేశంలోనే వరి సాగులో తెలంగాణ అన్ని రాష్ట్రాలను మించి కొత్త రికార్డు నెలకొల్పింది. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడితో తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచింది. యాసంగిలో దొడ్డు రకం 80.56 లక్షల మెట్రిక్ టన్నులు, సన్న రకం 46.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. ఇటీవల అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లించింది. బాధిత రైతులకు రూ.260 కోట్ల పంట నష్ట పరిహారం చెల్లించింది.గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో వ్యవసాయ రంగంలో రైతులకు లబ్ధి చేకూర్చే దాదాపు 16 కేంద్ర ప్రయోజిత పథకాలు నిలిచిపోయాయి. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. వీటికోసం దాదాపు రూ. 245 కోట్లు ఖర్చు పెట్టింది. ఆయిల్ పామ్ సాగులోనూ తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మార్చి 2025 వరకు రాష్ట్రంలో 18,985 రైతులు 60,432 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసుకున్నారు. గతంలో టన్నుకి రూ.12,534 ధర ఉన్న ఆయిల్ పామ్ గెలల ధర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రూ.18,748 కి పెరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బిందు, తుంపర సేద్య పరికరాలపై రాయితీ ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న సన్నకారు, బీసీ రైతులకు 90 శాతం, ఇతరులకు 80శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, రైతులందరికీ 75 శాతం రాయితీ తో స్ప్రింక్లర్లను అందిస్తుంది. 2023 డిసెంబర్ నుంచి 40,265 మంది రైతులకు రూ. 282 కోట్ల విలువైన పరికరాలను ప్రభుత్వం అందించింది.

## 3, 4 రోజుల్లో ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్!

### ఇంజినీరింగ్ ఫీజుల సవరణకు కమిటీ వేయనున్న సర్కార్

### అప్పటివరకు పాత ఫీజులే కొనసాగించే అవకాశం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను 3, 4 రోజుల్లో ఉన్నత విద్యా మండలి విడుదల చేయనుంది. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఇతర వృత్తివిద్య కోర్సుల ఫీజులను నిర్ణయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయనున్న నిర్ణయించింది. అయితే రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌ను ఆలస్యం చేస్తే విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవకాశం ఉంటుందని భావిస్తున్న ఉన్నత విద్యా మండలి 3, 4 రోజుల్లో ఎప్ సెట్-2025కి సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. కౌన్సెలింగ్‌ను ప్రారంభించిన విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేసిన తరువాత వారికి వెబ్ ఆప్షన్లు ఇచ్చే నాటికి ఫీజులపై స్పష్టత వస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఉంది. అయితే ప్రభుత్వం నియమించే కమిటీ నివేదిక మేరకు ప్రభుత్వం ఫీజులను నిర్ణయించకపోతే.. గత బ్లాక్ పిరియడ్‌లో ఉన్న ఫీజులనే ప్రస్తుతానికి కొనసాగిస్తారని.. తుది నివేదిక మేరకు ఫైనల్ ఫీజులు ఉంటాయని వెబ్ ఆప్షన్ల సమయంలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా ఫీజుల నిర్ణయం కానీ సందర్భంలో ఇటువంటి ఉత్తర్వుల ద్వారానే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌ను కొనసాగించిన సందర్భం ఉంది. ఇప్పుడు కూడా అలానే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేసి.. ఫీజుల విషయంలో గత ఫీజులనే ప్రస్తుతానికి కొనసాగిస్తూ.. ఫైనల్ నిర్ణయం మేరకు తుది ఫీజులు చెల్లింపు ఉంటుందని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాదికి ఇంజనీరింగ్ ఫీజుల్లో మార్పులు లేకుండానే కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఫీజులు 2025-26 నుంచి 2027-28కి సంబంధించిన బ్లాక్‌పిరియడ్ కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టిఎఎఫ్ఆర్‌సి) ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది. అయితే టిఎఎఫ్ఆర్‌సి ప్రతిపాదిత ఫీజులపై సమగ్ర అధ్యయనం చేయాలని మొన్న బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. సమగ్ర అధ్యయనం కోసం ప్రభుత్వం కమిటిని వేయనుంది. కమిటీ నివేదిక అనంతరం ప్రభుత్వం కొత్త బ్లాక్ పిరియడ్ ఫీజులను నిర్ణయించనుంది.

## రైతు భరోసా ఐదోరోజు రూ.905.89 కోట్లు జమ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు భరోసా కింద మరో 905.89 కోట్ల రూపాయలు మేర విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు ఐదో రోజు శుక్రవారం 7 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు చెల్లించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలోని 2.64 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. కేవలం 5 రోజుల లోనే 7,310.59 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని చెప్పారు. రైతు భరోసా కింద ఈ సీజన్‌లో ఇప్పటివరకు 65.12 లక్షల మంది రైతులు సహాయాన్ని అందుకున్నారని అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన రైతులకు కూడా రైతుభరోసా సహాయని అందచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



## దక్షిణకొరియాపైకి రాకెట్లు ప్రయోగించిన ఉత్తరకొరియా!

**సియోల్, జూన్ 20:** తమకు పొరుగుననే ఉన్న ఉత్తరకొరియా తమపైకి పది రాకెట్లను ప్రయోగించిందని ప్యాంగ్యాంగ్ వద్ద ఉన్న బహుళ రాకెట్ లాంచర్ నుంచి ఈ ప్రయోగాలు చేసిందని దక్షిణకొరియా మిలిటరీ ఆరోపించింది. అమెరికా, జపాన్‌లతో కలిసి దక్షిణకొరియా నిర్వహించిన విన్యాసాల తర్వాతనే ఉత్తరకొరియా ఈ రాకెట్లను ప్రయోగించింది. ఉదయం పది గంటల ప్రాంతంలోనే ఉత్తరకొరియా క్షిపణులు, రాకెట్లు పసుపుసముద్రంలో పడినట్లు దక్షిణ కొరియా తెలిపింది. ప్యాంగ్యాంగ్ సమీపంలోని సునన్ ప్రాంతంనుంచి ఈ రాకెట్లు దూసుకువచ్చినట్లు దక్షిణకొరియా, అమెరికా ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ప్రకటించాయి. 240 ఎంఎం బహుళ రాకెట్ లాంచర్ సియోల్ లక్ష్యంగా ఈపేలుళ్లు జరిపింది. అమెరికా,జపాన్‌లతో కలిసి దక్షిణకొరియా ఇటీవలే వైమానిక విన్యాసాలు జరిపింది. మూడుమార్గాల్లో ఏరియల్ కసరత్తులు నిర్వహించడం ఉత్తరకొరియాకు ఆగ్రహం రప్పించింది. త్రైపాక్షిక రక్షణ సహకారం ఒప్పందం ప్రకారం దక్షిణకొరియా తమ రక్షణ వ్యవస్థను బలపరుచుకునేందుకు ఈ విన్యాసాలుచేసినట్లు చెపుతోం ది. ఈ కసరత్తుల్లో దక్షిణ కొరియాకు చెందిన ఎఫ్15కె, యుఎస్ ఎఫ్16, జపాన్ ఎఫ్2 ఫైటర్ జెట్లు పాల్గొన్నాయి. గతనెలలోనే ఉత్తరకొరియా తూర్పు సముద్రం వైపు అంటే దక్షిణ కొరియాను లక్ష్యంగా చేసుకుని అనేక క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించింది. కొత్త యుద్ధనౌక ప్రారంభం సంద ర్భంగా ఏర్పడిన ప్రమాదం తర్వాత ఈక్షిపణుల ప్రయోగం దక్షిణ కొరియాను కలవర పరు స్తోంది. ఉత్తర కొరియా క్షిపణులు సాండాక్ ప్రాంతం నుంచి వచ్చినట్లు సౌత్ ఆర్మీ గుర్తించింది. లెక్కకుమించిన క్షిపణులను ప్రయోగించిందని దక్షిణకొరియా ఆరోపిస్తోంది.

## రైతు భరోసాకు కొత్తగా 5 లక్షల దరఖాస్తులు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా పంట భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసు కునే అవకాశం కల్పించడంతో గత వారం రోజులుగా దాదాపు 5 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. జూన్ 5 లోపు రిజిస్ట్రేషన్ అయిన పంట భూములకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాకు అనుమతించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 70.11 లక్షల మంది రైతులకు చెందిన కోటి 49 లక్షల ఎకరాలకు రైతుభరోసా అందిస్తున్నారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోవాల్సిన వారికి ఈనెల 20 వరకు గడువు ఇవ్వగా శుక్రవారంతో ఈ గడువు ముగిసింది. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు గ్రామాల్లోని రైతుల నుంచి అప్లికేషన్లు స్వీకరిస్తున్నరు. ఏఈఓలకు రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు వంటి ధ్రువపత్రాలు ఇస్తే, రైతు భరోసా పోర్టల్లో నమోదు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 5 లక్షలకు పైగా అప్లికేషన్లు వచ్చినట్లు సమాచారం. తక్కువ సమయం గడువు ఇవ్వడంతో రైతుల నుంచి ఒత్తిడి పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఐదున్నర లక్షల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గణాం కాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓలు రైతు భరోసా లబ్ధిదారుల నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన డేటా ఆధారంగా రైతుల నుంచి వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు.ఈ వివరాల నమోదుకు గడువు ముగిసింది.

## అంగన్‌వాడీ గుడ్ల టెండర్లను ఖరారు చేయండి

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా టెండర్లను వెంటనే ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. టెండర్ల కాలపరిమితిలో రెండున్నర నెలలు గడచిపోయిందని గుర్తుచేసింది. టెండర్ల ఖారారుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలకు గుడ్ల సరఫరాకు మార్చి 30న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం టెండర్లను ఖరారు చేయకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని జస్టిస్ పుల్లా కార్తీక్ విచారించారు. టెండర్ నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 10 ఆఖరు తేదీ అని, దీనిని జూన్ 16కు పొడిగింపు చెల్లదని పిటిషనర్ వాదించారు. మళ్లీ గడువు పెంపు చేసే అవకాశముందన్నారు. దీనిపై ఏజీ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ గుడ్ల సరఫరాకు ప్రత్యేక విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి టెండరు నోటిఫికేషన్లపై దాఖలైన పిటిషన్‌ను అనుమతించలేమంటూ తేల్చిచెప్పారు.

## ప్రభుత్వ జూ.కాలేజీ విద్యార్థులకు 'తెలంగాణ అచీవర్స్-2025' ఉచిత కోచింగ్

### జెఇఇ, నీట్, క్లాట్‌లకు ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్

### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి) విద్యార్థుల కోసం 'తెలంగాణ అచీ వర్స్-2025' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు జెఇఇ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకుఉచిత, నాణ్యమైన ఆన్‌లైన్ కోచింగ్ అందించ బడుతుం దన్నారు.
ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్ వాలతో భాగస్వామ్యంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులు కూడా జాతీయ స్థాయి పరీక్షలకు సమర్థవంతంగా పోటీ పడేలా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా అధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయములో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో.. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారులతో చర్చించారు. జూలై నెల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం డిసెంబర్ నెల వరకు 'ఫిజిక్స్ వాలా' భాగస్వామ్యంతో కా లేజ్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకుల పర్య వేక్షణలో నిర్వహిం చడం జరుగుతుంది. జెఇఇ, నీట్, క్లాట్ తరగ తులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కెజిబివిల్లో నిర్వహించ బడతాయని కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇందుకు సంబంధించిన లాగిన్ వివరాలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులకు అందించబడ తాయన్నారు. ఈ కార్యక్రమ అమలుకు ముందు, తల్లిదండ్రులు, ఆధ్యాప కులతో ప్రత్యేక అవగాహన సమావేశాలను కాలేజీల ప్రిన్సిపాల్స్ నిర్వహించనున్నారు.

## విద్యుత్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ట్రాన్స్‌కో లోని 18 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఇందులో ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులు కాగా, మరో 11 మంది ఆర్టిజెన్స్ ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన ట్రాన్స్‌కో ఉద్యోగులతో పాటు, ఆర్టిజన్స్‌కు కూడా కారుణ్య నియామకాల్లో అవకాశాలు కల్పిస్తు న్నామని తెలిపారు. ఆర్టిజన్స్‌ను కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వం భావిస్తుందని స్పష్టం చేశారు. కారుణ్య నియామక పత్రాలు పొందిన ఉద్యోగులు సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, డైరెక్టర్లు సూర్య ప్రకాష్, బి. నర్సింగ రావు, జీ నరసింహారావు



## నేడు ఎడ్‌సెట్-2025 ఫలితాలు

### ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విడుదల

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఎడ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్-2025 పరీక్ష ఫలితాలను నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మధ్యాహ్నం 3.45 గంటలకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ వర్సిటీ విసి ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఫలితాలను విడుదల చేయనున్నారు. జూన్ 1న ఎడ్ సెట్- 2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 74 పరీక్షా కేం ద్రాలను ఏర్పాటు చేశారు. ఎడ్‌సెట్- 2025కు 38,758 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 32,106 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. జరిగిన సెషన్‌లో 19,538మందికి గానూ 16,117 మంది (82. 49శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన సెషన్‌కు 19,220 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 15,989 మంది (83.19శాతం)మందిపరీక్షకు హాజరయ్యారు.

## జూరాల పదిగేట్లు ఎత్తివేత

**హైదరాబాద్,జూన్20,ప్రభాతవార్త:** పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వస్తుండటంతో మహబూబ్ నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు నిండటంతో పది గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలిపెడుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం మధ్యాహ్నం పన్నెండు గంటల వకు 71వేల క్యూసెక్కుల వరదనీరు ఎగువ నుంచి వచ్చిచేరుతోంది.
అయితే దిగువకు 75833క్యూసెక్కుల నీరు వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 9.657టిఎంసిలు కాగా ప్రస్తుతం అందులో 7.535 టిఎంసిల నీరు నిలిచిఉంది. జూరాల తొమ్మిది యూనిట్లలో జల విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభించారు.

## సిఎస్‌ను కలిసిన రాష్ట్ర చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్

**హైదరాబాద్ జూన్ 20 ప్రభాతవార్త:** తెలంగాణ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ పి.వి.ఎస్. రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును కలిశారు.దేశవ్యాప్తంగా నో యువర్ పిన్ కోడ్, నో యువర్ డిజిపిన్ ప్రారంభించామని సిఎస్‌కు తెలిపారు.
గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో మెరుగైనసేవ,డెలివరీ కోసం విపత్తు ప్రతిస్పందన, ఆరోగ్యం, పోలీసు,పౌర సరఫరాలు, రెవెన్యూ వంటి కీలకమైన రాష్ట్ర ప్రభుత్వ విభాగాల వర్క్‌ఫ్లోలో డిజిపిన్‌ను ఏకీకృతం చేయాలని అభ్యర్థించారు. ఉదాహరణకు: హైవే ప్రమాదం జరిగినప్పుడు,ఒక కాలర్ ( ఒక వ్యక్తి తన సమాచారాన్ని) వారి స్థానాన్ని వివరించడంలో సమస్యలు ఏర్పడిన పుడు ప్రతి 4మీ చదరపు మీటర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రత్యేకమైన కోడ్ డిజిపిన్ ప్లాట్‌ఫామ్ ఖచ్చితమైన ప్రదేశాన్ని గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందిచేందుకు అవకాశం ఉంటుందన్నారు.
అంతే కాకుండా వరద సహాయ సమయంలో,డిజిపిన్ ప్లాట్‌ఫామ్ ఖచ్చితమైన జియోకోడింగ్ అధికారులను, ప్రభావిత కుటుంబాలను ఖచ్చితంగా ట్యాగ్‌చేసేం దుకు ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ఆహారం, మందులు, షెల్టర్ కిట్‌లను లక్ష్యంగా చేసుకుని ఎటువంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా 1014 గ్రామ పంచాయతీలలో, పోస్టాఫీసులు గ్రామ పంచాయతీ భవనాలలో నడుస్తున్నాయని, మరో 4429 పోస్టాఫీసుల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అవకాశం కలిగించాలన్నారు.
ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు చేయాలని, పోస్టల్ భూముల మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు జారీ చేయాలన్నారు.

## జిఒ 49 కొమరంభీం టైగర్ కారిడార్‌ను రద్దు చేయాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టైగర్ కారిడర్ పేరుతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూముల నుండి, వారు నివసిస్తున్న ప్రాంతాల నుండి దూరం చేసి కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 49 జీవోను తీసుకొచ్చిందని.. ఆ జీవోను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు.
హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా పార్టీ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభిస్తూ తమ్మినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పి ఆశయ్య, ఉడుత రవీందర్, పూసం సచిన్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కుంరంభీం జిల్లా కార్యదర్శి కె రాజన్న, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణతోపాటు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ అటవీ విధానం షెడ్యూల్ ప్రాంతాల్లోని షెడ్యూల్ హక్కులను కాలరాసి, అటవీ ఖనిజసంపదలను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తుందని తమ్మినేని మండిపడ్డారు. ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలను ఆదానికి అప్పజెప్పిందని.. అటవీ ప్రాంతంలోని ఆదివాసీలను అక్కడి నుండి వెళ్లగొట్టి టైగర్ కారిడర్‌ల పేరుతో భూములను తీసుకుటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తులు వస్తే అందులో కేవలం 4 లక్షల ఎకరాలకు మాత్రమే బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలిచ్చిందని.. మిగిలిన 8 లక్షల ఎకరాల సాగు భూమికి కూడా ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిందని తమ్మినేని గుర్తు చేశారు.
కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీ అమలు చేయకపోగా.. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయించి, కేసులు పెడుతుందని మండిపడ్డారు. తక్షణమే ఇటువంటి దుర్మార్గాలను విడనాడి, మిగిలినవారికి కూడా పోడు హక్కు పత్రాలివ్వాలని, వారిపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు లేవన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్, ల్యాబ్ టెక్నీషన్, నర్సుల పోస్టులను భర్తీ చేయాలన్నారు.

## డిఎస్‌సి-2024 ఉపాధ్యాయుల సర్వీస్ అక్టోబర్ 10 నుంచే

### 8 నెలల తరువాత స్పష్టత ఇచ్చిన సర్కార్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత ఏడాది అక్టోబర్‌లో నియమితులైన డిఎస్‌సి-2024 ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డిఎస్‌సి-2024 ఉపాధ్యాయులకు అక్టోబర్ 10, 2024 నుండి సర్వీసు లెక్కించి, వేతనం చెల్లించాలని పేర్కొంటూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీ చేశారు. ఉత్తర్వుల జారీతో గత 8 నెలలుగా డిఎస్‌సి-2024 ఉపాధ్యాయులకు సర్వీస్ లెక్కింపుపై స్పష్టత వీడింది. డిఎస్‌సి-2024 ఉపాధ్యాయుల సర్వీస్ లెక్కింపుపై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులివ్వడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అక్టోబర్ 10 వ తేదీ నుండి వేతనాల బిల్లులను అనుమతించాలని ట్రెజరీ అధికారులను ఆదేశిస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గారు మెమో నంబర్ 530/210/టిఎఫ్ఆరన/2024 ద్వారా ఉత్తర్వుల విడుదల పట్ల టిఎస్ యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. గతంలో తాము పలుమార్లు విద్యశాఖ ఉన్నతాధికారులతోపాటు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకి విజ్ఞప్తి చేశామని.. తమ విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ ఆదేశాల ప్రకారం డిఎస్‌సి-2024 ద్వారా నియామకం అయిన కొత్త టీచర్లకి బడుల్లో చేరిన అక్టోబర్ 16 నుండి వేతనాలు చెల్లించారు.. కానీ ఎల్బీ స్టేడియంలో సిఎం అందచేసిన అక్టోబర్ 10 నుండే వేతనాలు ఇవ్వాలని తాజాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ట్రెజరీ శాఖలకి ఆదేశాలు జారీ చేశారు.

## సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల ఆహ్వానం

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త :** దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు సివిల్స్ అభయహస్తం పథకాన్ని కొనసాగిస్తున్నట్లు సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ రూపొందించిన సివిల్స్ అభయహస్తం కింద ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఈ పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. సింగరేణి సామాజిక బాధ్యత నిధులతో గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## ప్రపంచంలోనే మొట్టమొదటి ఫింగర్ మిల్లెట్ స్పీడ్ బ్రీడింగ్

### ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** ఫింగర్ మిల్లెట్ కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి స్పీడ్ బ్రీడింగ్ ప్రోటోకాల్‌ను ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీ అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) అభివృద్ధి చేసింది. "రాపిడ్‌రాగి" అని పిలువబడే ఈ ఆవిష్కరణ పంట పెరుగుదల చక్రాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఈ మేరకు ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ వెల్లడించారు. వీటి వివరాలను వెల్లడిస్తూ ఇది వేగంగా మరియు మరింత సమర్థవంతంగా సంతానోత్పత్తిని అనుమతిస్తుందని పేర్కొన్నారు. ఈ కొత్త పద్ధతితో, పరిశోధకులు ఇప్పుడు సంవత్సరానికి నాలుగు నుండి ఐదు తరాల రాగులను పండించవచ్చని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
జడ్చర్ల మునిసిపాలిటీ :: మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, మహబూబ్‌నగర్ జిల్లా (TS)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
జడ్చర్ల మునిసిపాలిటీలో 2024-25 సంవత్సరానికి సాధారణ నిధి/16వ FC మరియు PP గ్రాంట్ క్రింద సివిల్ పనుల యొక్క అభివృద్ధికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై 01 పని నిమిత్తం టెండర్ పిలవడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 20.06.2025 ఉ.10.30 గం., బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 21.06.2025, 10.30 PM. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. బిడ్స్‌ను ఆహ్వానించు కార్యాలయం: కమిషనర్, జడ్చర్ల మునిసిపాలిటీ, తెలంగాణ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 7337351867.
DIPR.No.3860-PP/CL/Advt/1/2025-26, తేది: 20.06.2025 సం/- కమిషనర్, జడ్చర్ల మునిసిపాలిటీ

తెలంగాణ ప్రభుత్వం
చిట్యాల మునిసిపల్ కమిషనర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
(సంక్షిప్త టెండర్ ప్రకటన 1వ పిలుపు)
టెండర్ ప్రకటన నం.Lr.No. E1/44/CHITYALA/2No.s/Tenders//2025, తేది: 20.06.2025
1. నల్గొండ జిల్లా చిట్యాల మునిసిపాలిటీలో 2024-25 సంవత్సరానికి 15వ ఫైనాన్స్ ఇతర గ్రాంట్ క్రింద వార్డ్ నం.లు. 6, 7, 8 మరియు 9లో బహిరంగ వరద నీటి కాలువ నిర్మాణం (SC సొసైటీకి రిజర్వ్ చేయబడింది). MGF/PP/15th FC గ్రాంట్: ECV రూ.4.05 (లక్షలలో).
2. అదే జిల్లా అదే మునిసిపాలిటీలో MGF/15వ ఫైనాన్స్/గ్రీన్ బడ్జెట్ వగైరా క్రింద చిట్యాల మునిసిపాలిటీ యొక్క స్వచ్ఛ ఆటో గార్బేజ్ వాహనంకు మినీ వైకుంఠ రథం యొక్క బిల్డింగ్ డిజైనింగ్‌తోసహా మార్పు, MGF/15వ ఫైనాన్స్/గ్రీన్ బడ్జెట్/PP గ్రాంట్: ECV రూ. 1.69 (లక్షలలో).
పై పనులకు టెండర్ షెడ్యూల్ తేదీలు ఈ విధంగా:-
షెడ్యూల్ విక్రయం తెరచు తేది: 23.06.2025 ఉ.11.00 గం.
షెడ్యూల్ విక్రయం ముగింపు తేది: 25.06.2025 సా.04.00 గం.
తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ "www.eprocurement.gov.in" వద్ద చూడవచ్చును.
బిడ్స్ ఆహ్వానించు అధికారి: మునిసిపల్ కమిషనర్, చిట్యాల మునిసిపాలిటీ.
సం/- కమిషనర్, చిట్యాల మునిసిపాలిటీ, నల్గొండ జిల్లా
DIPR.No.3916-PP/CL/Advt/1/2025-26, తేది: 20.06.2025

వార్త


ఒక దేశం నిజమైన సంపద, ఆ దేశపు స్త్రీ, పురుషులలోనే ఉంది. వారు అల్పులు, అనారోగ్యవంతులు, అసంతృప్తులు అయితే అది బీద దేశంగానే ఉంటుంది. వారిది బీదజాతి.

-రిచర్డ్ ఆల్డింగ్టన్

# ఎన్నాళ్లీ రక్తపాతం?

యుద్ధోన్మాదం ఎవరిలో తలెత్తినా చేటు తెచ్చేది ముందుగా అమాయకుల ప్రాణాలకే. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో 3లక్షల మంది సైనికులు, 15వేల మంది పౌరులు, భారత్, పాక్ యుద్ధంలో 72మంది, తాజాగా ఇరాన్ ఇజ్రాయెల్ సమరంలో 663 మంది బలైపోయారు. వీళ్లంతా అమాయకులే. ఆయా దేశాల అధినేతల అహంకారానికి కానీ, అభిలాషలకు గానీ ఆకాంక్షలకు గానీ వీరు భాగస్వాములు కాదు. ఏదో పొట్టకూటి కోసం ప్రాణాలకు తెగించి అమరవీరులైనవారూ ఉన్నారు. సామాన్య జనం కూడా ఉన్నారు. ముప్పు మీదకొచ్చాక తప్పించుకోవడం ఎవరి తరమూకాదు. అసువులు బాయడమే చివరకు జరిగేది. భారత్‌ను తన చేతిలో పెట్టుకోవాలని ప్రయత్నించిన ట్రంప్‌కు పెత్తనం దొరకలేదు కనుక ఈ రెండు దేశాలనూ వారి కర్మకు వారినొదిలేశారు. ఎంతో మొనగాడి దేశంగా చెప్పుకున్న అగ్రరాజ్యం అమెరికా అధినేతగా ట్రంప్ దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలకూ పెద్దన్న పాత్ర వహించాల్సి ఉండగా, కొన్ని దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, కొన్ని దేశాలతో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడం, కొన్ని దేశాలను మిత్రులుగా భావించి వారితో సన్నిహితంగా ఉండడం చేయాలి. కానీ ట్రంప్ మాత్రం కొన్ని దేశాలపై పూర్తి ఆధిపత్యం కావాలని కోరుకుంటున్నారు. ఇప్పుడు ఇజ్రాయెల్ దేశం పనుపున ఇరాన్ ఇజ్రాయెల్‌ల మధ్య సయోధ్యకు కృషి చేయాల్సి ఉండగా ఇజ్రాయెల్ తరపున నేడో రేపో ఇరాన్‌ను అదరకొట్టనున్నారు. ఇరాన్ గగనతలం పూర్తిగా తమ ఆధీనంలో ఉన్నట్లు ట్రంప్ అత్యుత్సాహంగా ప్రకటన చేసేశారు. దీంతో ఇరాన్ ప్రజల ఆందోళన అంతా ఇంతా కాదు. ముందుగా ఎవరు ఎవరి మీద పైచేయి సాధించినా అమెరికాకు వచ్చే ప్రమాదమేమీ లేదు. ఇజ్రాయెల్ అమెరికాతో అంటకాగినా ఇప్పటికిప్పుడు ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య మంటలు రేపేందుకు అమెరికా ప్రయత్నించడం ఏమీబాగో లేదు. ఏకంగా ఇరాన్‌ను లొంగదీసుకునేందుకే అమెరికా నేరుగా యుద్ధరంగంలోకి తరలి వచ్చింది. పశ్చిమాసియాలో అమెరికా తన బలగాలను మోహరిస్తోందంటే ప్రపంచవ్యాప్తంగా కలకలం మొదలైంది. యుద్ధ సన్నాహాలు చేస్తున్న విషయం నిజమేనని అమెరికా రక్షణ మంత్రి పీట్‌హెగ్ సెత్ ధృవీకరించారు కూడా. వ్యూహాత్మక ప్రదేశాలకు అదనంగా ఫైటర్‌జెట్లు, రీఫ్యూయెలింగ్ ట్యాంకర్లు, యుద్ధనౌకలను ఇరాన్‌వైపుకు పంపిస్తోంది. అంటే ఇరాన్ అధ్యక్షుడు ఖోమినీని అంతం చేసే పనికి ట్రంప్ కంకణం కట్టుకున్నారు. కాగా ఇరాన్‌కు ఇంకా కలిసొచ్చేకాలం రాలేదు. ఇరాన్‌కు మిత్రులుగా భావించే ఏ సంస్థా నేరుగా మద్దతు ఇవ్వగలిగిన పరిస్థితిలో లేదు. బలమైన మిత్రదేశాలుగా పేర్కొనబడే రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు ఇరాన్‌పై తమ వైఖరి వెల్లడించడానికి సమయం తీసుకుంటున్నారు. ఇరాన్ నుంచి భారీగా చమురును స్వీకరించే చైనా ఎందుకో మౌనంగా ఉంది. ఆర్థిక సహాయం ఇస్తుందేమో తప్ప ఆయుధ సంపత్తిని సమకూర్చలేకపోయింది. రేపోమాపో ఇరాన్ నుంచి చమురు సరఫరా జరిగే తావులు, బావులను మూసేస్తే అప్పుడు ప్రపంచ దేశాలే తలకిందులయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ఇరాన్ ఇతర దేశాలకిస్తున్న చమురు రవాణా ఆగిపోతే అన్ని దేశాల్లోనూ చమురు ధరలు పెరిగిపోతాయన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. 33 కిలో మీటర్లు వెడల్పు ఉండే 'హర్మూజ్ జలసంధి చమురు రవాణాకు అత్యంత కీలకం. దానిని మూసివేస్తే ప్రపంచానికి సరఫరా అయ్యే చమురులో దాదాపు 25 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే ఇతర దేశాలకు వెళ్తుందని అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ వెల్లడిస్తోంది. ఈ జలసంధి దాదాపు అన్ని చమురు రవాణా చేసే దేశాల నుంచి చమురు అవసరమైన దేశాలకు సంధి మార్గం. దీన్నే మూసేస్తే 'చమురు గతి ఇంతే'లే! అని ఆందోళన పడాల్సిందే. ఈ హర్మూజ్ జలసంధిని మూసి వేయడానికి ఇరాన్ పార్లమెంటు ఆమోదం ఉంది. ఏ క్షణంలోనైనా ఇరాన్ కఠిన నిర్ణయం తీసుకుంటే..చమురు రాక, వచ్చేదారి లేక భారత్‌తోసహా అనేక దేశాలు ఇక్కట్ల బారినపడతాయి. భారత్, పాక్‌ల మధ్యకాల్పుల విరమణ తానే చేసానంటూ డంబాలు పలికినట్రంప్ ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య సయోధ్య ఎందుకు చేయలేకపోతున్నారు. అహంకారమా? యుద్ధోన్మాదమా? ఆయుధ వ్యాపారం కోసమా? అన్నది ఇప్పుడు లోకవ్యాప్తంగా చర్చనడుస్తోంది. ఇదే సందర్భంలో ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య జరుగుతున్నదాడుల్లో వేలాది మంది సమాన్యుల ప్రాణాలు కోల్పోవడం ఎందరినో బాధిస్తోంది. అణుదాడికి ముందుకు ఊరకకుండా అమెరికాయే అన్ని దేశాలనూ తమాయించుకునేలా వ్యవహరిస్తోందని అందరూ అనుకుంటారు. సుద్దులు చెప్పే అమెరికాయే ఇరాన్‌పై యుద్ధసన్నాహాలు చేసుకోవడం దేశాలు విస్మయం చెందుతున్నాయి. ఇరాన్ ప్రజలెవరికీ తాము ఇతర దేశాలతో యుద్ధం చేయడం కానీ ఇతర దేశాలు తమపై దాడులు చేయడాన్ని స్వాగతించడం లేదు. అయినా జరుగరానిదేదో జరిగిపోతోంది. యుద్ధ భూమిలోకి అమెరికా దిగితే తామే మీ చేతులు ముడుచుకొని కూర్చోబోమని ఇరాన్ శ్రేయోభిలాషిగా రష్యా అధ్యకుడు పుతిన్ హెచ్చరించారు. ఇరాన్‌లో అణురియాక్టర్‌ను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. యురేనియం ఉతనపతినత కూడదనే అరాక్‌రియాక్టర్‌ను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌లోని దవాఖానాలను,నివాస భవనాలపై ఇరాన్ దాడులు చేయడం, యుద్ధ నేరమని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఇలా యుద్ధలక్ష్యాలేమిటో నిర్దిష్టంగా లేకుండానే జరుగుతున్న దాడులను ఏ సభ్య దేశమూ హర్షించలేకపోతోంది.

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

రాపిడి లేనిదే రత్నం ప్రకాశించదు. అలాగే కష్టాలను తట్టుకోలేని మానవుడు ఏ నాటికీ అభివృద్ధి చెందలేడు.



డబ్ల్యు.ఎమర్సన్

# ప్రజావాక్కు



### తూకాలలో మోసాలు ఆగేదెలా

రాష్ట్రవ్యాప్తంగా వివిధజిల్లాలలోని కూరగాయల మార్కెట్లు, రోడ్ల వెంబడి అమ్మే కూరగాయల మార్కెట్,చేపల మార్కెట్, చికెన్,మటన్ విక్రయించే షాపులలో తూకంలలో భారీమోసాలు జరుగుతున్నాయి. దీనివల్ల వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. ఒక కిలో కూరగాయలు కొన్న ఎనిమిది వందల గ్రాములు వస్తున్నాయి. వారుపెట్టెతూకం బాట్లు కిలో వుండడంలేదు. ఎలక్ట్రానిక్స్ కాంటాలో కూడా మోసంచేయడం జరుగుతుంది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి వారిమీద చర్యలు తీసుకోవడం లేదు.పండ్ల మార్కెట్‌లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఇకనయినా తూనికలు కొలతల శాఖ అధికారులు స్పందించి నిఘా వేసి పట్టుకుని కేసులు నమోదు చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### శిక్షణ ఇప్పించాలి

తెలంగాణా ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్ అంగరంగ వైభవంగా జరిగిందన్నమాట నిజం. కాని గద్దర్ సామాజిక విలువలు అయన బడుగువర్గాల గురించి చేసిన సేవలు, ఆయన జీవిత లక్ష్యాలను ప్రతిబింబించే అంశాలను టచ్ చేస్తూ వచ్చిన సినిమాలు గాని, రాష్ట్ర పోరాటల అంశంగాఉన్నటువంటి వాతావరణం కనిపించడం లేదని చాలా మంది పెద్దలు బాహాటంగానే చెపుతున్నారు. అగ్రనటులనే చెప్పబడే వారి ప్రవర్తన సందేహ స్థితిలో నెట్టవేయబడింది. ముందు ఏ పి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలువలు, ప్రవర్తనలు, క్రమశిక్షణలకు నియమించిన చాగంటి కోటేశ్వరరావు దగ్గర మన నటులకు శిక్షణ ఇప్పిస్తే బావుంటుంది ప్రజలకు కాదు. లక్షల మంది ఊరికే ఎగబడి జేబులు ఖాళీ చేసుకునే ప్రేక్షకులూ కళ్లు తెరచి చూస్తే కొంచెమైనా మారుతారేమో.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### క్రొయేషియాకు సహకారం

క్రొయేషియాకు ఇటీవల మోడీ పర్యటించడంతో రెండు దేశాల మధ్యసహకారం మొదలైయ్యింది. మోదీని అక్కడి భారతీయులు భారత సంస్కృతి,సంప్రదాయాలతో స్వాగతం పలికారు. క్రొయేషియాకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తాం అనగానే క్రొయేషియా ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

-కనుమ ఎల్లారెడ్డి, హైదరాబాద్

### లంచగొండుల్లో మార్పు రావడం లేదు?

ఈమధ్యన రోజూ ఏ వార్తా దినపత్రికలు తిరగవేసినా పత్రికల్లో లంచం తీసుకుంటూ ఉభయ రాష్ట్రాల్లో ఏ.సీ.బీకి చిక్కిన ప్రభుత్వ ఉద్యోగి అంటూ వార్తలు వస్తున్నాయి. రోజూ పత్రికల్లో ఇటువంటి వార్తలు కామన్ అయిపోయాయి. అయితే రోజూ ఉభయ రాష్ట్రాల్లో ఏ.సీ.బీ అధికారులు దాడులు చేస్తున్నా ప్రభుత్వ అధికారుల్లో ఎందుకు మార్పురావడం లేదు. కారణం వారిలో భయంలేకపోవడం. రోజులు మారుతున్నకొద్దీ చట్టాలు మారాలి. తప్పు చేస్తే వెంటనే శిక్ష పడాల్సిందే. ఇలా ఏ.సీ.బీకి చిక్కిన ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగి అయినా వెంటనే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించి వారికి పెన్షన్ సదుపాయం కూడా రద్దు చేయాలి.అప్పుడే మిగతాప్రభుత్వ ఉద్యోగులకు ఇంకోసారి లంచం అడగాలంటే భయపడతారు. కావున ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయం సీరియస్‌గా తీసుకోవాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### యుద్ధాలు శాంతిస్థాపనకు అవరోధాలు

ఎవరి మధ్యవర్తిత్వం వల్ల ఆపరేషన్ సిందూర్‌ను ఆపలేదని కేవలం యుద్ధం చేయలేక పాకిస్థాన్ ప్రాధేయ పడితేనే కాల్పులను విరమించామని ప్రధాని మోడీ మరల ట్రంప్‌కు ఫోను చేసి చెప్పినప్పటికి ఆ మరుక్షణమే తనచొరవవల్లే యుద్ధం ఆగిందని ప్రగల్భాలు పలకడం మానలేదు. ఎవరి వల్ల ఎక్కడ దాడులు సంభవిస్తాయనే భయంతో సన్నద్ధంగా ఉండాలని అన్ని దేశాలు అణ్వాయుధాలను తయారు చేసుకుంటున్నాయి. ఈయుద్ధాలు శాంతి స్థాపనకు తీవ్ర అవరోధాలు. దేశాభివృద్ధి మానవ మనుగడకే పాటుపడాలి కాని స్వార్థచింతనతో వినాశనానికి దారి తీయకూడదు. దేశాభివృద్ధి మానవ మనుగడకే పాటుపడాలి కాని స్వార్థ చింతనతో వినాశనానికి దారితీయకూడదు. గత చరిత్రంతా యుద్ధాలమయం. ఏజాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం నరజాతి సమస్తం పరపీడన పరాయణం అని మహాకవి శ్రీశ్రీ దశాబ్దాల క్రితమే అన్నాడు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### నిరుద్యోగులకే అవకాశం ఇవ్వాలి

డిఇడి., బిఇడి.,ఎంఇడి కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్లలో ఇదివరకే ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి పెన్షన్ తీసుకునే వారిని నియమించకుండా వారిని అనర్హులుగా ప్రకటించి, ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్న యువతకు ఆ పోస్టులను ఇవ్వాలి.

-మేడి. నరేష్ కుమార్,హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అడవులతోపాటు కనుమరుగవుతున్న వన్యప్రాణులు!

**ఇటు పోలీసులు, అటు స్మగ్లర్లు వారి వెనుక ఉన్న కొందరు రాజకీయ నాయకులు పదఘట్టనలతో నలమల శేషాచలం అడవులు అతలాకుతలం అవడం తరచుగా జరుగుతున్నది. దీంతో వన్యప్రాణులు తలదాచుకునేందుకు ఆ ప్రాంతాల్లో స్థావరాలు లేకుండాపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరుగుతున్న పోరుతో ఈ వన్యప్రాణులకు అడవుల్లో నివసించే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.దేశంలోని ఇంకొన్ని ప్రాంతాల్లో వేట నిరాటకంగా జరుగుతున్నది. ఒకప్పుడు ఆహారం కోసం, ఆ తర్వాత సరదాగా ఆరంభమైన వన్యప్రాణుల వేట ఇప్పుడు వ్యాపారంగా రూపాంతరం చెందింది.**

దామెర్ల సాయిబాబ

అటవీ రక్షణకు వేలాది కోట్లరూపాయలు వెచ్చిస్తున్నాం, అడవులను ధ్వంసం చేసేవారిపై ఉక్కుపాదం మోపి అణచివేస్తామని అటు కేంద్ర పాలకులు, ఇటు రాష్ట్రాలపాలకులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగిపోతున్నది.యేటా దేశవ్యాప్తంగా వందలాది ఎకరాల అడవులు కనుమరుగైపోతున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అన్నింటి కంటే ముఖ్యంగా రాజకీయ జోక్యంతో చట్టాలున్నా ప్రయోజనం లేకుండాపోతున్నది. అరణ్యాలను స్మగ్లర్లు, వేటగాళ్లకు వదిలి కొందరు అధికారులు జనారణ్యాలకు పరిమితి కావడంతో పరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. తాజాగా గత నెలలో ఒక పెద్దపులి స్మగ్లర్ల ఉచ్చులోపడి ప్రాణాలు వదిలింది. ఇలా పులి స్మగ్లర్ల కాటుకు బలికావడం ఇది మొదటి సారి కాదు చివరిదీ కూడా కాదు. అడవుల్లో ఆహారందొరకక జనవాసాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న కాకులు దూరని కీకారణ్యాలుగా పేరొందిన నల్లమల, దండకారణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. దీంతో ఈ అటవీ సంపదతతోపాటు వాటిఆధారంగా శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న వన్యప్రాణులు వేటగాళ్ల నుండి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇటీవల పులులు, ఎలుగుబంట్లు, అడవిపందులు, కొండముచ్చులు తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారం కోసం రైతుల పంటలపై పడుతున్నాయి.శ్రీకాకుళం, విజయనగరం, తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో అడవి ఏనుగులు చొచ్చుకువస్తున్నాయి. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాగుచేసుకుంటున్న పంటలు నోటికి అందుతున్న దశలో వన్యప్రాణులు ధ్వంసం చేయడంతో కరెంటు తీగలుపెట్టో, లేక పురుగు మందులతోనో వాటిని హతమార్చే ప్రయత్నాలు పెరిగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిత్యంవేట కొనసాగుతున్నది. ఇకఅరుదైన ఎర్రచందనం వృక్షసంపదను విదేశాలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు కడప, చిత్తూరు, నెల్లూరు,తదితర జిల్లాల్లో స్మగ్లర్ల ఆగడాలకు అంతేలేకుండాపోతున్నది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కాల్పులు జరుపుతున్నా ప్రాణాలను లెక్కచేయకుండా స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారు. అత్యంత విలువైన ఈ అటవీ సంపద కేవలం నెల్లూరు, చిత్తూరు, కడప సరిహద్దుల్లో, వెలిగొండలు, శేషాచలం అడవుల్లో మాత్రమే పెరుగుతాయి. ప్రపంచంలో ఇంకెక్కడ ఈ అరుదైన వృక్షాలు పెరగడం లేదు.పెరిగినా ఆశించిన స్థాయిలో నాణ్యత ఉండడంలేదు. అందుకు కారణం ఏమిటో కొన్ని వందల సంవత్సరాలుగా పరిశోధనలు చేసినా వృక్షశాస్త్రజ్ఞులు కొనుగొనలేకపోయారు. గతంలో ఒకసారి బ్రిటిష్ పాలకులు ఇంగ్లాండుకు తీసుకువెళ్లి అక్కడ పెంచే ప్రయత్నాలు కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. మరెక్కడా దొరక్కపోవడం, ఆంధ్రప్రదేశ్ నుంచి వీటిని తరలించుకుపోవడం పెరగడంతో ఈ అరుదైన వృక్షసందను కాపాడేందుకు 1973లో (కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పీసీఎస్)లోకి చేర్చారు. దాంతో ఎర్రచందనం ఎగుమతులపై నిషేధం అమలులోకివచ్చింది.అయినా ఆనాటి నుంచి ఏదో ఒకరూపంలో విదేశాలకు ఎగుమతి అవు తూనే ఉంది. సముద్రమార్గాల ద్వారా దేశసరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్తవ్యూహాలు అనుసరిస్తూనేఉన్నారు. రోడ్డుమార్గం ద్వారా కూడా ఈ అక్రమరవాణా సాగిస్తున్నారు. ఢిల్లీ, చండీఘడ్ గోదాముల్లో దాచిన సరుకును సమయం చూసి నేపాల్‌కు తరలించి అక్కడ నుంచి చైనాకు

ఒక్క మాట

చేరవేస్తున్నారు. మిజోరం, మణిపూర్ రాష్ట్రాలు అక్రమ రవాణాకు అడ్డాగా మారిపోయాయి. మొన్న ఆ మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దించి భద్రతను కట్టుదిట్టం చేసింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇరవై మందికిపైగా కూలీలు చనిపోయారు. ఈ కూలీల వెనుక ఉన్న పాత్రధారుల కోసం కూడా పోలీసులు గాలింపులు అప్పట్లో చేపట్టినా అంతగా ఫలితం లేకుండాపోయింది. ఇటు పోలీసులు, అటు స్మగ్లర్లు వారి వెనుక ఉన్న కొందరు రాజకీయ నాయకులు పదఘట్టనలతో నల్లమల శేషాచలం అడవులు అతలాకుతలం అవడం తరచుగా జరుగుతున్నది. దీంతో వన్యప్రాణులు తలదాచుకునేందుకు ఆ ప్రాంతాల్లో స్థావరాలు లేకుండాపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరుగుతున్న పోరుతో ఈ వన్యప్రాణులకు అడవుల్లో నివసించే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.దేశంలోని ఇంకొన్ని ప్రాంతాల్లో వేట నిరాటంకంగా జరుగుతున్నది. ఒకప్పుడు ఆహారం కోసం, ఆ తర్వాత సరదాగా ఆరంభమైన వన్యప్రాణుల వేట ఇప్పుడు వ్యాపారంగా రూపాంతరం చెందింది. ఆదిమానవుని జీవనం వేటతోనే ఆరంభమైనట్లు చరిత్ర చెబుతున్నది. కేవలం తమ ఆకలిని తీర్చుకోవడానికి ఆనాటి ఆది మానవుడు వేటాడేవారని చరిత్ర ఆధారాలు వెల్లడిస్తున్నాయి. రాజుల కాలంలో వేటను సరదాగానో, తమప్రతిష్ఠ కోసం కొనసాగించారు. పులులనువేటాడి చంపితే ఎంతో గౌరవప్రతిష్ఠలు లభించినట్లు భావించేవారు. విల్లంబులతో నాటు పద్ధతులతో పులిని వేటాడటం సామాన్యమైన విషయం కాదు. ఎంతో రిస్క్ ఉంటుంది. ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు.పులి అడుగుల గుర్తులను బట్టి మంచినీటి స్థావరాల వద్ద కొద్దిరోజులు మాటు వేసి మట్టుపెట్టేవారు. 1526 నుంచి 1857వరకు వేట జోరుగా సాగినట్లు ఆధారాలున్నాయి. ఆ తర్వాత మనదేశానికి బ్రిటిష్ వారితోపాటు తుపాకులు రావడంతో వేట మరింత సులభతరం అయింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వేటకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. కొందరు సంస్థానాధీశులు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, పెద్దపెద్ద భూస్వాములు తాము ఎన్నిపులులు వేటాడింది సగర్వంగా ప్రకటించుకునేవారు. వాటి తలలను వాకిలిముందు పెట్టుకునేవారు. చర్మాలతో సోఫాసెట్ చేయించేవారు. తాము సాగించిన వేటలో మృతిచెందిన పులల దేహాలతో ఫొటోలు తీయించుకొని ప్రదర్శించుకునేవారు. ఇప్పటికీ కొందరు ఇళ్లల్లో ఫొటోలు దర్శనమిస్తాయి. దీనికితోడు గోర్లు, చర్మం తదితర పులి అవయవాలకు డిమాండ్ పెరిగి అమ్మకాలు ఆరంభమయ్యాయి. దీంతో విచ్చలవిడిగా వేట కొనసాగింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో నలభైవేలు ఉన్న పులుల సంఖ్య1972 ప్రాంతానికి మూడువేలకు తగ్గిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అసలు పులుల జాతి ఆనవాళ్లు లేకుండా అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తం కావడంతో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ వన్యప్రాణుల సంరక్షణ చట్టాలను 1972 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. వేటాడటం నిషేధించడంతోపాటు పులుల పెంపుదలకు కొన్ని ప్రత్యేక పథకాలు చేపట్టారు. అందులోభాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు 23 టైగర్ ప్రాజెక్టులను ప్రారంభించాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం వద్ద ఒకప్రాజెక్టు ప్రారంభమైంది. ఒక పక్క పులుల పెంపుదలకు కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నా మరొకపక్క వాటి వధ కూడా అంతకురెట్టింపు స్థాయిలో జరుగుతున్నదేమోననిపిస్తున్నది. మొన్న ఆసిఫాబాద్ జిల్లాలో తిరుగుతున్న కె-8అనే ఆడపులి పెంచికల్ పేట మండలం ఆగర్‌గూడ గ్రామం సమీపంలోని పాత చిచ్చాల అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు అమర్చిన విద్యుత్ తీగలకు మృత్యువాతపడింది. దాన్ని స్మగ్లర్లు రెండువందల మీటర్లవరకు మోసుకువెళ్లి చర్మం, గోళ్లు తదితర విలువైన శరీర బాగాలను తీసుకొని మిగిలిన వాటిని భూమిలో పాతిపెట్టిన విషయం అటవీ అధికారులకు సమాచారం అందడంతో గతనెల పదహారున ఆ ప్రాంతానికి వెళ్లి పులిని పాతిపెట్టిన స్థలాన్ని గుర్తించి,శరీరభాగాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత వారంలో మరొక చిరుతపులి కర్నూలు జిల్లాలో పొలంలో పడిపోయి ఉంది. అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్న విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో దాన్ని తరలించి చికిత్స అందిస్తున్నారు. దానిపై కూడా విషప్రయోగం జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కపక్క అడవులు తగ్గిపోతున్నాయి. మరొకపక్క విజృంభించిన విషప్రయోగాలతోనో, విద్యుత్ కంచెలతోనో వన్యప్రాణులను మట్టుపెడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత సవరించి కట్టుదిట్టంగా అమలు చేయాలి. వన్యప్రాణులను కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా అన్నిస్థాయిలో ప్రయత్నాలు జరగాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు కూడా పాలుపంచుకోవాలి. ●

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో శుభ్రతకు పెద్ద పీట వేయాలి!


బి.మధుపాళి

మన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి పట్ల ఎంతో శ్రద్ధాశక్తులు కనబరుస్తూ అక్కడి పరిసరాల పరిశుభ్రతను,మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు తగిన బడ్జెట్ ఏర్పాటు చేసి ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ అసుపత్రిలోని కొంతమంది సిబ్బంది నిర్లక్ష్య వైఖరి మూలాన అక్కడి రోగుల వార్డులు ఎలుకలకు, దోమలకు, పాములకు, విషసర్పాలకు నిలయాలుగా మారుతూ రోగులకు ఆ వార్డులు ఒక నరకకూపంగా మారుతుండటం కడు శోచనీయం. ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స శక్తికి మించిన పని కావడంతో బీద, బిక్కి, నిరుపేదలు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యం చేయించుకునే నిమిత్తమై ప్రభుత్వ ఆసుపత్రులకు నిత్యం ఎంతో దూర ప్రాంతాల నుంచి వందలాది మంది వస్తూ వుంటారు. మరీ వారికి లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న డాక్టర్లు,వేలాది రూపాయల జీతాలు తీసుకుంటున్న దిగువ స్థాయి ఆరోగ్య సిబ్బంది వంటివారు తమ వృత్తికి తగిన న్యాయం చేస్తూ రోగుల వార్డులు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకునే గురుతర బాధ్యత ముమ్మాటికీ వారి భుజస్కందాలపై వుంది. ఇందులో భాగంగా అక్కడి బాత్రూంలలో గాని, వార్డులలో గాని ఎక్కడైనా పెద్దపెద్ద రంధ్రాలు వుంటే తక్షణమే వాటినిపూడ్చి మరమ్మత్తులపై దృష్టి పెట్టాలి. అప్పుడే అక్కడి వార్డులలో పాములు, ఎలుకలు,దోమలు వంటివి చొరబడకుండా రోగులు తగిన రక్షణలో ఉండగలుగుతారు. ఏదిఏమైనా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు అనేవి సామాన్యులకు, నిరుపేదలకు ఓ దేవాలయాల వంటివి కాబట్టి అక్కడికి విచ్చేసే రోగుల పట్ల భగవంతుడు భక్తులకు అనుగ్రహమిచ్చినట్లు, అక్కడి డాక్టర్లు, మిగతా ఆరోగ్య సిబ్బంది వారిపట్ల ఎంతో ప్రేమానురాగాలతో, అప్యాయతతో నడుచుకొని, వారు చేరిన వార్డులలో ఎలాంటి అపరిశుభ్రత వాతావరణం లేకుండా యుద్ధ ప్రాతిపదికన తగు జాగ్రత్తలు తీసుకోవాలి.ఏమైనా ఆరోగ్యమే మహాభాగ్యం అంటారే అలా ఆనారోగ్యంపాలైన తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలకు వచ్చే నిరుపేద రోగుల పట్ల కాస్త కనికరం చూపి అక్కడి పరిసరాలలో దుమ్ము,ధూళి పేరుకు పోకుండా, విష పురుగులు,తేళ్లు వంటివి సంచరించకుండా అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాల్సిన తక్షణ కర్తవ్యం, బాధ్యత ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై ఎంతైనా వుంది. నిరుపేద రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులు అనేవి తమ ప్రాణాలు నిలబెట్టే ఒక రక్షణ కవచంలా ఉండాలి కాని, భయ భ్రాంతులు కలిగించేలా చెత్త, చెదారంతో, అపరిశుభ్రతకు కేర్ ఆఫ్అడ్రస్‌గా ఎలాంటి పరిస్థితుల్లో మారకూడదు.ఇలా అపరిశుభ్రతకు నిలయాలుగా దురదృష్టవశాత్తు మన ప్రభుత్వ ఆసుపత్రులు మారితే పేద, నిరుపేద రోగులకు వచ్చిన జబ్బు మాట దేవుడెరుగు లేని కొత్త జబ్బులు కొని తెచ్చుకున్న వారవుతారు. కాబట్టి ప్రభుత్వ దవఖానకు వచ్చేరోగులకు మెరుగైన వైద్యం చేసి వారి జబ్బు నయం అయ్యేలా చూడాలి. కానీ వారికి సకాలంలో వైద్యం అందించకుండా వారికి వచ్చినజబ్బు మరింత ముదిరిపోయేలా,వారిని మరింతగా శిక్షించేలా బాధపెట్టేలా వైద్యం ఉండకూడదు. ●


# విశ్వంతో అనుసంధానించే సంపూర్ణ జీవన విధానం యోగా

డి.జయరాం

వేల ఏళ్ల క్రితం మన పుణ్యభూమిలో ఒక లోతైన తత్వంగా, ఆధ్యాత్మిక సాధనగా అంకురించిన యోగా, నేడు ప్రపంచ నలుమూలలకూ విస్తరించి, విభిన్న సంస్కృతుల ప్రజలకు శాంతిని, శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తోంది. గంగానది పురాతన ఒడుల నుండి పశ్చిమ దేశాల ఆధునిక నగరాల దాకా సాగిన ఈ యోగా ప్రస్థానం, మన కాలాతీత జ్ఞానానికి, నిబద్ధతతో కూడిన కృషికి, మన అమూల్యమైన వారసత్వాన్ని మానవాళితో పంచుకోవాలనే భారతదేశ అకుంఠిత దీక్షకు ఓ సజీవ నిదర్శనం. ఈ సంవత్సరం, 'ఒకటే భూమి ఒకటే ఆరోగ్యం కోసం యోగా' అనే నినాదం ప్రధానంగా నిలుస్తోంది. 2025 ఇతివృత్తం శారీరక, మానసిక శ్రేయస్సుతో పాటు పర్యావరణ పరిరక్షణలో యోగా పాత్రను ప్రముఖంగా చాటుతుంది. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించినప్పటి నుండి సాధించిన విజయాలకు ఇది ప్రతీక. ముఖ్యంగా, 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తాన్ని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ప్రకటించడం విశేషం. యోగా ద్వారా ప్రపంచాన్ని ఆరోగ్య పథంలో నడిపించాలనే ఆయన దార్శనికతకు ఇది ప్రబల నిదర్శనం, పర్యావరణ స్పృహ, మానవ ఆరోగ్యం మధ్య సామరస్యాన్ని నొక్కి చెబుతుంది. యోగా అంటే కేవలం రకరకాల భంగిమలు వేయడమే అనుకుంటే పొరపాటు! ఇది ఒక సంపూర్ణ తత్వశాస్త్రం, ఒక ఉన్నత విజ్ఞాన శాస్త్రం, అన్నిటికీ మించి ఒక జీవన కళ. సంస్కృత ధాతువు 'యుజ్' నుండి ఉద్భవించిన 'యోగా' అంటే చేరడం, కలపడం, లేదా ఏకం కావడం. ఇది మనసుశరీరం, ఆలోచన ఆచరణ, మనిషిప్రకృతి మధ్య ఏకత్వాన్ని సూచిస్తుంది. వ్యాధుల నివారణకు, సంపూర్ణ ఆరోగ్యానికి, జీవనశైలి సమస్యల పరిష్కారానికి యోగా ఒక గొప్ప మార్గమని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ఆధునిక విజ్ఞానం కూడా ఈ సత్యాన్ని నిరూపిస్తోంది! మనలోని చైతన్యాన్ని విశ్వ చైతన్యంతో అనుసంధానించడమే దీని అంతిమ లక్ష్యం. ఐదు వేల ఏళ్ల నాటి సింధు లోయ నాగరికతలో సైతం యోగా ఆనవాళ్లున్నాయి. ఋగ్వేదం, ఉపనిషత్తులు యోగా గురించి ప్రస్తావించగా, క్రీ.శ. 400 ప్రాంతంలో మహర్షి పతంజలి తన యోగా సూత్రాలలో అష్టాంగ యోగాను క్రమబద్ధీకరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక కీలకమైన ప్రజా ఆరోగ్య ఉద్యమంగా మారింది. భారతదేశ ప్రజా ఆరోగ్య విధానాలలో దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఇటీవలికాలంలో జరిగిన ఒక అద్భుతమైన ఘట్టం. దీనికి ప్రధానంగా ప్రధా ని నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వమే కారణం. 2014 లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఆయన యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సంకల్పించారు. 2014 సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన చేసిన తొలి ప్రసంగం చారిత్రాత్మకం. 'యోగా భారతదేశ సనాతన సంప్రదాయపు అమూల్యమైన బహు



మతి... వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో యోగా మనకు సహాయపడుతుంది. కాబట్టి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్వీకరించడానికి కృషి చేద్దాం' అన్న ఆయన పిలుపు విశ్వవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. కేవలం రెండున్నర నెలల వ్యవధిలోనే, 2014 డిసెంబర్ 11న, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూన్ 21ని అంత ర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించే తీర్మానాన్నిరికార్డు స్థాయిలో 177 సభ్య దేశాల మద్దతుతో ఆమోదించింది. ఐక్యరాజ్యసమితి చరిత్రలో ఇంతటి ఏకాభిప్రాయం అరుదు. ఇది యోగా సామర్థ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తించడాన్ని, భారతదేశానికి గొప్ప దౌత్యవిజయాన్ని చాటిచెప్పింది.ప్రధాని మోడీ కేవలం దినోత్సవ ప్రకటనతో ఆగకుండా, యోగాను ప్రపంచవ్యాప్తం చేయడానికి ఒక బహుముఖ, వ్యూహాత్మక విధానాన్ని అనుసరించారు.యోగాను భారతదేశసాంస్కృతిక వారసత్వంలో భాగంచేసి, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంచే సాఫ్ట్‌పవర్ డిప్లొమసీ సాధనంగా ఉపయోగించారు. మోడీ స్వయంగా యోగాసాధన చేస్తూ, బహిరంగంగా ప్రచారం చేయడం ద్వారా లక్షలాది మందికి ఆదర్శంగా నిలిచారు. అలాగే, 2014లో ఆయుష్ మంత్రిత్వ శాఖను స్థాపించడం ద్వారా యోగా ప్రోత్సాహానికి అధికారికమద్దతు లభించింది. ప్రపంచ రికార్డుల విషయానికి వస్తే, 2015లో ఢిల్లీలో 39,000 మందితో, 2023లో న్యూయార్క్‌లో 135కు పైగా దేశాల ప్రతినిధులతో యోగా చేసి గిన్నిస్ రికార్డులు నెలకొల్పారు. ఇవి యోగా ఐక్యతాశక్తిని చాటాయి. యోగా కేవలం భారతదేశ అజెండా కాదని,మానవాళి శ్రేయస్సు కోసమని ఆయన నొక్కి చెప్పారు, తద్వారా ప్రపంచ భాగస్వామ్యాన్ని పెంపొందించారు. యోగాకు పెరుగుతున్న ప్రాచుర్యానికి దాని అపారమైన ప్రయోజనాలే కారణం. శారీరకంగా, యోగా వశ్యత, బలం,సమతుల్యత,భంగిమను మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది, రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది, బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. దీర్ఘకాలిక నొప్పులు, శ్వాసకోశ, జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని అనేకమంది చెబుతారు.మానసికంగా, భావోద్వేగపరంగా యోగా లోతైన ప్రభావం చూపుతుందని శాస్త్రీయంగానూ నిరూపితమవుతోంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, యాప్‌లు, యోగా స్టూడియోల విస్తరణ ద్వారా అందుబాటు పెరగడం, ప్రముఖులమద్దతు, సోషల్ మీడియా ప్రభావం యోగా ప్రజాదరణకు దోహదపడ్డాయి. దేశవ్యాప్తంగా లక్షకు పైగా ప్రదేశాల్లో 'యోగా సంగం'పేరిట సామూహిక యోగా ప్రదర్శనలు జరగనున్నాయి. విశాఖపట్నం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన వేదికగా నిలవనుంది. ఇక్కడ ప్రధాని మోదీ పాల్గొననున్నారు, సుమారు 2.5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "యోగాంధ్ర 2025" పేరుతో నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా ఉత్సవాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందులో రెండు కోట్ల మందిని భాగస్వామ్యం చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. యోగా ప్రోత్సాహానికి కృషి చేసిన వారికి "పీఎం యోగా అవార్డులు 2025" కింద ట్రోఫీ, సర్టిఫికెట్, రూ. 25 లక్షల బహుమతి లభిస్తాయి.ఇతర కార్యక్రమాలలో యోగ బంధన్ (10 దేశాలతో ప్రపంచ భాగస్వామ్యం), యోగ పార్కులు (1,000 యోగా పార్కుల అభివృద్ధి), యోగ సమావేశాలు (దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం), యోగ ప్రభవ (ప్రజా ఆరోగ్య ప్రభావం అంచనా), యోగ కనెక్ట్ (వర్చువల్ గ్లోబల్ సమ్మిట్), హరిత్ యోగ (చెట్ల పెంపకం), యోగ అన్‌ప్లగ్డ్ (యువత కోసం), యోగ మహా కుంభ్ (వారం రోజుల ఉత్సవాలు), సమ్యోగం (ఆధునిక ఆరోగ్య సంరక్షణతో అనుసంధానం) వంటివి ఉన్నాయి. ●



# దాడులు ఆపాలని భారత్‌ను మేమే అడిగాం

## పాకిస్థాన్ ఉపప్రధాని ఇషాక్‌ధర్ ఒప్పుకోలు

**ఇస్లామాబాద్, జూన్ 20:** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ పాకిస్థాన్‌లోని అనేక ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. తర్వాత ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందాన్ని తానే కుదిర్చానని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన స్పష్టతతో మాట మార్చుకున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తాజాగా పాక్ ఉప ప్రధాని ఇషాక్ ధర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తమపై దాడులు ఆపాలని భారత్‌ను కోరింది వాస్తవమేనని అంగీకరించారు. ఆ సమయంలో భారత్ తమ ముఖ్య వైమానిక స్థావరాలైన నూర్ ఖాన్, షోర్కోట్‌లపై దాడి చేసిందని ఇషాక్‌దార్ వెల్లడించారు. ఈ దాడుల వల్ల తమ దేశానికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని అమెరికాను కోరినట్లు తెలిపారు. సౌదీ యువరాజు ఫైజల్ ఫోన్‌కాల్ ద్వారా భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో సంప్రదింపులు చేశామని వివరణ ఇచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ మే 7న పాక్‌లోని పలు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులు చేసింది. తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన దాడుల్లో భారత సైన్యం నూర్‌ఖాన్ వైమానిక స్థావరం, షోర్కోట్ వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు గుర్తించాం. సౌదీ యువరాజు ఫైసల్ నాకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణ గురించి భారత్ తో మాట్లాడాలా అని ఫైసల్ అడిగారు.. సహాయం చేయమని ఆయనను కోరాను. మరోవైపు ఈ విషయంపై అమెరికాతోనూ చర్చలు జరిపాము. తర్వాత ఫైసల్ మళ్లీ కాల్ చేసి తాను భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడానని భారత్ కూడా కాల్పుల విరమణకు సానుకూలంగా ఉందని ఆయన తెలిపారు' అని ఇషాక్ దార్ ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాదాపు 12 సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. భారత క్షిపణులు పాక్ ఆయుధగారాలు, ఎఫ్-16, జెఎఫ్-17 వంటి విమానాలు దాచిన సర్గోధా, భోలారీ ఎయిర్‌పోర్టులతోపాటు పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ఉన్న పట్టణంలోని నూర్‌ఖాన్, షోర్‌కోట్ ఎయిర్ బేస్‌లను కూడా ధ్వంసం చేశాయి. రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్ చేసింది. దానికి అతిచేరువలో పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ ఉంది. అణ్వాయుధాలను నియంత్రించడం, నిల్వ చేయడంలో దీనిపాత్ర అత్యంత కీలకం. భారత్ దాడుల తీవ్రతకు వణికిపోయిన పాక్ చివరకు కాళ్ల బేరానికి వచ్చింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ సైతం అంగీకరించింది.



# అణు ఒప్పందంపై యుఎస్‌తో చర్చల ప్రసక్తిలేదు

## ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ స్పష్టీకరణ

**టెహ్రాన్, జూన్ 20:** తమపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికాతో ఎలాంటి అణు ఒప్పంద చర్చలు జరిపేది లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అణు ఒప్పందంపై ఇరాన్ చర్చలకు రానిపక్షంలో రెండు వారాల్లోగా దాడులపై నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పందిస్తూ 'అణు ఒప్పందానికి సంబంధించి అమెరికా చర్చలకు రావాలని కోరింది. అయితే, మేం వాటిని తిరస్కరిస్తున్నాం' అని పేర్కొన్నారు. ట్రంప్ చేస్తున్న ఇజ్రాయెల్ అనుకూల వ్యాఖ్యలు చూస్తే.. దాడుల్లో అమెరికా ప్రమేయం ఉందనే విషయం స్పష్టమవుతోందన్నారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు పిలుపునిచ్చారన్నారు. తాము ఆత్మరక్షణ కోసం పోరాడుతున్నామని, ఇది ఆగని అరాచకం అన్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో అణుస్థావరాల లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. పరస్పర దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది.

ఈ క్రమంలో ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి. దీనిపై వైట్‌హౌస్ స్పందిస్తూ ట్రంప్ ఈ విషయంలో రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. టెహ్రాన్‌తో దౌత్యపరమైన పరిష్కారానికి అధ్యక్షుడు సిద్ధంగా ఉన్నారని తెలిపింది.

# ఇరాన్ నుంచి స్వదేశానికి 1000 మంది భారత్ విద్యార్థులు!



**టెహ్రాన్, జూన్ 20:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నవేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల తన గగనతలాన్ని మూసివేసిన ఇరాన్ భారత్ కోసం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చేందుకు సిద్ధమైంది.దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన దాదాపు 1000మంది భారతీయులు కొన్ని గంటల్లో భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. 'ఆపరేషన్ సింధు'లో భాగంగా ప్రత్యేక విమానాల్లో వీరు స్వదేశానికి రానున్నారు. ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్‌లోని పలు నగరాల నుంచి ప్రత్యేక విమానాలు భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. తొలి విమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు ఢిల్లీ చేరుకోనుండగా మరో రెండు విమానాలు శనివారం దిగనున్నట్లు సమాచారం. అయితే, దీనికి ముందు ఇరాన్ నుంచి ఇప్పటికే 110 మంది విద్యార్థులు ఢిల్లీకి చేరుకున్నప్పటికీ వీరు తొలుత అర్మేనియా, అక్కడ నుంచి భారత్‌కు వచ్చారు. వారం క్రితం ఇజ్రాయెల్ చేసిన మెరుపు దాడులతో ఇరాన్‌లోని అనేక స్థావరాలు ధ్వంసమయ్యాయి.తర్వాత ఇజ్రాయెల్‌పై క్షిపణి, డ్రోన్‌లతో టెహ్రాన్ ప్రతి దాడులకు దిగింది. ఈ నేపథ్యంలో తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిచిపోయాయి. తాజాగా భారతీయ విద్యార్థులను తరలించేందుకు ఇరాన్ ప్రత్యేకంగా మినహాయింపు ఇవ్వడంతో తరలింపు ప్రక్రియ సులభతరం కానుంది. ఇదిలా ఉంటే, ఇరాన్‌లో దాదాపు 4 వేల మంది భారతీయులు ఉండగా అందులో 2 వేల మంది విద్యార్థులేనని సమాచారం.



# ఆంగ్లం నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు..

## అమిత్ షాకు కౌంటర్ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ!

**న్యూఢిల్లీ, జూన్ 20:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్‌షా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేదన్నారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. ఆంగ్లభాష నేర్చుకోవడం సిగ్గుచేటు కాదని, విద్యార్థుల సాధికారతకు అది చిహ్నమన్నారు. ప్రపంచంతో పోటీ పడే ప్రతి విద్యార్థికి ఆంగ్లభాష అవసరం ఎంతో ఉందని మాతృభాషతో పాటు ఆంగ్లం తప్పకుండా నేర్పాలని సూచించారు. ఆ భాష విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని సమానత్వాన్ని సాధించడం ఇష్టంలేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. అందుకే వారిని విద్యకు దూరం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి మాతృభాష ఎంత ముఖ్యమో ఆంగ్లభాష కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని మనం గౌరవించాలన్నారు. అదే సమయంలో ప్రపంచంతో పోటీ పడడానికి వీలుగా ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని అన్నారు. మనదేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని పేర్కొన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు.

# ఫలితాలకు 45 రోజుల తర్వాత వీడియో రికార్డులు తొలగించాలి

## కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్20:** ఎన్నికల సరళికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేసి తప్పుడు కథనాలు సృష్టించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కేంద్రం ఎన్నికల సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సిసిటివి కెమెరా రికార్డింగ్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియో ఫుటేజ్‌లను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సూచించింది. ఇందుకు సంబంధించి రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు మే 30న లేఖలు పంపగా ఆ విషయం తాజాగా బయటికొచ్చింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు దశల్లో చేపట్టే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సిసిటివి రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్ విధానాలపై ఇసి ఆ




లేఖలో సూచనలు జారీచేసింది. సాధారణంగా ఎన్నికలకు సంబంధించిన చట్టాల ప్రకారం ఈ రికార్డింగ్‌లు తప్పనిసరి కానప్పటికీ పారదర్శకత కోసం ఇసి వీటిని ఓ సాధణంగా వినియోగిస్తోంది. అయితే ఇటీవల ఈ రికార్డులను దుర్వినియోగం చేసి కొందరు సోషల్‌మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలను వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులకు ఇసి పలు సూచనలు చేసింది. ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఏ వ్యక్తి అయినా 45 రోజుల్లోపు సంబంధింత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది. అందువల్ల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సిసిటివి, వెబ్‌కాస్టింగ్, ఫొటోగ్రఫీ డేటాను ఫలితాలు వెలువడిన 45 రోజుల వరకు భద్రపరచాలి. ఆ లోగా సంబంధిత నియోజవర్గంలో ఓటర్ల తీర్పును సవాల్ చేస్తూ ఎలాంటి పిటిషన్ దాఖలు కాకపోతే ఆ రికార్డింగ్‌లను ధ్వంసం చేయ వచ్చు అని ఇసి అందులో స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన రికార్డింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు గతేడాది డిసెంబర్‌లో కేంద్ర చట్టంలో సవరణలు చేసింది. సిసికెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లను బహిరంగంగా తనిఖీ చేయకుండా ఆంక్షలు తీసుకొచ్చింది.

# అవినీతి కేసులో నిర్దోషిగా తేలే దాకా విధుల్లోకి అనుమతి లేదు..

## లంచం కేసులో ఉన్నతాధికారి పిటిషన్‌పై 'సుప్రీం'

**న్యూఢిల్లీ,జూన్ 20:** అవినీతి కేసులో దోషిగా నిర్ధారణ అయిన ప్రభుత్వ అధికారి, ఆ కేసు నుంచి పూర్తిగా నిర్దోషిగా బయటపడే వరకు తిరిగి విధుల్లో చేరేందుకు అనుమతించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి అవినీతి అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం వల్ల ప్రజా విశ్వాసం దెబ్బతింటుందని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ప్రసన్న బి వరాలేలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. లంచం తీసుకున్న కేసులో దోషిగా తేలిన ఒక రైల్వే ఇన్‌స్పెక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారిని తిరిగి ఉద్యోగంలో చేరేందుకు ఎందుకు అనుమతించాలని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ దోషిగా తేలిన అధికారిని సర్వీసులో కొనసాగనిస్తే, అది వ్యవస్థ పునాదులనే బలహీన పరుస్తుంది. నిజాయితీపరులైన అధికారులను అవమానించడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. వివరాల్లోకి వెళితే, గుజరాత్‌లోని విచారణ కోర్టులో లంచం కేసులో దోషిగా తేలిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) కు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్, తన శిక్షపై స్టే విధించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంతకుముందు గుజరాత్ హైకోర్టు ఆయనకు విధించిన జైలు శిక్షను సస్పెండ్ చేసి, బెయిల్ మంజూరు చేసినప్పటికీ, శిక్షను రద్దు చేయడానికి నిరాకరించింది. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది నితిన్ కుమార్ సిన్హా, విచారణ కోర్టు తన క్లయింట్‌ను దోషిగా నిర్ధారించి, రెండేళ్ల జైలు శిక్ష విధించడంలో పొరపాటు చేసిందని తెలిపారు. తన క్లయింట్ లంచం డిమాండ్ చేశారని లేదా అంగీకరించారనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని ఆయన వాదించారు. అందువల్ల, శిక్షపై స్టే విధించి, తన క్లయింట్‌ను తిరిగి విధుల్లో చేరేందుకు అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే, కేసీ సరీన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును ఉటంకిస్తూ ధర్మాసనం, కేవలం ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ పెండింగ్‌లో ఉందన్న కారణంతో శిక్ష పడిన అధికారిని సర్వీసులో కొనసాగించడానికి అనుమతించలేము. అలాంటి ప్రభుత్వ సేవకులను ప్రభుత్వ పదవిలో కొనసాగించడం వల్ల ప్రజా విశ్వాసం దెబ్బతింటుందని స్పష్టం చేసింది.

అనంతరం, కోర్టు సదరు ఇన్‌స్పెక్టర్ పిటిషన్‌ను కొట్టివేసింది. కేసీ సరీన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ఒక ప్రభుత్వోద్యోగి న్యాయస్థానం నిర్వహించిన విచారణ ప్రక్రియ అనంతరం అవినీతికి పాల్పడినట్లు తేలినప్పుడు, ఉన్నత న్యాయస్థానం అతడిని నిర్దోషిగా ప్రకటించేవరకు అతడిని అవినీతి పరుడిగానే పరిగణించాలని ఆకేసులో సుప్రీం కోర్టు పేర్కొన్న విషయాన్ని ధర్మాసనం నొక్కి చెప్పింది.

# 215 మృతదేహాల గుర్తింపు: ఎయిరిండియా ప్రమాదంలో డిఎన్ఎ పరీక్షలు

**అమ్మదాబాద్,జూన్ 20:** అమ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 279 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగి వారం రోజులు కావస్తున్నా మృతుల గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. మృతదేహాలు చాలా వరకు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో అధికారులకు ఇది పెద్ద సవాలుగా మారింది. ఈ విషయంపై అమ్మదాబాద్ సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాకేశ్ జోషి మాట్లాడుతూ, డీఎన్ఏ నమూనాల పరీక్షల ద్వారా ఇప్పటివరకు 215 మంది మృతులను గుర్తించినట్లు శుక్రవారం తెలిపారు. వీరిలో 198 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన వెల్లడించారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ, అప్పగింతలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రమాద తీవ్రతకారణంగా మృతదేహాలు ఛిద్రమై, తీవ్రంగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం కష్టతరంగా మారిందని వైద్యులు చెబుతున్నారు.

# వీర్యదానంతో జన్మించిన పిల్లలకూ సంపద ధారాదత్తం

## టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ డ్యురోవ్ వీలునామా



**ప్యారిస్, జూన్ 20:** ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ డ్యూరోవ్ తన భారీ సంపదకు సంబంధించి సంచలన నిర్ణయం ప్రకటించారు. తన వీర్యదానం ద్వారా జన్మించిన 100 మందికిపైగా పిల్లలు సహా తన వారసులకు 13.9 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1.16 లక్షల కోట్లు సంపదను పంచనున్నట్టు ప్రకటించారు. ఫ్రాన్స్‌కు చెందిన లీపాయింట్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం 40 ఏళ్ల ఈ టెక్ కుబేరుడు ముగ్గురు భాగస్వాముల ద్వారా కలిగిన ఆరుగురు పిల్లలతో పాటు, గత 15 ఏళ్లుగా స్పెర్మ్ దానం ద్వారా 12 దేశాల్లో 100 మందికి పైగా పిల్లలకు తండ్రయ్యాడు. ఈ నేపథ్యంలో తన సంపదను పంచుతూ ఇటీవలే వీలునామా రాసినట్టు తెలిపారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ఆయన సంపద విలువ 13.9 బిలియన్ డాలర్లుగా ఉంది. నా పిల్లల విషయంలో నేను ఎలాంటి తేడా చూపించను. సహజంగా జన్మించినవారు, స్పెర్మ్ దానం ద్వారా జన్మించినవారు అందరూ నా పిల్లలే. వారందరికీ సమాన హక్కులు ఉంటాయి. నా మరణం తర్వాత వారు గొడవ పడకూడదన్నదే నా కోరిక అని డ్యూరోవ్ లీ పాయింట్ మ్యాగజైన్‌కు వివరించారు. అయితే, ఈ ఆస్తి తన పిల్లలకు వెంటనే దక్కదని, మరో 30 ఏళ్ల తర్వాతే వారికి అందుబాటులోకి వస్తుందని డ్యూరోవ్ స్పష్టం చేశారు. నా వీలునామాను ఇటీవలే రాశాను. ఇప్పటి నుంచి ముప్పై ఏళ్ల కాలం పూర్తయ్యే వరకు నా పిల్లలకు నా సంపద అందుబాటులో ఉండకూడదని నిర్ణయించుకున్నాను. వారు సాధారణ ప్రజల్లా జీవించాలి, సొంతంగా నిలదొక్కుకోవాలి, తమపై తాము నమ్మకం పెంచుకోవాలి, సృజనాత్మకంగా ఎదగాలి కానీ, బ్యాంకు ఖాతాపై ఆధారపడకూడదు అని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బిలియన్‌కు పైగా యాక్టివ్ యూజర్లున్న టెలిగ్రామ్‌ను సృష్టించడమే కాకుండా, తన విలక్షణమైన జీవనశైలితో డ్యూరోవ్ టెక్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను రోజూ తన 11.1 మిలియన్ల టెలిగ్రామ్ ఫాలోవర్లతో సంప్రదింపులు జరుపుతానని, రోజూ 300 పుష్ అప్‌లు, 300 స్క్వాట్‌లు చేస్తానని.. మద్యం, కాఫీ, టీ వంటి వాటికి దూరంగా ఉంటానని వెల్లడించారు. పావెల్ డ్యూరోవ్‌పై పలు వివాదాలు కూడా ఉన్నాయి. ఆయన ముగ్గురు పిల్లల తల్లి, డ్యూరోవ్ ఆర్థిక సహాయం అందించలేదని, రహస్యంగా మరో జీవితం గడిపాడని, అప్పట్లో మూడేళ్ల వయసున్న తమ కుమారుడిని గది అవతలికి విసిరేంత బలంగా కొట్టాడని ఆరోపిస్తూ 2023, 2024 సంవత్సరాల్లో రెండు క్రిమినల్ ఫిర్యాదులు చేసినట్టు యుఎస్ జర్నల్ ఒకటి ప్రకటించింది. గతంలో భావప్రకటనా స్వేచ్ఛ విషయంలో రష్యా ప్రభుత్వంతో డ్యూరోవ్‌కు విభేదాలు తలెత్తాయి. ఆయన స్థాపించిన సోషల్ నెట్‌వర్క్ వీకాంటాక్టే (రష్యా ఫేస్‌బుక్‌గా పిలుస్తారు)లో ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీకి చెందిన గ్రూపులతో సహా కొన్ని ఉద్యమ గ్రూపులను మూసివేయడానికి నిరాకరించినందుకు రష్యా ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నారు. 2017లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఎగతాళి చేస్తూ డ్యూరోవ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పుతిన్ షర్ట్‌లెస్ చాలెంజ్ ప్రారంభించారు. గత ఏడాది తన ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌లో లైంగిక వేధింపులు, డ్రగ్ ట్రాఫికింగ్ నేరాలు విచ్చల విడిగా సాగడానికి అనుమతించారన్న ఆరోపణలపై ఫ్రెంచ్ అధికారులు ఆయనపై అభియోగాలు మోపారు. అయితే, డ్యూరోవ్ ఆ ఆరోపణలను ఖండించారు. గతవేసవిలో పారిస్ అధికారులు అరెస్ట్ చేసి, ప్రయాణాలపై నిషేధం విధించిన అనంతరం, మార్చిలో తాను దుబాయ్‌లోని తననివాసానికి తిరిగి వచ్చినట్టు డ్యూరోవ్ తెలిపారు.

# బీహార్‌ను జంగిల్‌రాజ్‌గా మార్చిన కాంగ్రెస్, ఆర్జేడీ

## సివాన్ ర్యాలీలో ప్రధాని మోడీ

**పాట్నా,జూన్ 20:** బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు.ఎన్డీయే బీహార్‌ను అభివృద్ధి చేస్తున్న దనడానికి ఒక్క మర్హౌరా రైలు ఫ్యాక్టరీయే ఉదాహరణ అన్నారు. సరన్‌జిల్లాలోనే ఈప్రాజెక్టు కొనసాగుతున్నదన్నారు. సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ అని మేం చెపుతుంటే ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం పరివార్‌కాసాత్ అని చెపుతున్నాయని ఎద్దేవాచేసారు. ప్రజాసేవలోనే గడుపుతానని, ప్రజాసేవ చేయకపోతే తానుప్రశాంతంగాకూడా



పడుకోలేనని మోడీ అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. సివాన్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించిన ఆయన, రూ.10,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించామన్నారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఎన్‌డీఏ ప్రభుత్వం బాబూ రాజేంద్ర ప్రసాద్, బ్రిజ్‌కిశోర్ ప్రసాద్ వంటి గొప్ప వ్యక్తుల జీవిత లక్ష్యాన్ని దృఢ సంకల్పంతో ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా ఈ రోజు ఈ వేదికపై వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించామని ప్రధాని మోదీ అన్నారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమర యోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యు ఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనఅర్బన్ (పీఎంఏవైయూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవైయూ లబ్ధిదా రులకు తొలివిడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యుద్ధంతో నా కుటుంబానికి నష్టమే..

## కుమారుడి వివాహం వాయిదాపై ఇజ్రాయెల్ ప్రధాని



**టెల్ అవివ్,జూన్ 20:** ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కుమారుడు అవ్నర్ నెతన్యహూ వివాహం రెండోసారి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో బెంజిమన్ చేసిన వ్యాఖ్యల పట్ల ఇజ్రాయిలీ ప్రజల్లో అసహనం రేకెత్తించింది. ఇరాన్ చేసిన దాడిలో బీర్‌షెబాలో ఉన్న సొరోకా ఆస్పత్రి ధ్వంసమైన విషయం తెలిసిందే. అక్కడకు సందర్శనకు వచ్చిన నెతన్యహూ తన కుమారుడి వివాహం గురించి మాట్లాడారు. భావోద్వేగంగా మాట్లాడుతూ ఎన్నో కుటుంబాల తరహాలో తన కుటుంబం కూడా త్యాగాలు చేసినట్లు ఆయన చెప్పారు. అవ్నర్ గర్ల్‌ఫ్రెండ్‌తో పాటు భార్య సారా కూడా వివాహం వాయిదా పడడం పట్ల మనోవేదనకు గురవుతున్నట్లు ఆయన తెలిపారు. వాస్తవానికి గత నవంబర్‌లో అవ్నర్ పెళ్లి జరగాల్సి ఉంది. కానీ భద్రతా కారణాల వల్ల వాయిదా వేశారు. మళ్లీ ఈ వారం జరగాల్సిన పెళ్లిని ఇరాన్ దాడుల వల్ల వాయిదా వేశారు.అయితే తమ కుటుంబ పరిస్థితిని వివరిస్తూ రెండో ప్రపంచయుద్ధ సమయంలో బ్రిటీషర్లు ఈ పరిస్థితి ఎదుర్కొన్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూఇబ్బందిపడుతున్నారని, తమ కుటుంబం కూడా ఇబ్బందిపడుతోందని ప్రధాని నెతన్యహూ తెలిపారు.పర్సనల్‌గా నష్టం జరిగినా తన భార్య సారా ఓ హీరోలా మారినట్లు మెచ్చుకున్నారు. కుటుంబానికి నష్టం జరిగినట్లు నెతన్యహూ చెప్పడం పట్ల ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తాయి. సోషల్‌మీడియాలో స్పందిస్తూ దేశప్రజల బాధను విస్మరిస్తూ నెతన్యహూ వ్యవహరిస్తున్నట్లు కొందరు విమర్శించారు. ఖరీదైన వస్తువులు కొనే ఆమెను హీరోఅని ఎలా పిలుస్తారని కొందరన్నారు. నైట్ షిఫ్ట్‌లకు వెళ్లే డాక్టర్లు హీరోలుఅని, విద్యార్థులనుజూమ్ మీట్‌లో కలుపుతున్న టీచర్లుహీరోలని ఆన్‌లైన్‌లో కామెంట్స్ వస్తున్నాయి.

# బొలేరో ఎసీయూవీ, ట్రక్కు ఢీ: అక్కడికక్కడే తొమ్మిది మంది మృతి

**కోల్‌కత్తా,జూన్ 20:** పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీనితో కారులోని 9 మంది యువకులు మృతి చెందారు. బెంగాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లా, బలరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నామ్షోల్ గ్రామంసమీపంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. హైవేపై బొలెరో ఎస్‌యూవీ కారు, ట్రక్కు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. దీనితో కారు బోల్తా పడి పూర్తిగా ధ్వంసం అయ్యింది. కారులో ఉన్న వారిని స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించాం. అయితే అప్పటికే అందులోని తొమ్మిది మంది మరణించినట్లు వైద్యులు తెలిపారు. కారులో ఉన్నవారు బెంగాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లి, తిరిగి వస్తున్నారు. వారంతా ఝార్ఖండ్‌లోని తిలైటాండ్ గ్రామానికి చెందినవారని తెలిసింది. ప్రాథమిక దర్యాప్తులో అతివేగం, నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేశాం. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని బలరాంపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ సౌమ్యదీప్ మల్లిక్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలోని అడబానా గ్రామంలో ఓ వివాహ వేడుక జరిగింది. ఆ పెళ్లికి



ఝార్ఖండ్‌లోని నిమ్దిహ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలైటాండ్ గ్రామానికి చెందిన పలువురు వెళ్లారు. శుక్రవారం తిరిగి వస్తుండగా నామ్షోల్ గ్రామ సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీనితో బొలెరో యజమాని సహా అందులోని వారంతా మరణించారు. అయితే మృతు లందరూ ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో, అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి.

# బిసి రిజర్వేషన్‌పై కోర్టులో స్పష్టత వచ్చాకే 'స్థానిక' ఎన్నికలు



## మంత్రులు పొరుగు శాఖల్లో జోక్యం చేసుకోవడం తగదు

## కొండా మురళి వ్యాఖ్యలపై ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులు

## అజారుద్దీన్ బరిలో ఉన్నట్లు ప్రకటించడంలో తప్పులేదు: పిసిసి చీఫ్ మహేశ్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు హైకోర్టు పరిధిలో ఉన్న బిసి రిజర్వేషన్ అంశంలో న్యాయస్థానం స్పష్టత వచ్చాకేలో స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలంగాణ పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. హైదరా బాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమా వేశం నిర్వహించిన మహేష్ కుమార్‌గౌడ్ పలు విషయాలపై వ్యాఖ్యానిం చారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏకపక్షంగా ప్రకటన చేయడం సరికాదని అన్నారు. అయితే లోకల్ బాడీ ఎలెక్షన్ కోసం కార్యకర్తలను సిద్ధం చేయడం కోసం, వారిలో ఉత్సాహం నింపడం కోసమే పొంగులేటి ఆ వ్యాఖ్యలు చేసినట్టు వివరణ ఇచ్చారని మహేష్ తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఒకరి శాఖల గురించి మరో మంత్రి మాట్లాడటానికి వీల్లేదని మహేష్ హెచ్చరించారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం కరెక్ట్ కాదని ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సూచించాని తెలిపారు ఆయన కూడా దానిపై వివరణ ఇచ్చారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం కోసమే అలా మాట్లాడినట్లు తెలిపారు. ఇక నుంచి ఎవరూ అలా మాట్లాడటానికి వీల్లేదు,హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తప్పవని మంత్రులకు వార్నింగ్ ఇచ్చారు. ఇక వరంగల్ రాజకీయ అంశాలను తాను గమనిస్తున్నానని తెలిపిన మహేష్ కుమార్ గౌడ్. కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై నివేదిక కోరినట్టు తెలిపారు. డిసిసి పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక ఆ వ్యవహారంపై స్పందిస్తానని, అప్పటి వరకు తొందరపడి ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని అన్నారు. కొండ మురళి వ్యాఖ్యలపై ఇరువర్గాల గురించి ఫిర్యాదులు అందాయని చెప్పారు. అక్కడ నెలకొన్న పరిస్థితులకు సంబంధించి పూర్తిస్థాయి రిపోర్టును అందజేయాలని అబ్జర్వర్లకు సూచించామని చెప్పారు. ఆ రిపోర్టు అందగానే క్రమశిక్షణ చర్యలు తప్ప కుండా ఉంటాయని పేర్కొన్నారు. పార్టీలో ఎవరి ఇష్టారీతిన వారు మాట్లాడవద్దని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విషయంలో పార్టీ అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అజారుద్దీన్ తాను ఎమ్మెల్యే బరిలో ఉన్నట్లు ప్రకటించుకోవడాన్ని తప్పు పట్టలేదు. ఆయన గతంలో అక్కడి నుంచి పోటీ చేశారు కాబట్టి మళ్లీ పోటీకి ప్రయత్నిస్తున్నారు. ఇందులో తప్పేం లేదని అన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

## మాజీ సర్పంచ్‌ల సంఘం జెఎసి నాయకులు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** గ్రామాలలో అభివృద్ధి పనులకు చేసిన పెండింగ్ బిల్లులు, ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచ్‌ల జేఏసి నాయకులు సుర్వి యాదయ్యగౌడ్, లక్ష్మీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇందిపార్క్‌లో మాజీ సర్పంచ్‌ల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లు చెల్లింపు కోసం మంత్రులతో పాటు,గవర్నర్‌కు కూడా అనేక వినతి పత్రాలు అందచేసినా ఎటువంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులుపై అదిగో, ఇదిగో అంటున్నారే కానీ ఒక స్పష్టమైన హామీ ఇవ్వడం లేదన్నారు. పరిస్థితి ఇంతే ఉంటే మరోసారి ఆందోళన నిర్వహించేందుకు కూడా వెను కాడమని హెచ్చరిస్తున్నారు. ఈ సమావేశం అనంతరం వారు మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులుప్రణీల్ చందర్ గుంటి మధుసూదన్‌రెడ్డి, రాంపాక నాగయ్య కేశబోయిన మల్లయ్య. నెమలి సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో విషాదం

## చెరువులో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన వృద్దురాళ్లు అనారోగ్య కారణాలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికంగా వుండే సుంకరి లక్ష్మీభాయి (80), ఆమె కుమార్తె గౌరమ్మ (58) చాలా కాలంలో ఒకే ఇంట్లో వుంటున్నారు. కొన్నేళ్లుగా ఇద్దరు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో మానసికంగా కృంగిపోయిన తల్లీ, కూతుళ్లు బంగల్‌పేట్ కాలనీలోని వినాయక్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం రాత్రి వీరిద్దరు చెరువులో దూకగా శుక్రవారం ఉదయం శవాలు నీటిలో తేలడంతో ఈ విషయం వెలుగు చూసింది. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. దీనిపై వారి బంధువులకు సమాచారం అందించిన పోలీసులు విచారణ చేబట్టారు.

# 24న కాంగ్రెస్ నూతన కమిటీల సమావేశం

**హైదరాబాద్,జూన్ 20,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీల సమావేశం ఈనెల 24 టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరుగనుంది. గాంధీభవన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంతో ఈ సమావేశాలు మొదలవుతాయి. అనంతరం పిసిసి సలహా కమిటీ సమావేశం జరుగుతోంది. మద్యాహ్నం తర్వాత నూతనంగా నియామకం అయిన టిపిసిసి ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందించనున్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొంటారు.

# అర్చక ఉద్యోగ సంక్షేమ నిధికి చెక్ అందించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** దేవాదాయ శాఖలో కొన్ని సంవత్సరాల తరబడి పని చేస్తున్న అర్చకులు, ఉద్యోగుల జీవితాల్లో రాష్ట దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ ఆశలు నింపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. గురువారం రాష్ట దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎండో మెంటు డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి చెక్‌ను అందజేశారు. 18 మంది ఉద్యోగులకు అర్చక సంక్షేమ నిధి ట్రస్టు ద్వారా గ్యాట్యూటీ, మెడికల్ సాయం అందజేశారు. రూ. 32 లక్షల చెక్కును ఉద్యోగులకు మినిస్టర్ కొండా సురేఖ ఇచ్చారు. విడివిడిగా వారికి ఆర్డర్ కాపీలు అందజేశారు. అనంతరం రిటైర్డయిన ఉద్యోగులను మంత్రి ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల సంక్షేమం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పని చేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆమె చెప్పారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యుటీ ఇవ్వడం జరుగుతుం దన్నా రు. ధూపదీప నైవేద్య అర్చకులకు మరణా నంతరం చెల్లించు గ్రాట్యుటి నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరం చెల్లించు ఎక్స్ గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం చెల్లింపు ఈ నిధి ఉపయోగపడు తుందన్నారుఈ నిధి కింద ఉద్యోగులకు. మెడికల్ రీయింబర్స్ మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు,మరమ్మత్తుల నిమిత్త పథకం, విద్యాపథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుం దన్నారు. యేళ్ల తరబడి పెండింగ్ ఉన్న సమస్య ను తీర్చినందుకు మంత్రి కొండా సురేఖకు ధన్య వాదాలు. మంత్రి తమకు కొండంత సాయం చేశా రు. వివిథ పథకాలలో రెగ్యులర్ అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి పథకానికి గత నెల 28న అర్చక సంక్షేమ బోర్డు ద్వారా గ్రాట్యుటీ రూ 4.00 లక్షల నుండి రూ 8.00 లక్షలకు పెంచడం హర్షణీయం. ఈ గ్రాట్యుటీ మొత్తాన్ని సదరు ఉద్యోగి బ్యాంకు ఖాతాలో ఏక మొత్తంలో వారి సర్వీసు కాలానికి లోబడి చెల్లించడం చాలా సంతోషకరమన్నారు. ఎవరైనా అకాలం చనిపోతే, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ20,000/ల నుండి రూ 30,000/లకు పెంచడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



ఒమన్ దేశంలో బలవన్మరణానికి పాల్పడిన సోదరుడి మృతదేహాన్ని రప్పించాలంటూ సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మృతుని సోదరుడు హరీశ్

# 'ఓమన్ నుంచి సోదరుడి మృతదేహాన్ని రప్పించండి'

**హైదరాబాద్(బేగంపేట), జూన్ 20, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాస కొత్తూరుకు చెందిన జుంబారత్ అన్వేష్ (27) ఓమన్ దేశంలోని బుర్హైమిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురించి తెలుసుకున్న అతని కుటుంబసభ్యులు ఓమన్ నుంచి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తెప్పించాలంటూ మృతుని సోదరుడు హరీశ్ శుక్రవారం సిఎం ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీఎమ్మెల్యే అనిల్‌ఈరవత్రి, రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ మంద భీంరెడ్డిలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి సిఎం ప్రిన్సిపాల్ సెక్రటరీ వి.శేషాద్రితో మాట్లాడారు. మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీతో సంప్రదించి మృతదేహాన్ని తెప్పించాలని కోరారు.

# పోలవరంతో భద్రాచలానికి ముప్పు

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలి

## బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి ముప్పు ఉందని చంద్రబాబు అక్రమంగా ఏడు మండలాలు తీసుకున్నారని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ చాలా సమస్యలు ఎదుర్కొంటుందని ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి కవిత ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వారంతా తెలంగాణలో ఉండాలనుకుంటున్నారన్నారు. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలం గాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సీఎంలతో నిర్వహించే సమావేశంలో ప్రధాని మోడీ ఈ అంశాన్ని చర్చించాలి. ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కవిత డిమాండ్ చేశారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని లేదంటే ఏ ఒక్క ఏడాదిలోనైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి భూములు వెయ్యి ఎకరాలు ఉందని వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయిందని, దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని తెలిపారు. దీంతో అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందని ఆరోపించారు.




భద్రాచలం దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను అన్యాయంగా ఆమోదించారన్నారు. అంతేకాకుండా లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీ అప్పజెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను, ఆ ప్రాజెక్టును లాక్కున్నారని అన్నారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తామంతా గళమెత్తామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులందరం పార్లమెంటులో మాట్లాడామని కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరించారని విమర్శించారు. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా కాలేదని మండిపడ్డారు. పోలవరం స్పిల్‌వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందు అభ్యర్థుల ఆందోళన చేస్తున్న దృశ్యం

# వ్యవసాయ వర్సిటీలో అభ్యర్థుల ఆందోళన

## సమాచారం లేకుండా ఇంటర్వ్యూలు వాయిదా

## రిజిస్ట్రార్ హామీతో నిరసన విరమణ

**హైదరాబాద్ (అత్తాపూర్) జూన్ 20, ప్రభాతవార్త:** వ్యవసాయ విశ్వవిద్యాలయం హాస్టళ్లకు అసిస్టెంట్ వార్డెన్ పోస్టుల భర్తీ కోసం చేపట్టిన ఇంటర్వ్యూలు ఉద్రిక్తతకు దారితీసింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం హాస్టళ్లకు సంబంధించిన అసిస్టెంట్ వార్డెన్ ఉద్యోగాలకు మహిళలకు 10, పురుషులకు 10 నోటిఫికేషన్ విడుదల చేయగా వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులు నమోదు చేసున్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో వార్డెన్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉన్నట్లు తెలపడంతో పెద్దఎత్తున వివిధ జిల్లాలను నుండి పిల్లలతో కలిసి అభ్యర్థులు తరలివచ్చారు. అయితే అధికారులు ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు నోటీసు బోర్డు పెట్టడంతో పరిపాలన భవనం అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా వాయిదా వేస్తారంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఎసిపి శ్రీనివాస్‌జోక్యం చేసుకొని అభ్యర్థులకు సర్దిచెప్పిన వినకపోవడంతో మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని ఎవ్వరూ కూడా ఆందోళన చెందాల్సి అవసరం లేదని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఆయన హామీ ఇవ్వడంతో అభ్యర్థులు నిరసన విరమించారు.



విద్యార్థి నిరుద్యోగ మహాధర్నాలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీల నేతలు

# రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేసేదాకా పోరాడుదాం

## మహాధర్నాలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసే వరకు పోరాడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగా రెడ్డిలు స్పష్టం చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వేలాది మంది నిరుద్యోగులు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్, జనార్దన్‌ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధులుగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులపై దృష్టి పెట్టాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తే ప్రభుత్వానికి ఎటువంటి నష్టం లేదని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ వయసు పెంచి, నిరుద్యోగులకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన బీజేపీ అనేక పోరాటాలు చేసిందని, భవిష్యత్తులో కూడా నిరుద్యోగుల పక్షాన బీజేపీ పోరాడుతూనే ఉంటుందని, ఎల్లప్పుడూ నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# ఇంజినీరింగ్ కోర్సులు, ఉపాధిపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన

## నేడు జెఎన్‌టియులో పారిశ్రామిక నిపుణులు, విద్యారంగ నిపుణులతో సమావేశం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నేడు(శనివారం) అవగాహన కల్పించనున్నారు. ఇంజనీరింగ్ కోర్సులతోపాటు.. వాటి మూలంగా లభించబోయే ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించనున్నారు. ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. అందులో భాగంగా కూకట్‌పల్లిలోని జేఎన్‌టియు క్యాంపస్‌లో నేడు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జేఎన్‌టియు, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. ప్రతి ఏడాది కూడా ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ హాజరయ్యే విద్యార్థులు కౌన్సెలింగ్ సందర్భంగా ఇబ్బందులు పడుతున్నారని భావించిన ఉన్నత విద్యా మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే వారికి కౌన్సెలింగ్‌పై అసలు అవగాహన లేకపోవడంతో.. వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మాక్ కౌన్సెలింగ్‌ను నిర్వహించి అవగాహన కల్పించనున్నారు. ఇందుకు విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అవకాశం కల్పించగా సుమారు 1000 మంది వరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్టు తెలిసింది. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రధానంగా కంప్యూటర్, ఏఐ కోర్సులు కాకుండా కోర్ కోర్సులైన సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరితో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఏ మేరకు ఉంటాయనేది విద్యారంగ నిపుణులతోపాటు పారిశ్రామిక నిపుణులతో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు యూనివర్సిటీ క్యాంపస్‌లోని వివిధ కోర్సులకు సంబంధించిన లాబరేటరీలను చూసే అవకాశం కల్పించారు. ల్యాబ్‌లతోపాటు లైబ్రరీలను చూపించాలని జేఎన్‌టియు అధికారులు నిర్ణయించారు.

# నీళ్లు పదంతోనే బిఆర్‌ఎస్ రాజకీయాలు

## మాజీ సిఎం కెసిఆర్ కారణంగానే బనకచర్ల పంచాయితీ షురూ: ఎంపి చామల




**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నీళ్లు అనే పదంతో బిఆర్‌ఎస్ రాజకీయం చేసింది ఇప్పటికీ రాజకీయాలు చేస్తూ లబ్దిపొందేందుకు కుట్రలు చేస్తున్నదని గోదావరి జలాలు పెన్నాబేసిన్‌కు తరలించే ఆలోచన ఆంధ్రప్రదేశ్ పాలకులకు కల్పించేందే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావే అని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో శుక్ర వారం మాట్లాడతూ హరీశ్‌రావు వాళ్ల మామ కెసిఆర్‌ను విలన్ చేసే ప్రయ త్నం చేస్తున్నాడని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలం గాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్ధమైందని ఆయన వివరించారు. 2016 సిడబ్ల్యుసి మీటింగ్ లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ కి ఉన్న అపారజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయింది జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలం గాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని అన్నారు. హరీష్ వైఖరి వల్లే ఆంధ్రప్రదేశ్ నేతలు బనకచర్లకు నీళ్ల తరలించుకుందామనే ఆలోచన చేశారన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బిఆర్‌ఎస్ నేతలు కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని అన్నారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని అన్నారు. బిఆర్‌ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్‌ను చూడలేకపోతున్నారని ఆయన విమర్శించారు. నది జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ తెలుసుకోవాలని కోరారు. నీళ్ల అంశంపై తనకి తన మామకి తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారు. తెలం గాణ నీటిని ఆంధ్రకు దారాదత్తం చేసిందే కెసిఆరే అని ఆయన అన్నారు. హరీశ్ సాగునీటి శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందని అన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీం కోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన రేవంత్ కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చని ఆయన వివరించారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మానం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్‌ఎస్ ఎంపీ వాకౌట్ చేసారని గుర్తుచేశారు.



# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 272

**హైదరాబాద్(బేగంపేట), జూన్ 20, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 272 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 83 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 72 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సం బంధించి 21 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలి యజేసారు. సిఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# బనకచర్లపై హారీశ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

## శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** గోదావరిలో 3000 టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని కెసిఆర్‌కు ఎవరు చెప్పారు.. మిగులు జలాల ప్రాతి పదికన ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వొద్దని హరీశ్‌రావు ఎందుకు ఆరోజు డిమాండ్ చేయడం లేదని శాసన మండలి సభ్యుడు అద్దంకి దయాకర్ ప్రశ్నిం చారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి హరీశ్‌రావు బనకచర్ల పైన మాట్లాడు తున్నాడని విమర్శించారు. హరీశ్‌రావువి పిచ్చిప్రేలాపలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ మీ అయ్య జాగీరు అని కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు ఆనాడు ఒప్పుకున్నారా అని దయాకర్ నిలదీశారు. తెలంగాణ మీ అయ్య జాగీరు అని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేటీఆర్ మాట్లాడాడా అని అన్నారు. రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిని నోటికొచ్చినట్లు కెసిఆర్ మాట్లాడలేదా, కెసిఆర్ ఆనాడు తెలంగాణ ముఖ్యమంత్రిగా మాట్లాడాడా లేక రాయలసీమ ముఖ్యమంత్రి అనుకున్నాడా అని దయాకర్ అడిగారు.

జగన్ తో కెసిఆర్ ఎందుకు స్నేహం చేశాడు.. నాలుగుసార్లు ఎందుకు ప్రగతి భవన్ కు పిలిచాడు తెలంగాణ జలవనరులను తాకట్టుపెట్టి ఇప్పుడు నీతి వాక్యాలు చెబుతున్నారని అన్నారు. బనకచర్లపైన కేసీఆర్ ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. బేసిన్లు లేవు బేషజాలు లేవని కేసీఆర్ ఆనాడు ఇష్టానుసారంగా మాట్లాడలేదా అని గుర్తుచేశారు. బనకచర్లకు అవకాశం ఇచ్చిందే కెసిఆర్ అని ఆయన అన్నారు. ఆనాడు కళ్లు మూసుకొని కూర్చున్నాడని, అపెక్స్ కౌన్సిల్ సమావేశం రెండుసార్లు జరిగితే కెసిఆర్ హాజరు కాలేదని ఆరోపించారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు కేసీఆర్ ఆనాడు ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. జలవనరుల విషయంలో తెలంగాణకు అన్యా యం చేసిందే హరీష్ రావు అని ఆయన చెప్పారు.కృష్ణా జలాలు ఆంధ్రాకు, గోదావరి జలాలు తెలంగాణకు అన్నట్లు ఆనాడు కేసీఆర్ వ్యవహా రించారని గతం గుర్తుచేసుకున్నారు. తెలంగాణకు నష్టం జరిగితే మేం ప్రశ్నించి తీరుతా మని తెలిపారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అన్యాయాలపై చర్చించాలని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరుతున్నామని అన్నారు. హరీశ్‌రావుకు బేసిన్లు కనీసం బేసిక్స్ కూడా తెలియవు.తెలంగాణ కు జల ద్రోహం చేసిన దొంగలు బీఆర్‌ఎస్ నాయకులు అని ఆరోపించారు. ఆ దొంగ లకు బాస్ హరీశ్‌రావు అని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ ఈ రాష్ట్రానికి అవసరమా? అని ఆయన అడిగారు. ప్రాజెక్ట్‌ల పేరు మీద బ్యాగ్ లు మోసుకుపోయింది బీఆర్‌ఎస్ నాయకులే అని అన్నారు. కవిత వ్యాఖ్యల వెనుక కూడా కెసిఆర్ ఉన్నారు.

# తెలంగాణ పోలీసు అకాడెమీలో ఘనంగా బ్రాస్‌బ్యాండ్ దీక్షాంత్ పెరేడ్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** శివార్లలోని హిమాయత్‌సాగర్‌లో గల తెలంగాణ పోలీసు అకాడమిలో శుక్రవారం బ్రాస్ బ్యాండ్, బిగులర్ పోలీసు సిబ్బంది దీక్షాంత్ పరేడ్ ఘనంగా జరిగింది. డిజిపి జితేందర్ ఈ పెరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బ్రాస్ బ్యాండ్, బిగులర్ పోలీసు కానిస్టేబుళ్లు పోలీసు శాఖలో ఎంతో కీలకమైన సిబ్బందిగా కొనియాడారు. గణతంత్ర దినోత్సవాలతో పాటు సర్కారు నిర్వహించే ముఖ్యమైన వేడుకలకు ఈ విభాగం సిబ్బంది నిర్వహించే ప్రదర్శన ఎంతో ముఖ్యమైనదిగా వుంటుందని ఆయన తెలిపారు. వచ్చే పంద్రాగస్టు వేడుకల్లో ఈ విభాగం సిబ్బ ంది చేత ప్రత్యేక ప్రదర్శన వుండేలా చేస్తామని డిజిపి తెలిపారు. దీక్షాంత్ పరేడ్‌లో కచ్చితత్వంతో ప్రదర్శన చేసిన సిబ్బందిని ఆయన కొనియాడారు. అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ గతంలో 10 పోలీసు యూనిట్స్ వుండేవని, ప్రస్తుతం 29 యూనిట్లు వుండం వల్ల ఈ విభాగం సిబ్బంది సంఖ్య తగ్గిందని తెలిపారు. ఈ క్రమంలో కొత్తవారిని ఎంపికచేసి వారికి నాలుగు నెలల శిక్షణ ఇచ్చి బ్యాంకు మేళం వాయించడంలో నిష్ణాతులను చేశామని ఆమె తెలిపారు. నాలుగు వారాల శిక్షణలో 53 మంది సిబ్బంది ఎంతో కఠిన శిక్షణ తీసుకు న్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతితో పాటు అకాడమి జాయింట్ డైరక్టర్ మురళీధర్, డిప్యూటీ డైరక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బ్రాస్‌బ్యాండ్, బిగులర్ పోలీసు సిబ్బంది పరేడ్‌కు మెచ్చిన డిజిపి జితేందర్ వారికి నగదు రివార్డులు అందజేశారు.



జూ పార్కు డైరెక్టర్ సునీల్ ఎస్.హీరామత్‌కు తన కుమార్తెతో కలిసి చెక్కును అందజేస్తున్న కొణిదెల ఉపాసన

# జూ పార్కులోని తెల్లపులిని దత్తత తీసుకున్న ఉపాసన

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 20, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని తెల్ల పులిని అపోలో ఆసుపత్రుల సి.ఎస్.ఆర్.వైస్ చైర్మన్, యువర్ లైఫ్ సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సినీనటుడు రామ్ చరణ్ సతీమణి కొణిదెల ఉపాసన సంవత్సరం పాటు దత్తత తీసుకున్నారు. తన కమార్తె క్లీంకార్‌తో కలిసి ఉపాసన జూపార్కులోని వివిధ జంతువుల ఎన్‌క్లోజర్లను వీక్షించారు. జూ పార్కులోని తెల్ల పులిని ఒక సంవత్సరం పాటు ఉపాసన దత్తత తీసుకున్నారు. జూపార్కు డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరామత్‌ను కలిసి తెల్ల పులి పోషణకు అవసరమైన మూడు లక్షల రూపాయల చెక్కును ఉపాసన అందజేశారు. కాగా వన్య ప్రాణుల సంరక్షణకు మద్దతు ఇస్తున్న ఉపాసన గతంలో జూ పార్కులోని ఏనుగు, సింహాన్ని దత్తత తీసుకున్నారని జూపార్కు అధికారులు తెలిపారు.

## నీటిపారుదలశాఖ ఇఎన్‌సి జనరల్ అనిల్‌పై బదలీవేటు

### కొత్త ఇఎన్‌సిగా మహ్మద్ అంజద్ హుస్సేన్ నియామకం

**హైదరాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) అనిల్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేసింది. అవినీతి నిరోధకశాఖ ఇటీవల అరెస్టు చేసిన నూనె శ్రీధర్‌ను బదిలీ చేయాలని 27మే 2004లో ముఖ్యకార్యదర్శి ఆదేశాలు జారీచేసినా ఇఎన్‌సి అనిల్‌కుమార్ బదలీ చేయకుండా నిర్లక్ష్యం చేశారని అందుకే ఆయనపై బదిలీ వేటు వేశారని నీటిపారుదలశాఖలో చర్చించుకుంటూన్నారు. అనిల్‌కుమార్‌కు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా నేరుగా ప్రభుత్వంకు రిపోర్టు చేయమని నీటిపారుదలశాఖ కార్యదర్శి ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఇఎన్‌సి అడ్మిన్ గా ఉన్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌ను కొత్తగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇఇ ఉన్న నూనె శ్రీధర్‌ను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ అరెస్టు నూనె శ్రీధర్‌ను బదిలీ చేసి ఇఎన్‌సి కార్యాలయంలో రిపోర్టు చేయాలని అనిల్ కుమార్ ఆదేశించడంలో విఫలం కావడంతో ప్రభుత్వం ఆయన పై సీరియస్ అయింది.




# 2025-27 మేనేజింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్న క్రెడాయ్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ 2025 నుండి 2027 సంవత్సరం వరకు కొత్త మేనేజింగ్ కమిటీని ఎంచుకున్నట్లు వెల్లడించింది. వీరు హైదరాబాద్‌లో క్రెడాయ్ కార్యక్రమాలను ముందుకు నడిపించడం, బలోపేతంచేసే క్రమంలో ఈ రంగం అభివృద్ధికి మద్దతు ఇవ్వడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. క్రెడాయ్ అధ్యక్షునిగా ఎన్ జైదీప్ రెడ్డి, బి జగన్నాథరావు ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎంపికయ్యారని పేర్కొంది. మనోజ్ కుమార్ అగర్వాల్, కుర్రా శ్రీనాద్. కె అనిల్ రెడ్డి, వై రవి ప్రసాద్ ఉపాధ్యక్షులుగా ఎంపికయినట్లు పేర్కొంది. కొత్త బృందంలో శ్రీకాంత్ కిరణ్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా బాధ్యలు నిర్వర్తించనుండగా, నితీష్ రెడ్డి గూడూర్ కోశాధికారిగా, సంజయ్ కుమార్ బన్సాల్, శ్రీరామ్ ముసునూరు సంయుక్త కార్యదర్శులుగా ఉంటారని తెలిపింది. కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా అద్దుల గోపాల్ రెడ్డి, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి. ది జైపాల్‌రెడ్డి, బి వినోద్ రెడ్డి, సి అమరేందర్ రెడ్డి, కావ్య కావూరి, ఎన్. వేణుగోపాల్, సుశీల్ కుమార్ జైన్, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తారని పేర్కొంది. ఈ కొత్త బృందంఈ పదవీకాలంలో చేపట్టాల్సిన కార్యకలాపాలకు ప్రధాన మార్గదర్శక సూత్రంగా వృద్ధి, ఆవిష్కరణలను స్వీకరించడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం, స్మార్ట్ నిర్మాణం కోసం ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పర్యావరణ అనుకూల పట్టణ అభివృద్ధిని స్వీకరించడం, నగరంలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను విస్తరిస్తూ నిర్మాణం, ప్రాజెక్ట్ నిర్వహణ, మార్కెటింగ్ కోసం క్యూరేటెడ్ నైపుణ్య కార్యక్రమాలపై దృష్టి సారించడం వంటి భవిష్యత్తు దృష్టితో కూడిన ఇతివృత్తాలపై దృష్టి పెడతారని పేర్కొంది. ఈ బృందం ప్రభుత్వంతో మెరుగైన సహకారం, విధాన పరమైన కార్యకలా పాలలో చురుకుగా పాల్గొనడం, భాంతదేశంలో ఆర్యంత శక్తివంతమైన రియల్ ఎస్టేట్ గమ్య స్థానంగా నగరం ఖ్యాతిని బలోపేతం చేయడానికి బ్రాండ్ హైదరాబాద్‌ను ప్రచారం చేయటంపై దృష్టి పెడుతుందని క్రెడాయ్ పేర్కొంది.

# ప్రతి జిల్లాలో బిజెపి బలోపేతానికి చర్యలు

### కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై పోరాటం చేయాలి
### ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇతర అంశాలు తెరపైకి
### ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలి
### స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాప్‌లో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకుని వస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంచార్జ్ సునిల్ బన్సాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా భయంకరమైందన్నారు. బిజెపి ఆఫీసులో పనిచేసే సిబ్బంది, నాయకులు, సోషల్ మీడియా టీమ్ ఫోన్లను కూడా ట్యాప్ చేశారన్నారు. జడ్జిలు, వ్యాపారస్తులు, సినీనటులు, ప్రతిపక్ష నాయకులు, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఫోన్లను గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేశారన్నారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాటకాలాడు తున్నాయని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు బిజెపిని అడ్డుకునేలా కుట్రలు చేస్తున్నాయి. ఈ విషయంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు సిబిఐ దర్యాప్తునకు డిమాండ్ చేశారని, కానీ అధికారంలోకి రాగానే మరోలా మాట్లాడుతున్నారన్నారు. మండల కమిటీలు, జిల్లా కమిటీల నుంచి వచ్చిన నూతన నాయకత్వం రానున్న రోజుల్లో ఉద్యమాలతో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావాలి. నరేంద్ర మోడీ నాయకత్వంలోనే తెలంగాణను రక్షి ంచుకోగల్గు తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ఒక్క రూపాయి అప్పుపుట్టడం లేదంటూ మాట్లాడుతున్నాడని అన్నారు. ఇది గత బిఆర్ఎస్, ప్రస్తుత ప్రభుత్వం పాపమే అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల చేతగానితనం, అసమర్థత కారణంగానే తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించలేని పరిస్థితి దాపురించిందని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండలాల వారీగా, జిల్లాల వారీగా బిజెపి వర్క్ షాప్ లు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత నుంచి, బడుగు బలహీన వర్గాల నుంచి కొత్త నాయకత్వం రావాలన్నారు. తెలం గాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో, చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. రైల్వేలు, విద్యా రంగం, జాతీయ రహదారులు, ఆరోగ్య రంగం, గ్రామాల్లో అభివృద్ధి, ఇలా అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే తెలంగాణ రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా జరిగడం లేదు. 11 ఏళ్ల నరేంద్ర మోడీ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం సహా అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నించాలన్నారు. ఇప్పటికే మనం విజయవంతంగా మండల కమిటీలు పూర్తి చేసుకుంటున్నాం. మండల కమిటీల్లో వచ్చిన కొత్త రక్తానికి, నూతన నాయకత్వానికి పార్టీ సిద్ధాంతాలపై అవగాహన కల్పించాలి. రానున్న రోజుల్లో మండల కమిటీలు, జిల్లా కమిటీలు పోరాటాలకు సిద్ధం కావాలి. ఉద్యమాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల మద్దతును కూడగట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఖచ్చితంగా ప్రత్యామ్నాయ శక్తిగా బిజెపి ఎదగాలని, రానున్న రోజుల్లో మండలాలు, జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. గ్రామాల అభివృద్ధి, జాతీయ రహదారులు, రైల్వే, ఆరోగ్యం, విద్య.. ఇలా అన్ని రంగాల్లో కేంద్రం సహకారమే కీలకం అన్నారు. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నూతన అధ్యక్షులు, యువత, ప్రజల నుంచి వచ్చిన నాయకులు చాలామంది కొత్తవారు పార్టీకి శక్తివంతంగా నిలుస్తున్నారు. వారు అందరూ కలిసికట్టుగా పార్టీకి బలం కల్పించాలి. జిల్లాల్లో అనేక మంది ఇంకా భారతీయ జనతా పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యమైన నాయకులు కూడా ఈ రోజు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరుపుతున్నారు. వరుసగా అన్ని జిల్లాల్లో బిజెపిలో చేరికల కోసం కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూన్ 25వ తేదీన ఎమర్జెన్సీ వ్యతిరేక దినం (చీకటిరోజు)గా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. కాంగ్రెస్ పార్టీ గతంలో రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన విధానం, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిన తీరును ప్రజలకు వివరించాలి. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాచరణను మరింత బలపరిచే విధంగా వర్క్ షాప్‌లు ఏర్పాటు చేయాలని, మోర్చాల కమిటీలకు సంబంధించి మండల స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ సందర్భంగా, జిల్లాలో బిజెపి పటిష్టతకు దోహదపడే కమిటీలు, నిజమైన ప్రజా విశ్వాసాన్ని పొందగల నాయకులను తీసుకురావాలనే దిశగా మనం కృషి చేయాలి. కొత్త నాయకత్వంతో పార్టీని అన్ని జిల్లాల్లో ప్రజల ఆశల పార్టీగా నిలిపేలా

# అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

### సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక అభివృద్ధి కాంగ్రెస్ సిద్ధాంతం
### పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్
### అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** ఆర్థిక అభివృద్ధి తో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూరాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాదులోని ది వెస్టిన్, మైండ్ స్పేస్‌లో అసోచామ్ సదరన్ సిఎస్ఆర్ అండ్ సస్టెయినబులిటీ కౌన్సిల్ సదస్సు, అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభు త్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణను నిర్మించేం దుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి పని చేస్తుంది అన్నారు. మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం అన్నారు. 'ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టం అయ్యింది, ఇప్పుడు కేవలం 'లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అనివార్యం అన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆసిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుంది అన్నారు. పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి, మీ పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని డిప్యూటీ సీఎం ఉద్బోధించారు.

పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు. ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదు, శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుంది అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రైన్స్ వంటి రంగాల్లో తెలంగాణది తిరుగులేని ప్రస్థానం అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్స్‌తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్‌లో ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేసాం అన్నారు. సుస్థిరత అనేది పర్యావరణానికి మాత్రమే పరిమితం కాదు అది మానవ గౌరవాన్ని కూడా కలిగి ఉండాలన్నారు, అభివృద్ధి ఫలితాలు కేవలం కార్పొరేట్ ఆఫీసులకే పరిమితం కాకూడదు అవి ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అంతరించిపోతున్న గ్రామీణ కళాకారులకు చేరాలి అన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను మేము ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చే సంస్థలుగా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నాం అన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు

# కేంద్రీయ విద్యాలయంలో సీట్లు ఇప్పిస్తానని మోసం

### ఒక్కొక్కరి వద్ద రూ.6.50 లక్షల వసూళ్లు
### పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**హైదరాబాద్(సికింద్రాబాద్),జూన్ 20, ప్రభాతవార్త:** కేంద్రీయ విద్యాలయంలో పలువురు విద్యార్థులకు వివిధ తరగతులలో సీట్లు ఇప్పిస్తామని లక్షల రూపాయలు వసూలు చేసిన ఘరానా మోసం బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. స్థానికంగా ఉన్న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇప్పిస్తానని బిహారా కు చెందిన అమిత్ కుమార్ అనే వ్యక్తి పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సుమారు 6లక్షల 50వేల రూపాయలు వసూలు చేసి పారిపోయాడు. స్రవంతి, ఉబేరా అనే మహిళలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. కాగా నిందితుడు పాఠశాలలో పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు సైతం విద్యార్థులు తల్లిదండ్రులకు అందజేసి వారిని నమ్మించాడు. తమ పిల్లలకు కేంద్రీయ విధానాలు సీటు వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను తీసుకుని పాఠశాలకు వెళ్ళగా వారికి పెద్ద షాక్ తగిలింది. అసలు ఈ విద్యార్థులకు స్కూల్లో అడ్మిషన్లు ఇవ్వలేదని ప్రిన్సిపల్ చెప్పడంతో బాధితులు నిర్ఘాంతపోయారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ మోసంలో ఇంకా ఎవరెవరూ ఉన్నారని, అయితే పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# అసలు భాగోతం వెలుగులోకి వచ్చింది: హరీశ్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలతో బనకచర్ల అసలు బాగోతం వెలుగులోకి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ముం దుగానే రహస్య ఒప్పందం కుదుర్చుకుని, గోదావరి, కృష్ణా నదుల జలాల్లో తెలంగాణకు కేవలం 1500 టీఎంసీలు ఇస్తే సరిపోతుందని చెప్పడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలకు తీరని ద్రోహం తల పెట్టారని మండిపడ్డారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బనకచర్ల అంశంపై చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు శుక్రవారం స్పందించారు.

# ట్రంప్ ఆహ్వానాన్ని అందుకే తిరస్కరించా!: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 20:** పూరిజగన్నాథుని పవిత్ర భూమికి వెళ్లాల్సి ఉందని అందుకే తాను మీరిచ్చే విం దుకు హాజరుకాలేనని డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన ఒక బహిరంగసభలోనే ఈ అంశాలనుప్రస్తావించారు. ఇటీవలే కెనడాకు వెళ్లిన ప్రధానిమోడీ జి7 సదస్సుకు హాజరయ్యారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్‌మాక్రాన్‌తోపాటు ఇతర జి7 పెద్దలందరినీ కలిసి చర్చలుజరిపారు. ఈసమయంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తనకు ఫోన్‌కాల్‌చేసారని తన అధికారిక ఆహ్వానంపై మీరు వాషింగ్టన్‌కు రాగలరా అని ప్రశ్నించారు.



దీనిపై తాను స్పందిస్తూ ఇపుడునేను కెనడాలోని జి7 సదస్సులో ఉన్నానని, వాషింగ్టన్ రావాలన్న మీ ఆహ్వానం నాకు వీలుపడదని, తాను ఒడిశాకు వెళ్లాలని, దేవదేవుడు జగన్నాథుని పవిత్రభూమిని సందర్శించాలని అందువల్లనే రాలేకపోతున్నానని సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పారు. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రధానిమోడీ ప్రత్యేక అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో రూ.18,600 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇదిలా ఉంటే ప్రధానిమోడీ క్వాడ్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆహ్వానించారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.

## మంత్రి ఉత్తమ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదినం వేడుకలు జరుపుకున్నారు. ఈ సదర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆయనకు హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కాగా, ఉత్తమ్ జన్మదినం వేడుకల సందర్భంగా గాంధీభవన్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శత్రురావ్ నేతృత్వంలో స్వీట్స్ పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

## హైకోర్టులో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు స్వల్పఊరట

**హైదరాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** హైకోర్టులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు స్వల్పఊరట లభించింది. తనపై నమోదైన నాలుగు కేసులు కొట్టివేయాలని బండి సంజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారణ చేపట్టిన ధర్మాసనం తదుపరి విచారణను జూలై 14వ తేదీకి వాయిదా వేసింది. దీంతో పాటుగా కోర్టుకు హాజరు నుంచి బండి సంజయ్‌కు మినహాయింపు ఇచ్చింది. కాగా, 2021 నవంబర్ 15వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అనుమతి లేకుండా భారీ వాహనాలతో ర్యాలీ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల హైకోర్టు కొట్టివేసింది. కాగా సూర్యపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదయిన కేసు న్యాయస్థానం కొట్టివేసిన విషయం విదితమే. ఈ క్రమంలోనే మిగిలిన కేసులు కొట్టివేయాలని హైకోర్టులో బండి సంజయ్ పిటిషన్ దాఖలు చేశారు.

# ఎపి నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును నిలిపేయాలి

### తుమ్మిటిహాట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల నిర్మాణాన్ని చేపట్టాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** తుమ్మిటిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఆపుచేసి అఖిలపక్ష పార్టీలను అలాగే ఇరిగేషన్ మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు ప్రధాన బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో, వాటిని పక్కనబెట్టి తక్షణమే తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరంలో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునర్నిర్మాణం, మరమ్మతులు, సాధ్యాసాధ్యాలపై అఖిలపక్షం ఏర్పాటు చేసి.. ఇరిగేషన్ మేధావులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును సిపిఐ మొదటి నుంచి వ్యతిరేకించిందని గుర్తు చేశారు. దాని బదులుగా గతంలో నిర్ణయించిన ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్దనే బ్యారేజీ నిర్మిస్తే, ఒక్క లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్ళు తీసుకెళ్ళే అవకాశం ఉండేదన్నారు. రీడిజైన్ పేరుతో దానిని పక్కనబెట్టి.. కాళేశ్వరం పేరుతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీల నుంచి ఎగువన ఎల్లంపల్లికి నీటిని లిఫ్టు చేయడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్నదని అన్నారు. ఆ మూడు బ్యారేజీలు పనిచేసినా




విద్యుత్ అప్పులు, తిరిగి చెల్లింపులకు ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఒకవేళ వాటిని తిరిగి నిర్మించినా, మరమ్మతులు చేసినా భవిష్యత్తులో ఎలా ఉంటాయని చెప్పలేమని, కాబట్టి విజిలెన్స్ నివేదిక, ఎన్‌డిఎస్ తుది నివేదిక, జస్టిస్ పి.సి.ఘోష్ నివేదికలు వచ్చాక అఖిలపక్షాలు, ఇరిగేషన్ నిపుణులతో చర్చించాల్సిన అవసరం ఉందని కూనంనేని సూచించారు.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కింద ఇప్పటికే 70 కిలో మీటర్ల మేరకు కాలువలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. అక్కడి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు వస్తున్న మైలారం వద్ద 20 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా 40 కిలోమీటర్ల కాల్వ తవ్వితే నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు వస్తుందన్నారు. వరద జలాలపై తెలంగాణకు సైతం హక్కు ఉంటుందని, ఇందుకు సంబంధించి వాటాను తేల్చకుండా ఎపి ఏకపక్షంగా బనకచర్ల ప్రాజెక్టును ఏలా నిర్మిస్తుందని కూనంనేని ప్రశ్నించారు. జల వివాదాలు తెలుగు రాష్ట్రాలకు మంచిది కాదని హితవు పలికారు.

ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు సాగు నీటి పారుదల రంగం నిష్ణాతులతో అన్ని విధాలు చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మరోవైపు రూ. 85వేల కోట్ల భారీ వ్యయంతో తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును ఎపిలోని రైతు సంఘాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలు కూర్చుని సుమారు సముద్రంలో కలిసే 3000 టిఎంసిల జలాలు ఎవరి వాటా ఎంతో తేల్చుకున్న తర్వాతే కట్టుకోవచ్చున్నారు.

# భద్రకాళి అమ్మవారి బోనాలు తాత్కాలికంగా వాయిదా

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మకంగా వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఇటీవల భద్రకాళి బోనాలకి సంబంధించి కొంతమంది నుంచి అభ్యంతరాలు వెలువడిన నేపథ్యంలో, పలు మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని అనుకున్నట్టు స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను.. పవిత్రమైన అమ్మవారికి ముడిపెట్టి కొంతమంది ఉద్దేశపూరితంగా ఇబ్బందులు సృష్టిస్తారమోనని ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతో తాత్కాలికంగా బోనాలు నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రకాళి అమ్మవారి టెంపుల్ పరిధిలో శాఖాహార బోనాలే ఉంటాయని స్థానిక ఈఓ, వేదపండితులు, ప్రభుత్వం పలుమార్లు పునర్ఘాటించారని అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారమే, వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళి టెంపుల్ లో నిర్వహించాలని అనుకున్నమాన్నారు. అయితే, కొంతమంది మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తున్నట్టు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్ళాయన్నారు. రాజకీయాల కోసం భక్తుల మనస్సుల్లో తప్పుడు భావాలు నింపడం సహేతుకం కాదన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 22వ తారీఖు భద్రకాళి అమ్మవారి టెంపుల్ లో నిర్వహించాలన్న బోనాలను తాత్కాలికంగా రద్దు చేయాలని భావించినట్టు వివరించారు.

# 'మెగా157' ముస్సోరీ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ అవైటెడ్ మెగా157. చిరంజీవి సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి



అర్చన సమర్పిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. తాజాగా మేకర్స్ ముస్సోరీ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార మీద కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా ఉండబోతున్నాయి. కమర్షియల్ ఫార్మాట్లలో హిలేరియస్ ఎంటర్ టైనర్స్ చిత్రాలను రూపొందించడంలో మాస్టర్ అయిన అనిల్ రావిపూడి ప్రమోషనల్ కంటెంట్‌ను రూపొందించడంలో స్పెషలిస్ట్. ఇప్పటివరకు మెగా157 ప్రతి ప్రమోషనల్ వీడియోకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇటీవలే ముస్సోరీ షెడ్యూల్ నుంచి రిలీజ్ చేసిన వీడియోలో చిరంజీవి వింటేజ్ అవతార్‌లో అలరించారు. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎస్.కృష్ణ, జి.ఆది నారాయణ కో రైటర్స్. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. మెగా157 మూవీ 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీ గణేష్
సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి
నిర్మాతలు: సాహు గారపాటి సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్: గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్, సమర్పణ: శ్రీమతి అర్చన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో
డీవోపీ: సమీర్ రెడ్డి
ప్రొడక్షన్ డిజైనర్: ఎ.ఎస్.ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, రచయితలు: ఎస్కృష్ణ, జి ఆదినారాయణ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కృష్ణ.

# 'పెద్ది' నుంచి దివ్యేందు శర్మ స్పెషల్ బర్త్‌డే పోస్టర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మీర్జాపూర్ సిరీస్ ఫేమ్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ రోజు మేకర్స్ ఆయనకి బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే ఇంట్రస్టింగ్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు దివ్యేందు శర్మ. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించి దివ్యేందు శర్మ పోస్టర్ అదిరిపోయింది. దివ్యేందు శర్మను రామ్ బుజ్జిగా పరిచియం చేసిన పోస్టర్‌కి సోషల్ మీడియాలో ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. పెద్దిలో రామ్ బుజ్జి క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా వుండబోతోంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మ్యాసీవ్ సెట్లో హైఆక్టేన్, హై బడ్జెట్‌తో ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నారు. ఈ మైండ్‌బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రానికి స్టార్ డివోపీ ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

తారాగణం: రామ్ చరణ్, జాన్వి కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చి బాబు సానా సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఎఆర్ రెహమాన్, డిఒపి: ఆర్ రత్నవేలు ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పీఆర్వో: వంశీ శేఖర్.



# 'వార్2' చాలా సమయం పట్టింది: అయాన్ ముఖర్జీ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం వార్2. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతోన్న ఈ ఆరవ చిత్రాన్ని, ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్ బస్టర్ చిత్రాలను రూపొందిస్తోన్న వైఆర్ఎఫ్ లేటెస్ట్ మూవీ వార్ 2 గురించి చిత్ర దర్శకుడు అయాన్ మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఇండియన్ సినిమాలో ఐకానిక్ స్టార్స్ అయిన హృతిక్, ఎన్టీఆర్ మధ్య సంఘర్షణ అనేది అందరినీ ఆకర్షించేలా కథను రూపొందించటంలో తాను ఎక్కువగా సమయాన్ని వెచ్చించినట్లు ఆయన పేర్కొన్నారు. అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ఇష్టపడిన వార్ సినిమాకు కొనసాగింపుగా ఫ్రాంచైజీని రూపొందించటం, దానిపై నాదైన ముద్ర వేయాలనుకుని కష్టపడటాన్ని ఓ పెద్ద బాధ్యతగా భావిస్తాను. వార్2ను డైరెక్ట్ చేసేటప్పుడు నా తొలి చిత్రాన్ని డైరెక్ట్ చేసినట్లే భావించాను. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీలో మన సినిమా అనేది భాగమయ్యేలా చూసుకోవాలి. లేకపోతే ఆనందం ఉండదు. ఆల్ రెడీ బ్లాక్ బస్టర్ అయిన సినిమాను ముందుకు తీసుకెళుతున్నప్పుడు దానికంటూ సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. వారితో పాటు దేశంలోని ఇద్దరి సూపర్ స్టార్స్ ఫ్యాన్స్‌ను ఈ జర్నీలో భాగం చేయాలి. నిజాయతీగా చెప్పాలంటే ఓ దర్శకుడిగా ఇలాంటి భావనను కలిగించటానికి పూర్తిగా నిమగ్నమయ్యాను. ప్రేక్షకులకు ఓ సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ అందించేలా వార్2 చిత్రాన్ని రూపొందించాం. ఎన్టీఆర్, హృతిక్ మధ్య ఉండే సంఘర్షణ అనేది అందరికీ కనెక్ట్ అయ్యేలా కథను, అందుకు తగినట్టు యాక్షన్ సన్నివేశాలను రూపొందించాం. ఇండియన్ సినిమాలోని ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్ ఒకచోటికి చేరేలా వార్2 సినిమా చేసింది. వీరిద్దరి కలయికలో సినిమా ఎలా ఉంటుందోనని అభిమానులు, ప్రేక్షకులు ఎగ్జయి టెడ్‌గా ఉంటారో, వారి అంచనాలేంటో తెలుసు. అలాంటి వారు థియేటర్స్‌కు వచ్చినప్పుడు వారికి లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్‌లా ఈ సినిమా ఉండాలనే ఆలోచించి రూపొందించాం అన్నారు. ఇండియన్ సినిమా సెలబ్రేషన్ చేసుకునేలా వార్2 చిత్రాన్ని తెరకెక్కించాం. హృతిక్, ఎన్టీఆర్ కలయికలో గూజ్ బమ్స్ తెప్పించే సన్నివేశాలతో గొప్ప థియేట్రికల్ అనుభవాన్ని ఈ సినిమా అందిస్తుంది. వార్ 2 సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్ట్ 14న గ్రాండ్ రిలీజ్ కానుంది.





# బ్రాహ్మణ మిత్రులందరికీ నా నమస్సులు: మంచు విష్ణు

గత కొద్ది కాలంగా విష్ణు మంచు కథానాయకుడిగా నటించిన కన్నప్ప చిత్రం మీద జరుగుతున్న దుష్ప్రచారాన్ని చూసి సినిమాకి మాటల రచయితగా పనిచేసిన నా మనసుకి ఆవేదన కలిగి, కొన్ని విషయాలు మీతో చెప్పదల్చుకున్నాను. నా పేరు ఆకెళ్ళ శివప్రసాద్, బ్రాహ్మణుడిని. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీ ముకేష్ కుమార్ సింగ్ కూడా ఉత్తర భారత దేశానికి చెందిన బ్రాహ్మణులు. టీవీ సీరియల్గా మహాభారతాన్ని అత్యద్భుతంగా తీసిన దర్శకులు. ఈ చిత్రంలో బ్రాహ్మణులని గానీ, ఏ ఇతర కులాల వారిని గానీ కించపరచలేదు. అలాగే ఇదివరకు కన్నప్ప చరిత్ర మీద వచ్చిన చిత్రాలలో కన్నడ కంఠీరవ శ్రీ రాజ కుమార్ గారు నటించిన శ్రీ కాళహస్తి మహత్యం, శ్రీ కృష్ణంరాజు గారు నటించిన భక్త కన్నప్పఖి చిత్రాలలో గుడిలో ప్రధాన పూజారి మహదేవ శాస్త్రిని మహా శివ భక్తుడి పాత్రగా చాలా ఉన్నతంగా తీర్చిదిద్దారు. రేపు సినిమా చూశాక, ప్రేక్షకులందరికీ ఆ విషయం అర్థమవుతుంది. మరో విషయం ఏమిటంటే.. ఈ చిత్ర కథని రాస్తున్నప్పుడే కాకుండా, చిత్రాన్ని పూర్తి చేశాక కూడా పరమ పవిత్రమైన శ్రీ కాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకులకి చూపించారు. వారు చిత్రం ఎంతో ఉన్నతంగా వుందని ప్రశంసించి, శ్రీ మోహన్ బాబుని, శ్రీ విష్ణుని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఇక ఈ చిత్రంలో పాటని రాసిన శ్రీ రామజోగయ్య శాస్త్రితో పాటు ఎందరో బ్రాహ్మణులు వివిధ శాఖలలో పనిచేసారు.



ఇంకొక విషయం... ఏ వర్గం వారిని కించపరచడానికి, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, ఎన్నో వ్యయ ప్రయాసలను భరించి చిత్రాన్ని నిర్మించవలసిన అవసరం ఎవరికీ లేదు. చివరగా, కన్నప్ప చిత్రం ఇంకా విడుదల కాకుండానే ఏవేవో వదంతులు పుట్టించి, దుష్ప్రచారం చేస్తున్న వారి విషయం ఆ పరమేశ్వరుడే చూసుకుంటాడు.

# 'విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్' ట్రైలర్ విడుదల

భారతదేశపు ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ జీ5 తన వీక్షకులు, సబ్ స్క్రైబర్ల కోసం ఎప్పుడూ అద్భుతమైన వినోదాన్ని అందిస్తూ ఉంటుంది. తెలుగులో విజయవంతమైన ఒరిజినల్ షోలు, చిత్రాలతో ఆకట్టుకునే జీ5 ఇప్పుడు విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్ అనే ఇంట్రెస్టింగ్ సిరీస్‌తో అలరించబోతోంది. సోషల్ మీడియా సెన్సేషన్ అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్ సిరీస్‌కు పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై రేజు శ్రీరామ్ ఈ సిరీస్‌ను నిర్మించారు. ఈ సిరీస్ జూన్ 27న ప్రత్యేకంగా జీ5లో ప్రీమియర్ కానుంది. ఈ క్రమంలో తాజాగా విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. విరాటపాలెం గ్రామంలో ఓ శాపం ఉంటుంది. ఆ ఊర్లో ఏ పెళ్లి జరిగినా సరే మరుసటి రోజు పెళ్లి కూతురు చనిపోతుంటుంది. అలా పదేళ్లుగా ఆ ఊరిని శాపం పట్టి పీడిస్తుందని ప్రజలు నమ్ముతుంటారు. అలాంటి ఊరికి లేడీ కానిస్టేబుల్ మీనా (అభి) వస్తుంది. ఊరి ప్రజల మూఢ నమ్మకాన్ని, ఆ ఊరి రహస్యాల్ని పటా పంచెలు చేయడానికి పెళ్లికి రెడీ అవుతుంది మీనా. ఆ తరువాత ఏం జరిగింది? అసలు ఈ మరణాల వెనుకున్న ఉన్నది ఏంటి? కానిస్టేబుల్ మీనా నిజాన్ని ఊరి ప్రజలకు తెలిసేలా చేసిందా? లేదా? అనే ఆసక్తికరమైన ప్రశ్నలు తలెత్తేలా ట్రైలర్‌ను కట్ చేశారు. ఇక ఈ ట్రైలర్‌ను చూస్తే వాతావరణం అంతా కూడా 80వ దశకానికి చెందినట్టుగానే కనిపిస్తోంది. నటీనటుల కట్టూ బొట్టూ, మాట తీరు, విజువల్స్ అన్నీ కూడా ఆ కాలానికి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తున్నాయి. మ్యూజిక్, విజువల్స్ ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణ కానున్నాయని పిస్తోంది. విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకర్షించే ఎడ్జ్ ఆఫ్‌దిసీట్ థ్రిల్లర్ అని అర్థం అవుతోంది.



# 'కరుప్పు' టైటిల్ లుక్ అదుర్స్

సూర్య తన మాగ్నమోపస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ సూర్య45 కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. తమిళ, తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలలో అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఈ చిత్రానికి కరుప్పు అని టైటిల్ పెట్టారు. దర్శకుడు ఆర్జే బాలాజీ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ లుక్‌ను రిలీజ్ చేశారు. టైటిల్ పోస్టర్ పవర్ ఫుల్‌గా కనిపిస్తోంది, సూర్య చేతిలో కత్తి పట్టుకుని, అతని వెనుక ఒక దేవత ఉన్నట్లుగా ఫెరోషియష్ అవతార్‌లో కనిపించారు. సినిమా యాక్షన్‌తో నిండి ఉంటుందని, సూర్య వైల్డ్‌పాత్రలో కనిపిస్తాడని పోస్టర్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన చిత్రాల్లో కరుప్పు అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. మంచి ఎంటర్ టైనర్‌లను తీసే ఆర్జే బాలాజీ బడ్జెట్, విజన్. స్టార్ కాస్ట్‌పరంగా కరుప్పుతో నెక్స్ట్‌లెవల్‌కి వెళ్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత సూర్య, త్రిష కృష్ణన్ తిరిగి ఈ చిత్రంలో జోడిగా నటిస్తున్నారు. ఇద్దరూ తమ మునుపటి చిత్రాలతో పోలిస్తే భిన్నమైన మేకోవర్‌లో కనిపిస్తారు. ఈ చిత్రంలో ఇంద్రన్స్, నట్టి, స్వాసిక, అనఘ మాయ రవి, శివద, సుప్రీత్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# 'నాగబంధం' నుంచి సాంగ్ రిలీజ్

యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వం దర్శకత్వంలో ఎన్ఐకె స్టూడియోస్ బ్యానర్‌లో కిషోర్ అన్నపురెడ్డి అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి నిర్మించిన పాన్ ఇండియా ఫిలిం నాగబంధం చేస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. ప్రీలుక్, ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. విరాట్ కర్ణ పాత్ర కోసం పూర్తిగా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. వైల్డ్ అవాతర్‌లో కనిపించిన అతని జిమ్ ఫోటోలు సినిమా కోసం అతని అంకితభావాన్ని చూపించాయి. సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం, మేకర్స్ ఒక కీలకమైన సన్నివేశాన్ని, ఒకపాటను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన అనంత పద్మనాభ స్వామి ఆలయం సెట్‌లో చిత్రీకరించారు. అద్భుతంగా నిర్మించిన ఈ సెట్ సందర్శించి మీడియాను సర్ ప్రైజ్ చేసింది. కేరళలోని అసలు దేవాలయానికి కచ్చితమైన ప్రతిరూపంగా కనిపిస్తోందని ఎంతోమంది ప్రశంసించారు. ఈ పాటలో ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య పర్యవేక్షణలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్యకారులు పాల్గొంటున్నారు. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా వుంటుంది. ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించారు. నాగబంధం ఒక విజువల్ స్పెక్టకిల్‌గా ఉండబోతోంది. ఈ ఎపిసోడ్ కోసం వేసిన భారీ సెట్, అంతే స్థాయిలో నిర్మాణం టాక్ అఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా..జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియన్ ఫిల్మ్ నాగబంధం పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో వుంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టిసారించి, భారత దేశంలోని విష్ణు దేవాలయల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పనిచేస్తున్నారు. అభే సంగీత దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాశారు.





# విశ్వభాష సంగీతం




సంగీతానికి ప్రత్యేకంగా ఓ రోజు ఎందుకు కేటాయించారో తెలుసా? సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, ఇలా లలిత కళలు ఐదు. కానీ మిగతా వాటికి భిన్నమైన దారి సంగీతానిది. సంగీతానిది ఎలాంటి ఎల్లలూ, హద్దులూ లేవని విశ్వభాష. సంగీతం మనసుకు హాయిని కలిగిస్తుంది కొన్ని రకాల అనారోగ్యాలను తొలగిస్తుంది.

ముఖ్యంగా మానసిక ఆరోగ్యానికి సంగీతంతో చికిత్స చేయవచ్చు. జూన్ 21న ప్రపంచ సంగీతం దినోత్సవం. ఈ సందర్భంగా సంగీతం మనిషి జీవితంతో ఎంతగా పెనవేసుకుని పోయిందో, అన్ని రోజులూ మన వీనులకు విందుగావించే సంగీతానికే ప్రత్యేకంగా ఓ రోజుంటూ కేటాయించారు. మనకు నచ్చిన పాట లేదా మనకు హత్తుకునే సంగీతం విన్నప్పుడు మనకు తెలీకుండానే ఒక రకమైన తన్మయత్వం కలుగుతుంది. ఎప్పుడైనా కాస్త డీలా పడినట్లు, ఒత్తిడికి లోనైనట్లు అనిపించినప్పుడు ఒక మంచి పాట, వీనుల విందైన సంగీతం వింటే ఒత్తిడి మొత్తం ఎగిరిపోతుంది. ఎంతో సాంత్వన లభిస్తుంది. నూతనోత్తేజం కలుగుతుంది. ఇక సంతోష సమయాలలో ఐతే చెప్పనక్కర్లేదు. పెళ్లి వేడుకలు, ఇతర కార్యక్రమాల్లో ఉరకలెత్తించే, హుషారు కలిగించే సంగీతం, పాటలు వాతావరనాన్ని మరింత సందడిగా ఆహ్లాదంగా మారుస్తాయి. మొత్తంగా సంగీతాన్ని ఇష్టపడని సంగీతానికి పరవశించని వారంటూ ఉండరంటే అతిశయోక్తి కాదేమో!

సంగీతం.. సార్వజనీయం.... పొత్తిళ్లలోని పాపాయి ఉంగా ఉంగా అని చేసే శబ్దంలో ఉంది సంగీతం. తల్లి తన బిడ్డను ఊయలలూపుతూ పాడే లాలిపాటల్లో ఉంది సంగీతం, ఏడుస్తున్న పసిబిడ్డ ఆ ఏడుపు ఆపి హాయిగా కేరింతలు కొట్టేట్లు చేయగల అమ్మలు, బామ్మల జోలపాటల్లో ఉంది సంగీతం, శ్రమైక జీవులు తమకు అలుపు తెలీకుండా పాడుకునే పాటల్లో ఉంది సంగీతం. ఇవన్నీ కూడా ఎలాంటి శాస్త్రీయ పద్ధతిని పాటించక పోయినప్పటికీ ఒక సొగసైన తాళం, రమ్యమైన లయతో సాగుతుంటాయి. మనషులే కాదు ఇతర ప్రాణులకూ ఉంది సంగీత జ్ఞానం. నాగస్వరం విన్న సర్పాలు సొగసుగా నాట్యమాడటం, చైత్రమాసాన లేత మామిడి చివుళ్ల తిన్న కొయిలమ్మ కుహుకుహు రాగమాలపించటం, సంగీతం వింటూ ఆవులు పాలు సమృద్ధిగా ఇవ్వడం మనకు తెలిసిందే. అందుగలడిందులేడని అన్న చందాన ప్రపంచ మంతటా నిండి ఉంది సంగీతం. అందుకే అన్నారు శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణిః అని.

**ఐక్యరాజ్యసమితి ప్రకటన ...** ప్రజల మనస్సుల్లో, ఆలోచనల్లో సంగీతాన్ని నిత్య నూతనంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి జూన్ 21ని ప్రపంచ సంగీత దినోత్సవంగా నిర్వహించాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచమంతటా జూన్ 21ని వరల్డ్ మ్యూజిక్ డేగా పాటించాలని ప్రకటించింది. ఇది క్రమంగా అన్ని దేశాలకు, నగరాలకు వ్యాపించి వరల్డ్‌మ్యూజిక్ డేకు ప్రాచుర్యం లభించింది. ప్రపంచ సంగీత దినోత్స వాన్ని 'ఫెటె డే లా మ్యూజిక్' అని 'మేక్ మ్యూజిక్ డే' అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో, వరల్డ్ మ్యూజిక్ డే సంబరాలను జరుపుకుంటున్నారు. □

# ప్రశాంతతకు యోగ బలం




**హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయంలో భాగమైన యోగాన్ని శాస్త్రీయంగా క్రోడీకరించిన ఆధ్యుడు పతంజలి.క్రీ.పూ.100-500వ శకము మధ్యకాలములో పతంజలి యోగ సూత్రాలను రచించినట్లు పరిశోధనల ద్వారా తెలుస్తోంది. వేదములు, పురాణములు, ఉపనిషత్తులు, రామాయణము, మహాభారతము, భాగవతము, భగవద్గీతలలో యోగా ప్రస్థావన కలదు.**

వాటి నుంచి పతంజలి క్రోడీకరించినవే యోగసూత్రాలు. సూత్రము అంటే దారము. దారములో మణులను చేర్చినట్లుగా యోగ సూత్రాలను పతంజలి ఒకచోట కూర్చి మనకు అందించెను. వాటిలో హఠయోగ ప్రదీపిక, శివ సంహిత ప్రధాన భాగాలు. అంతర్భాగ్మాలెన కర్మ యోగము, జ్ఞానయోగము, రాజయోగము, భక్తియోగము మొదలగునవి హిందూతత్త్వములో భాగాలు. భగవద్గీతలో యోగములు 18 అధ్యాయములుగా విభజించిచెప్పబడినవి. యోగము అనే పదము 'యుజ్' అనే ధాతువు నుండి ఉత్పన్నమైనది. యుజ్ అంటే కలయిక. 'యుజ్యతేఏతదితియోగ', 'యుజ్యతే అనేన ఇతియోగ' వంటి నిర్వచనాల ద్వారా ఏర్పడినది. యోగమనగా ఇంద్రియములను వశపరచుకొని చిత్తమును ఈశ్వరుని యందు లయం చేయుట, ఇంద్రియములను వశపరచకొనుటకు శారీరిక వ్యాయామ ప్రక్రియలనే లౌకికంగాయోగా అని వ్యవహారించటం జరుగుతోంది. ఇంద్రియ నిగ్రహము కలిగినప్పుడు మనసు ఏకాగ్రతతో ధ్యానసాధన చేసి మోక్షసాధన చేయగలము. ఇటువంటి ఏకాగ్రతతో పరమార్థతత్త్వమునకు త్రోవ చేసుకొని పోవచ్చును. ఆత్మతనలోని గూఢంగా ఉన్న నిజశక్తిని సాధిస్తుంది.ఇలా ఆంతరంగికమైన శిక్షణకుభిన్న మార్గాలున్నాయి. వాటిని వివిధ యోగవిధానాలలో సూత్రకారులు విభజించారు. యోగము అనగాసాధన, అదృష్టము అనే రెండు అర్థాలున్నాయి. భారతీయ తత్త్వశాస్త్రములోని ఆరు దర్శనాలలో 'యోగ'లేదా యోగదర్శనము వ్యాయామసాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపం.ఇది హిందుత్వ ఆధ్యాత్మిక సాధనలో ఒక భాగము. మోక్ష సాధనలో భాగమైన ధ్యానం, అంతః దృష్టి, పరమానంద ప్రాప్తిలాంటి ఆధ్యాత్మిక పరమైన సాధనలకు పునాది. హఠయోగములో భాగమైన శారీరక ఆసనాలు శరీరారోగ్యానికి, మానసిక వికాశానికి, శరీరధారుఢ్యానికి, ముఖవర్చస్సు ఇనుమడింప చేయటానికి దోహదం చేస్తాయి. మనకిప్రధానంగా ఆరోగ్యమే మహాభాగ్యము కనుకయోగాసనాల గురించి తెలుసుకోవాలి.యోగాసనాలు 15 విధాలుగా ఉన్నాయి. ఓంకారము,



పద్మాసనము, సిద్ధాసనము, గోముఖాసనము, చక్రాసనము, ధనురాసనము, పవన ముక్తాసనము, మకరాసనము, మత్స్యాసనము, భుజంగాసనము, శశాంకాసనము, వజ్రాసనము, ఉదరాకర్షనాసనము, హలాసనము మరియు సర్వాంగాసనము. ఈ విధమైన ఆసనాలు శిక్షణ పొంది నిత్యము సాధన చేసినట్లయితే శరీరధారుఢ్యము, ఆరోగ్యము పొందవచ్చును. అయితే ఇవి శరీరము నంతటిని ప్రభావితము చేసి ఆరోగ్యవంతమైన ఫలితాలిస్తాయి. స్వరసాధన, శుద్ధిక్రియలు, యోగికంగా సూక్ష్మ, స్థూల ఆసనాలు లేక వ్యాయామము లేక అసనాలు ఒకదాని కొకటి సంబంధము కలిగి ఉన్నాయి. ఇవి ఒక క్రమములో చేసినట్లయితే అధిక ప్రయోజనము పొంద వచ్చును. మనస్సును కామ క్రోదాదిషడ్వికారముల నుండి దూదరంచేసి బ్రహ్మ లేక పరమేశ్వరునితో జోడించటం యోగాభ్యాసముతోనే సాధ్యపడుతుంది. నిత్యము ఓంకార సాధన చేయాలి. యోగిక స్థూల వ్యాయామము 5 విధాలుగా చేయవచ్చును. సూర్యనమస్కారములు, సర్వాంగపుష్టి, ఉత్కర్షణము, రేఖాగతి, ఊర్ధ్వగతి, హృద్గతి యోగసూనత్రములనే అష్టాంగయోగము అని కూడా వ్యవహరిస్తారు. యోగిక సూక్ష్మ వ్యాయామము 10 విధాలుగా చేయవచ్చును. అవిప్రార్థన, బుద్ధిలేదాధృతి, శక్తివికాసాలు, స్మరణ, మేధాశక్తి నేత్రశక్తి, కర్ణశక్తి, మెడశక్తి, బాహుశక్తి, భుజబంధశక్తి. నిత్యము ఆసనములను క్రమబద్ధముగా చేయుచూ నూరు వసంతాల జీవితము ఆరోగ్యంగా సంతోషంగా జీవించవచ్చును. నిత్యము ఆసనములను క్రమబద్ధముగా చేయుచూ నూరు వసంతాల జీవితము ఆరోగ్యంగా సంతోషంగా జీవించవచ్చును. భారతదేశంలో 21 జూన్ 2016నుంచి యోగా దినోత్సవం జరుపుకుంటున్నాము. ఆరోగ్యమే మనకు ప్రధాన భాగ్యము కనుక ఆరోగ్యంతో ఉంటే అభివృద్ధికి బాటలు వేయాలనే ఆలోచన కలుగుతుంది. అందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు.


**- డా.దేవులపల్లిపద్మజ**

# కాటన్ చీరలో అమ్మాయిలు



భారతీయ సంస్కృతి అనగానే 'చీర' తప్పక గుర్తొస్తుంది కదూ! ఇప్పటిదా... ఏళ్లనాటిది. దీనికి ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదేమో. ఇక కాటన్ చీర అదిచ్చే సుతిమెత్తని హాయి అమ్మనీ, బొమ్మలనీ గుర్తు చేస్తుంది. అందుకే ప్రతి అమ్మాయికీ ఓ ఆత్మీయ అనుబంధం... మరపురాని జ్ఞాపకం. అలాగని కాటన్ చీరలో బామ్మలవే అని తోసిపారేయట్లేదు కదా? ఒక్కసారి అలా మెట్రోలో వెళ్లిరండి. ఆఫీసు, ఎక్కడ చూసినా కాటన్ చీరలో మెరిసిపోయే అందమైన యువతులు కనిపించడం మిలీనియల్స్ వెస్ట్రన్ ఫార్మల్స్‌ని కాదని మరీ వీటికే మొగ్గు చూపుతున్నారు. తమను తాము చెప్పుకొనే, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించే మార్గంగా వీటిని అందిస్తుంది. పైగా అందం ముఖ్యంగా ఏ సందర్భానికైనా ఇట్టే అమరిపోతున్నాయి.

# గుడ్లు ఉడకబెట్టిన నీళ్లతో..



గుడ్లు కుక్కర్లో అయితే రాళ్లలా అవుతాయి కనుక.. విడిగానే ఉడకబెడతాం. తర్వాత ఆ నీళ్లను పారబోస్తాం కదా! కానీ అలా వృథా చేయొద్దంటున్నారు పరిశోధకులు. ఎందుకంటే..

✦ జిడ్డు పేరుకున్న వంటింటి గట్టు, గోడలను ఈ నీటితో శుభ్రం చేస్తే మురికి త్వరగా వదులుతుంది.

✦ గుడ్డు పెంకులో క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ విస్తారంగా ఉంటాయి. అందువల్ల గుడ్లు ఉడికించిన నీళ్ల చల్లారాక మట్టిలో పోస్తే నేల సారవంతమవుతుంది.

✦ ఈ నీళ్లతో మొక్కలు బలంగా పెరుగుతాయి.

✦. వీటిని తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే కుదుళ్ల బలపడతాయి. జుట్టు రాలదు.

✦ గుడ్డుతో పాటు డొల్ల కూడా మేలుచేస్తుందని తెలిశాక ఇక పడేయలేంకదా! □

# టివిని పూర్తిగా నిరోధించలేమా?



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ప్రపంచవ్యాప్తంగా హెచ్‌డిఆర్, టిబి ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా క్షయవ్యాధి నివారణలో అవరోధంగా ఉంది. ఇది ఒక రకమైన క్షయవ్యాధి. ఇది ఐసోనియాజిడ్, రిఫాంపిసిన్ అనే మొదటి లైన్ ఆంటి ట్యూబర్క్యులస్ మందులకి నిరోధకతని కల్గి ఉండే దీన్ని ముద్ర టి.బి. లేదా మల్టీడ్రగ్ రెసిస్టంట్ టివి ఆర్ఆర్ టిబి, ఎమ్‌డిఆర్ టిబి అని అంటారు. ఇది మందులకి నిరోధకత కల్గిన క్షయవ్యాధి కాంప్లెక్స్ యొక్క మైకోబాక్టీరియం జాతి వల్ల ఏర్పడే టి.బి. వ్యాధి ఒక రూపం. ఎందుకంటే ఈ మందులు టిబి క్రిముల్ని చంపలేవు.

ఇది పశ్చిమ, మధ్య ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమ మధ్యధరా ప్రాంతాల్లో అరుదుగా కన్పించినప్పటికి చైనా, భారత్, రష్యా, తూర్పు యూరోప్, మధ్య ఆసియా, దక్షిణాఫ్రికాలో ఎక్కువగా ఉండడం గమనర్హం. క్రొత్త టి.బి. రోగుల్లో 34%, గతంలో టి.బి.కి చికిత్స తీసుకున్న వారిలో 20% మందికి ఎండిఆర్ టిబి ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరిలో 44% మంది మరణిస్తున్నారు. చికిత్స పూర్తిగా తీసుకోకపోవడం వల్ల 1991లో మల్టీఫుల్ డ్రగ్ రెసిస్టెంట్ టిబి అనే క్రొత్త క్షయవ్యాధిని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించడమైనది. ప్రపంచవ్యాప్తంగా 410000 మంది ఎంపిఆర్-టిబిని అభివృద్ధి చేశారు.

**కారణాలు :** రోగి పూర్తి చికిత్సని తీసుకోక పోయినప్పుడు రోగి కండీషన్‌ని బట్టి సరైన మోతాదులో మందులు తీసుకోక పోవడం, సరైన మందులు అందుబాటులో లేకపోవడం, నాణ్యత లేని టిబి మందులు, సరైన ప్రిస్కిప్షన్ లేకపోవడం, చికిత్సని ముందుగానే ఆపివేయడం, ప్రామాణిక మార్గదర్శకాలు లేకపోవడం, ఎండిఆర్-టిబిని గుర్తించడంలో వైఫల్యం, సమస్యని తీవ్రతరం చేయడానికి. ఎక్కువ సమయం తీసుకోవడం, డ్రగ్ మలాబ్జర్షన్ సెకండరీ రెసిస్టెన్స్ అనేక మందులకి కట్టుబడి ఉండకపోవడం. రోగ నిర్ధారణ సరిగా చేయని కారణం. మొదటిలైన్ చికిత్సకు ప్రతిస్పందని రోగులు, డ్రగ్ సస్సెప్టబిలిటీ, ఔషధ క్రియారహితం చేసే ఎంజైమ్‌లు ఉత్పత్తి కావడం, మైక్రోబాక్టీరియం ట్యూబర్క్యులో సిస్‌కి డ్రగ్ రెసిస్టెన్స్ అనేది ఆకస్మిక మరియు యాదృచ్ఛికమైన క్రోమజోముల మ్యూటేషన్ ఫలితంగా ఏర్పడుతుంది. సకాలంలో టిబి సోకిన కుటుంబాల్ని, సన్నిహితుల్ని గుర్తించడంలో భౌగోళిక అసమానతలు, ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం వల్ల కూడా వ్యాధి వచ్చే అవకాశముంది. ఎండిఆర్ క్షయ అనేది గాలిలో వ్యాపించే వ్యాధి కారకమైనందున చురుకైన పల్మోనరీ టిబితో బాధపడుతున్నా వ్యక్తులు దగ్గుతున్నప్పుడు మల్టీడ్రగ్ రెసిస్టెంట్ స్ట్రెయిన్ వల్ల వ్యాధిని సంక్రమింపచేస్తారు.

**వ్యాధి లక్షణాలు:** తాత్కాలికమైనవి: ఆకలి లేకపోవడం, లోజర్వం, అలసట, నీరసం, విరేచనాలు, వికారం, వాంతులు, మైకం, ఫ్లూ జ్వరం లక్షణాలు, దృష్టిమార్పులు, దురదలు, దద్దుర్లు కామెర్లు నారింజ రంగు మూత్రం పోవడం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయి.

**దీర్ఘకాలికమైనవి ..** గట్‌హెల్త్ దెబ్బతినడం వల్ల తరుచూ అతిసారం, వికారం, కడుపునొప్పి, మలబద్ధకం, మలంలోరక్తం పడడంతోపాటు మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, స్థూలకాయం, ఊపిరి తిత్తుల బలహీనత (20-50), నిద్రలేమి, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, నిరాశ, ఆందోళన, అలసట, దగ్గు, కఫంలో రక్తం పడడం, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. కొందరిలో దద్దుర్లు, ముఖం, నోటివాపు, గురక, శ్వాసక్రియ రేటు తగ్గడం, హృదయ స్పందన రేటు తగ్గడం, ఆందళన, గందర గోళం, వాంతులు, మూర్ఛలు, స్పృహకోల్పోవడం, పాలిపోవడం వంటి అనఫిలాక్సిస్ లక్షణాలుంటాయి. ఇవి ఒక్కొకరికి ఒకోక విధంగా ఉంటాయి. క్షయ మందుల వల్ల ఊపిరితిత్తుల పనితీరు తగ్గిన వారిలో 27.9% చికిత్స ఆపివేసిన 3 సంవత్సరాల తర్వాత కూడా వ్యాధి లక్షణాలు కన్పించవచ్చు. □

ఆరోగ్య భాగ్యం

# అహల్య ప్రాయశ్చిత్తం



పూర్వం సత్యవర్ష మహర్షి అనే జ్ఞాని అరణ్యంలో కుటీరం ఏర్పరచుకుని, వేదపాఠాలు నేర్పేవాడు. ఒకసారి ఓ శిష్యుడు 'గురుదేవా! ఎంతోకాలంగా నన్నొక సంశయం పట్టిపీడిస్తోంది. దాన్ని తీర్చాల్సిందిగా ప్రార్థిస్తున్నాను అంటూ చేతులు జోడించాడు. ఏమిటో చెప్పమన్నారాయన. అయ్యా! దేవేంద్రుడిది తేజోమయమైన దివ్యదేహం. అహల్యది మట్టితో కూడినది. ఈ రెండు దేహాలకూ సాంగత్యం కుదరదు కదా! మరీ దీన్నెలా అర్థం చేసుకోవాలి? అనడిగాడు. నాయనా! అహల్య భావపరమైన మోహానికి పాల్పడింది. అందువల్ల భర్త శపించాడు. సంవత్సరాల తరబడి ఆమె ఆకలిదప్పులు లేని ఒక శిలామూర్తిగా ఉండిపోయింది. అలా ప్రాయశ్చిత్తం చేసుకోవడం వల్ల తన మానసిక దోషాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేసుకుంది. అది చాలక. పరమ పావన మైన శ్రీరామచంద్రుడి పాదస్పర్శకూ నోచుకుంది. అందువల్లే ఆమె కడిగిన ముత్యంలా ప్రకాశించింది. పతివ్రతా శిరో మణుల్లో తొలి స్థానం అందుకుని పూజ్యురాలయ్యింది. కేవలం మానసిక దోషానికే అంత ప్రాయశ్చిత్తం చేసుకున్నదంటే.. ఇక మనలాంటి సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అహల్యగాథ తెలియచేస్తుంది అంటూ వివరించాడు సత్యవర్ష మహర్షి. □

ఆధ్యాత్మికం

# ఊబకాయం తగ్గేదెలా ?

**ప్రస్తుత సమాజంలో ఊబకాయం ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తోంది.** ఆరోగ్య సమస్యల్లో ఇది ప్రధాన సమస్యగా మారుతోంది. మారుతున్న జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటం ఊబకాయం (ఒబెసిటీ) వ్యాధికి కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణం. పెద్దలతో పాటు చిన్నారులు ఊబకాయం బారినపడడం ఆందోళన కల్గిస్తుంది.

**సమస్య ఇలా..** పెద్దవారిలో సహా, చిన్నపిల్లలు 20 శాతం ఈ ఊబకాయం వ్యాధి బారినపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె అధిక మోతాదులో కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరుగుతుంది. దీని కార ణంగా ఊబకాయ బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. పక్షవాతం, నరాల సమస్యలు వంటివి దారితీస్తున్నాయి. గత పదేళ్లలో ఆహార అలవాట్లు ఇతరత్రా కారణాల వల్ల చిన్నారుల్లో ఊబకాయ సమస్యలు తీవ్రంగా ఉంది.

**ముందు జాగ్రత్తలు..** సమతుల్యమైన ఆహారపు అలవాట్లు రోజు తీసుకోవాలి. వ్యాయమాన్ని కొనసాగిస్తే బరువు పెరగకుండా కాపాడు కోగలుగుతాం. ఒబెసిటీకి గురయ్యాక చేసే వర్కవుట్ల కంటే ముందస్తూ జాగ్రత్తలు పాటించాలి.

**వ్యాయమాలు చేయాలి...** చాలామంది ఒబెసిటీకి గురవుతుంటారు. మొదటి నుంచే బరువు పెరగకుండా సమతుల్యత పాటిస్తే ఉబకాయాన్ని కచ్చితంగా నివారించవచ్చు. మంచి ఆహారపు అలవాట్లు, మానసిక ప్రశాంతత, రోజు వ్యాయమాలు చేయాలి.

**జాగ్రత్తలు ఇవే..** ఊబకాయ సమస్యతో బాధపడేవారు శరీర బరువు తగ్గాలంటే వారంలో రెండు రోజులు ఉపవాసం చేయాలి. 20 ఏళ్లు దాటినవారు ప్రతీరోజు 2,500 కేలరీలు తీసుకోవాలి. ఏ ఆహారం తీసుకున్న ఈ కెలరీలు దాటకుండా చూసుకోవాలి. మిగిలిన రెండు రోజుల్లోకేవలం పావు వంతు అంటే 500 కేలరీలు మాత్రమే తీసుకోవాలి. కార్బొహైడ్రేట్లు తక్కువగా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. కూరగాయలతో పాటు అన్నానికి బదులు రాగి, జొన్న, చేపలు, చికెన్ తీసుకోవాలి. కాఫీ టీ తీసుకోవచ్చు. తరచూ నీటిని తాగుతూ ఉండాలి. □

# రసబలీ

ఒడియా ప్రసిద్ధ పండివంటల్లో 'రసబలీ' మిఠాయి ఒకటి. దీన్నెలా చేయాలంటే అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో రెండు కప్పుల పాలు పోసి, కాస్త కుంకుమ పువ్వు వేయాలి. సన్న సెగ మీద పాలు సగం అయ్యేవరకూ మరిగించాలి. అందులో అర కప్పు పంచదార వేసి అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి..కలియ తిపి దించేయాలి. మరోపాత్రలో కప్పు తురిమిన పనీర్, చెంచా చొప్పున ఉప్మా రవ్వ, గోధుమ పిండివేసి బాగా కలిపితే.. మెత్తటి పిండిలా తయాంవుతుంది. దాన్ని నిమ్మ కాయంత భాగాలుగా చేసి, టిక్కీలుగా ఒత్తుకోవాలి. సైజు, మందం అన్నీ సమానంగా ఉండేట్లు చేసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి. వీటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనంగా ఉన్న నూనె పీల్చేసుకుంటాము. ఈ టిక్కీస్‌ను మరిగించిన పాలలో వేయాలి. అరగంట నానితే సరి.. తియ్యటి రసబలీ మిఠాయి సిద్ధమైపోతుంది. సులువైన ఈ స్వీటు సూపర్ టేస్టీగా ఉంటుంది. తిని ఆనందించడమే తరువాయి. □



# ఇంగ్లండ్ గడ్డపై.. భారత్‌కు టెస్ట్ సవాల్


అజిత్ వాడేకర్


కపిల్ దేవ్



రాహుల్ ద్రవిడ్

## 3 సార్లు మాత్రమే సిరీస్ కైవసం

### వాడేకర్, కపిల్, ద్రవిడ్ కెప్టెన్సీలో గెలుపు

**న్యూఢిల్లీ:** క్రికెట్ జన్మస్థలం ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలవడం లేదా కనీసం డ్రా చేసుకోవడం అనేది ఏ జట్టుకైనా, ముఖ్యంగా భారత జట్టుకు ఒక గొప్ప మైలురాయి. ఇంగ్లండ్ పిచ్‌లపై లభించే స్వింగ్, సీమ్ పరిస్థితులు, అక్కడి వాతావరణం, అక్కడి హోమ్ అడ్వాంటేజ్ కారణంగా భారత జట్టుకు ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్‌లు ఎప్పుడూ ఒక సవాలే. భారత క్రికెట్ చరిత్రలో, కొద్దిమంది కెప్టెన్లు మాత్రమే ఇంగ్లండ్‌లో సిరీస్‌లను గెలవగలిగారు లేదా డ్రా చేసుకోగలిగారు. భారత జట్టు ఇప్పటివరకు ఇంగ్లండ్ గడ్డపై కేవలం మూడు సార్లు మాత్రమే టెస్ట్ సిరీస్‌లను గెలుచుకుంది. ఈ అద్భుతమైన విజయాలను సాధించిన కెప్టెన్లు ఎవరో తెలుసుకుంటే భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇంగ్లండ్‌లో తొలిసారి సిరీస్ విజయం సాధించిన కెప్టెన్ అజిత్ వాడేకర్. 1971లో వాడేకర్ సారథ్యంలోని భారత జట్టు 3 టెస్టుల సిరీస్‌లో 1-0 తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి చరిత్ర సృష్టించింది. ఓవల్ టెస్ట్‌లో భగవత్ చంద్రశేఖర్ అద్భుత బౌలింగ్ (6/38) భారత్‌కు విజయాన్ని తెచ్చిపెట్టింది. అలాగే ప్రపంచ కప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ నాయకత్వంలో భారత జట్టు 1986లో ఇంగ్లండ్‌లో 2-0 తేడాతో టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇది ఇంగ్లండ్‌లో భారత్‌కు లభించిన అత్యంత ఆధిపత్య సిరీస్ విజయాలలో ఒకటి. ఈ సిరీస్‌లో భారత్ రెండు మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించగా, చివరి టెస్ట్ డ్రాగా ముగిసింది. ఇక ది వాల్ రాహుల్ ద్రవిడ్ కెప్టెన్సీలో భారత జట్టు 2007లో ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ విజయాన్ని సాధించింది. 3 టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో గెలుచుకుంది. నాటింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ విజయం సాధించగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కాగా విజయం సాధించకపోయినా, కొన్నిసార్లు టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకోవడం కూడా ఒక గొప్ప ఘనతే. ఇంగ్లండ్ గడ్డపై సిరీస్‌ను డ్రా చేసుకున్న భారత కెప్టెన్లలో సౌరవ్ గంగూలీ కెప్టెన్సీలో 2002లో భారత జట్టు ఇంగ్లండ్‌తో జరిగిన 4 టెస్టుల సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకుంది.

ఈ సిరీస్‌లో హెడింగ్‌లీలో భారత్ ఇన్నింగ్స్ 46 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో 2021లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ (ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒకటి కోవిడ్ కారణంగా వాయిదా పడింది) 2-2తో డ్రా అయింది. కోహ్లీ నాయకత్వంలో భారత్ ఇంగ్లండ్ గడ్డపై మూడు టెస్టులు గెలిచింది (2018లో ఒకటి, 2021లో రెండు), ఇది ఒక భారత కెప్టెన్‌కు అత్యధిక టెస్ట్ విజయాల రికార్డు.




## గోల్ఫ్ నెక్స్‌జెన్ ఛాంపియన్‌గా మనీష్

**న్యూఢిల్లీ:** ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) నెక్స్‌జెన్ టోర్నీ ఛాంపియన్‌గా మనీష్ ధక్రాన్ నిలిచాడు. లూధియానాలో పిజిటిఐ నెక్స్‌జెన్ ఇంపీరియల్ గోల్ఫ్ ఎస్టేట్‌లో జరిగిన మూడవ, చివరి రౌండ్‌లో గురుగ్రామ్‌కు చెందిన మనీష్ ధక్రాన్ అత్యుత్తమ స్కోర్ ఐదు-అండర్ 67ను సాధించించాడు. తన ప్రత్యర్థులందరినీ అధిగమించి, తొమ్మిది-అండర్ 171 స్కోరుతో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 20 ఏళ్ల ధక్రాన్ (36-68-67), రాత్రిపూట నాలుగు షాట్లు వెనుకబడి నాల్గవ స్థానంలో నిలిచాడు. తదుపరి రెండు షాట్ల విజయ ఆధిక్యాన్ని నమోదు చేశాడు, ఇది 2025 పిజిటిఐ నెక్స్‌జెన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో 11వ స్థానానికి చేరుకున్నాడు. మూడు షాట్ల తేడాతో ఓవర్‌నైట్ లీడర్‌గా నిలిచిన చండీగఢ్ టీనేజర్ వాసు సెహగల్ (33-67-73) మూడో రౌండ్‌లో 73 పరుగులు చేసి సెవెన్ అండర్ 173తో రెండో స్థానంలో నిలిచాడు. ఓవర్‌నైట్ టైలో రెండో స్థానంలో నిలిచిన కర్నాల్ గోల్ఫర్ తుషార్ పన్ను (31-72-70) మూడో రోజు 70 పరుగులు చేసి జాయింట్ రన్నరప్‌గా నిలిచాడు. రాజేష్ కుమార్ గౌతమ్ 2025 పిజిటిఐ నెక్స్‌జెన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా ఇంపీరియల్ గోల్ఫ్ ఎస్టేట్ అనేది పార్ 72 తొమ్మిది రంధ్రాల మ్యాచ్. ఇక్కడ తొమ్మిది రంధ్రాలను రెండుసార్లు ఆడి ఒక రౌండ్‌ను పూర్తి చేస్తారు. గతంలో పిజిటిఐ ప్రధాన పర్యటనలో విజయానికి దగ్గరగా వచ్చిన మనీష్ ధక్రాన్, కొన్ని అద్భుతమైన టీ షాట్‌లు, అప్రోచ్ షాట్‌లతో రోజును ఘనంగా ప్రారంభించాడు, దీని వలన అతనికి ఫ్రంట్ తొమ్మిదిలో రెండు బర్డీలు వచ్చాయి, రెండూ ఐదు అడుగుల దూరంనుండివచ్చాయి. ఆ తర్వాత మనీష్ బ్యాక్ తొమ్మిదిలో మరిన్ని లాభాలను సాధించాడు, అక్కడ అతను ఒక సోలిటరీ బోగీకి బదులుగా నాలుగు బర్డీలు చేశాడు. అతను 11వ హోల్‌లో బర్డీ కోసం 30ఫుటర్‌ను ముంచాడు, ఆ తర్వాత అతను 12వ బోగీని చేశాడు. ధక్రాన్ చివరికి బర్డీలతో తన రౌండ్‌ను స్టైల్‌గా ముగించాడు.

### ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

## క్వార్టర్ ఫైనల్స్‌కు మానసి



**న్యూఢిల్లీ:** స్టార్ పారాషట్లర్ మానసి జోషి ఆసియా ఛాంపియన్‌షిప్స్-2025లో పారిస్ పారాలింపిక్స్ ఛాంపియన్ జియావోను ఖంగుతినిపించి సంచలనం సృష్టించింది. థాయ్‌లాండ్‌లోని కోరాట్‌లో జరిగిన ఆసియా పారా-బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత ఏస్ మానసి జోషి పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ జియావో జుక్సియన్‌ను ఓడించింది. ఎస్ఎల్3 విభాగంలో ఆడుతున్న మానసి, లోయర్ లింబ్ ఇమ్నార్మల్స్ ఉన్న క్రీడాకారిణులతో కూడిన ఈ టోర్నమెంట్‌లో గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో సానుకూల ఫలితం రావడంతో క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. మూడు గేమ్‌ల (16-21, 21-15, 21-14) హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో మానసి వెనుకబడి జియావోను ఓడించింది. అలాగే మహిళల సింగిల్స్ విభాగంలో మూడు విజయాలలో రెండింటితో గ్రూప్ సిలో రెండవ స్థానంలో నిలిచింది. కాగా అంతకుముందు, మానసి తన రెండవ గ్రూప్ దశ మ్యాచ్‌లో మలేషియాకు చెందిన బిని మట్ లావానీ చేతిలో మూడు ఆటల్లో ఓడిపోయి, దారుణమైన ఆరంభాన్ని సాధించింది. ఆ తర్వాత గ్రూప్ దశ నిష్క్రమణ అనివార్యంగా కనిపించింది. ముందస్తు ఎలిమినేషన్‌ను నివారించడానికి, ఆమె జియావోతో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో గెలవాల్సి వచ్చింది. గత నాలుగు సమావేశాల్లో ఆమె ఆ మ్యాచ్‌ను గెలవలేకపోయింది. అయితే, ఆమె తన సంయమనాన్ని నిలుపుకుని ఈ కష్టమైన పనిని సాధించింది. పారిస్ పారాలింపిక్ క్రీడల తర్వాత మానసికి ఇది మొదటి అంతర్జాతీయ టోర్నమెంట్.

## గాలే టెస్ట్‌లో బంగ్లా 187 రన్స్ ఆధిక్యం

### తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 495, శ్రీలంక 485 రన్స్




**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న మొదటి టెస్టు, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో బాంగ్లాదేశ్ 187 పరుగుల ఆధిక్యంలో ఉంది. గాలేలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టానికి 177 పరుగులు చేసింది. చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి, మరియు మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీలు సాధించిన నజ్ముల్ హుస్సేన్ శాంటో మరియు ముష్ఫికర్ రహీమ్ క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ 495 మరియు 3 వికెట్లకు 177 (శాంటో 56, ముష్ఫికర్ 22, షాద్‌మన్ 76, జయసూర్య 148) శ్రీలంక 485 (నిస్సాంక 187, కమిందు 87, నయీమ్ 5121, మహ్మద్ 374) 187 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇక తొలి ఇన్నింగ్స్‌కు సంబంధించి 368/4 స్కోర్ వద్ద నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక మరో 107 పరుగులు చేసి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. ఓవర్ నైట్ బ్యాటర్ కమిందు మెండిస్ (87) అద్భుతమైన పోరాటం చేసి తన జట్టును బాంగ్లాదేశ్ స్కోర్‌కు దగ్గరగా తీసుకెళ్లాడు. నాల్గవ రోజు ఆటలో కమిందు రతన్నాయకేతో (39) భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అంతకుముందు పథుమ్ నిస్సంక (187) భారీ సెంచరీతో చెలరేగడంతో లంక ఇన్నింగ్స్‌ను బలమైన పునాది పడింది. నిస్సంక చండీమల్ (54) సాయంతో లంక ఇన్నింగ్స్‌ను తీర్చిదిద్దాడు. ఇతర బ్యాటర్లలో లహీరు ఉదార 29, ఏంజెలో మాథ్యూస్ 39, ధనంజయ డిసిల్వ 19, కుసాల్ మెండిస్ 5, అశిత ఫెర్నాండక్ష 4 పరుగులకు ఔటయ్యారు. ప్రభాత్ జయసూర్య 11 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 495 పరుగులు భారీ స్కోర్ చేసింఇ. ముష్ఫికర్ రహీమ్ (163), కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (148) భారీ సెంచరీలతో కదం తొక్కారు.

## క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో.. క్వార్టర్ ఫైనల్స్‌కు అల్కరాజ్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో కార్లోస్ అల్కరాజ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. తన స్వదేశీయుడు జౌమ్ మునార్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన ఈ భారీ మ్యాచ్‌లో 6-4 6-7 (79) 75 తేడాతో విజయం సాధించాడు. ఫ్రెంచ్ ఓపెన్ విజేత తొలి సెట్‌లోని మూడవ గేమ్‌లో మొదట బ్రేక్ చేశాడు, రెండవసారి అడిగినప్పుడే తొలి ఆధిక్యాన్ని సాధించాడు. కానీ, హోరాహోరీగా సాగిన ఈ పోరులో మొదటి సెట్‌ను గెలవడానికి అల్కరాజ్‌కు 46 నిమిషాలు అవసరం కావడంతో, టాప్ సీడ్ రెండవ సెట్‌లో ఇబ్బంది పడ్డాడు. అల్కరాజ్ 3-3తో బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు.

తొమ్మిదవ గేమ్‌లో బ్రేక్ చేసే అవకాశాన్ని కోల్పోయిన తర్వాత, అతను మొత్తం ఆరు సెట్ పాయింట్లను కాపాడుకుని టైబ్రేక్‌కు యత్నించాడు. అయితే, మెజారిటీ కోసం పోటీ పడుతున్నప్పటికీ, చివరిలో మునార్ ఆధిక్యంలోకి చేరుకున్నాడు. ఆ తర్వాత ఈ జంట డిసైడర్ ప్రారంభంలో బ్రేక్‌లు మార్చుకుని 4-2 ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత మునార్ షాక్ విజయం సాధించబోతున్నట్లు అనిపించింది. అయితే, అల్కరాజ్ చివరి ఎనిమిది స్థానాల్లో తన స్థానాన్ని నిర్ధారించడానికి చివరి ఆటలో విరామం తీసుకునే ముందు సమం చేశాడు.

## ఇక టూవీలర్లన్నింటికీ యాంటీ లాక్ బ్రేక్స్


**ముంబై, జూన్ 20:** ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకొనే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో అమ్ముడయ్యే టూవీలర్లన్నింటికీ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్‌ను తప్పనిసరి చేయనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలని కేంద్రం భావిస్తోంది. ఈమేరకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం దేశీయంగా అమ్ముడవుతున్న 150 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన టూవీలర్లకే ఏబీఎస్ తప్పనిసరి అన్న నిబంధన అమలవుతోంది. ఇకపై ఎంట్రీ లెవల్ మోడళ్లు సహా అన్ని టూవీలర్లకూ దీన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో మొత్తం ఎంట్రీ లెవల్ మోడళ్లే దాదాపు 75 శాతం వరకు ఉన్నాయి. 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం వరకు టూవీలర్ల కారణంగా జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఏబీఎస్ నిబంధనను తప్పనిసరి చేస్తే ఆ మేర టూవీలర్ ధరలు పెరగనున్నాయి. ఏబీఎస్‌ను అమర్చడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులకే బదిలీ చేస్తాయి. దీనివల్ల ఎంట్రీ లెవల్ టూవీలర్ మోడళ్ల ధరలు



రూ.2500 నుంచి రూ.5వేల వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రమాదాలను అడ్డుకోవడంలో ఏబీఎస్ ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. ఏబీఎస్ అంటే యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్. ఇది వాహనాల్లో ఉపయోగించే ఒక భద్రతా వ్యవస్థ. సడన్ బ్రేకింగ్ సమయంలో చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధిస్తుంది. దీనివల్ల డ్రైవర్‌కు వాహనం మీద నియంత్రణ ఉంటుంది. వాహనం స్కిడ్ కాకుండా నివారిస్తుంది.

## అప్పుల ఊబిలో అమెరికా!

**వాషింగ్టన్, జూన్ 20:** అమెరికాపై అప్పుల భారం ఏటా వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు అమెరికా జాతీయ అప్పు 37 లక్షల కోట్ల డాలర్లను దాటింది. ఇది అమెరికాలో ఆందోళన కలిగిస్తోంది. కేవలం వడ్డే చెల్లింపులకే ఏటా ఒక లక్ష కోట్ల డాలర్ల వరకు ఖర్చవుతోంది. ఇదే విధంగా అప్పులు పెరుగుతూ పోతే అమెరికా బడ్జెట్‌పై తీవ్రప్రభావం పడి, ఆ దేశ ఆర్థిక వృద్ధి నిలిచిపోవచ్చని చెబుతున్నారు. జూన్ 20 నాటి అమెరికా ప్రభుత్వంపై ఉన్న అప్పు దేశ ఆర్థిక వ్యవస్థ ఏడాదిలో పెరిగే మొత్తం కంటే ఎక్కువ. కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనా ప్రకారం.. పెద్ద సంస్కరణలు లేకుండా 2055 నాటికి అప్పు జీడీపీలో 156 శాతానికి పెరుగుతుంది. ప్రస్తుత స్థాయిలో పెరుగుతున్న ఖర్చులు, స్థిరమైన వృద్ధి కారణంగా ఏటా 2 లక్షల కోట్ల డాలర్ల లోటు అప్పుల పెరుగుదలకు దారితీస్తోంది. అమెరికాకు అతిపెద్ద, తాజా ముప్పు వడ్డీ చెల్లింపుల రూపంలో ఉంది. మొత్తం ట్యాక్సుల ద్వారా వచ్చే ఆదాయంలో దాదాపు నాలుగింట ఒక వంతు ఇప్పుడు అప్పులు తీర్చడానికే ఖర్చవుతోంది. దీని అర్థం సామాజిక భద్రత, మెడికేర్, జాతీయ రక్షణ, మౌలిక సదుపాయాల కోసం చాలా తక్కువ డబ్బు మిగులుతుంది. ఈ రంగాలు లక్షలాది మంది అమెరికన్లకు చాలా కీలకంగా ఉన్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా సంక్షోభం ప్రభావం ముప్పు కేవలం బడ్జెట్ కోతలకు మాత్రమే పరిమితం కాదు. ఈ అప్పు ప్రైవేట్ పెట్టుబడులను తగ్గించగలదని, రుణ ఖర్చులను పెంచగలదని, ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించగలదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అప్పుల భారం నియంత్రించబడక పోతే రాబోయే దశాబ్దంలో జీడీపీ340బిలియన్ల నష్టం సంభవించవచ్చని నివేదిక అంచనా వేస్తోంది. ఇది 1.2 మిలియన్ల ఉద్యోగాలను కోల్పోవడానికి, అన్ని రంగాలలో వేతన పెరుగుదల మందగించడానికి దారితీయవచ్చు. డాలర్ విలువ పడి పోవచ్చు.. వడ్డీరేట్ల పెరుగుదల నష్టాన్ని మరింత పెంచుతోంది.



## మరోసారి మైక్రోసాఫ్ట్‌లో లేఆఫ్స్

**న్యూఢిల్లీ, జూన్ 20:** ప్రపంచ టెక్ రంగంలో దిగ్గజంగా పేరొందిన మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రెండు విడతల్లో ఉద్యోగాలను తొలగించిన ఈ సంస్థ, ఇప్పుడు మూడోసారి అదే దిశగా అడుగులు వేస్తోంది. జూలై నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశముందని బ్లూమ్‌బర్గ్ వార్త సంస్థ విశ్వసనీయ వర్గాల సమాచారం ఆధారంగా పేర్కొంది. ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డెవలపర్లు ఉద్యోగాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కానీ తాజా దఫా తొలగింపుల్లో విక్రయాలు విభాగం పెద్ద ఎత్తున ప్రభావితమయ్యే అవకాశముంది. మైక్రోసాఫ్ట్‌లో దాదాపు 45 వేల మంది ఉద్యోగులు సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లో పని చేస్తున్నారు. వీరిలో కొంత మందిపై ప్రభావం తప్పదని భావిస్తున్నారు. ఏఐ దిశగా మైక్రోసాఫ్ట్ దృష్టి కృత్రిమ మేధరంగంలో మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. దీనికి సంబంధించి సంస్థ అంతర్గతంగా పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. దీంతో కొంత మంది ఉద్యోగుల అవసరంతగ్గినట్లు తెలుస్తోంది. సంస్థ కొత్త ఆర్థిక సంవత్సరం జూలై నుంచే ప్రారంభం కావడంతో, ఇప్పుడే లేఆఫ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.




# వాణిజ్యం


## ఉద్రిక్తతల్లోనూ లాభాలోనే స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 20:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నా మన సూచీలు రాణించడం గమనార్హం. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ప్రధానంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 25,100 మార్కును దాటింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.446.37 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 81,354.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,361.87) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా భారీ లాభాల్లో కొనసాగింది. ఇంట్రాడేలో 82,494.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1046.30 పాయింట్ల లాభంతో 82,408.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 319 పాయింట్లు లాభపడి 25,112.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.59గా ఉంది. మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్లు కాగా.. బంగారం ఔన్సు 3372 డాలర్ల వద్ద కొనసాగింది.



## హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపిఒ

**ముంబై, జూన్ 20:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ధరల శ్రేణిని ప్రకటించింది. రూ.12,500 కోట్ల ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.700 740గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధరల శ్రేణి వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.61,400 కోట్లు కానుంది. తొలి పబ్లిక్ ఆఫర్ ఈనెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఇందులో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్లు ఈనెల 24న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. అర్హత కలిగిన కంపెనీ ఉద్యోగులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వాటాదార్లకు ఐపీఓలో భాగంగా షేర్లను కేటాయించనున్నారు. ఐపీఓలో భాగంగా రూ.2,500 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.10,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విక్రయించనుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.36 వాటా ఉంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులతో కంపెనీ తమ టైర్ 1 కేపిటల్ బేస్‌ను బలోపేతం చేసుకోనుంది. భవిష్యత్ వ్యాపార వృద్ధికి కొంత మొత్తాన్ని వినియోగించనుంది. **సంభవ్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ** సంభవ్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓకూడా జూన్ 25 నుంచి ప్రారంభం కానుంది. జూన్ 27న ముగియనుంది. ఐపీఓలో భాగంగా రూ.540 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.7782గా నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.440 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ కింద రూ.100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చిన నిధులను రుణ చెల్లింపులు, కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు.




## 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్

### ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్ ఖాతాల హ్యాక్!

**ముంబై, జూన్ 20:** డిజిటల్ యుగంలో సాంకేతికత వల్ల లాభాలే కాకుండా నష్టాలు కూడా తీవ్రమవుతున్నాయి. సాంకేతికతను ఉపయోగించుకొని సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ మోసాలు ప్రపంచవ్యాప్తంగా ఒక తీవ్రమైన సమస్యగా మారాయి. పలు ప్రముఖ సంస్థల డేటాలను కూడా సైబర్ నేరగాళ్లు సులభంగా లీక్ చేయగలుగుతున్నారు. తాజాగా ఆపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలకు చెందిన 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ భద్రతా పరిశోధకులు పేర్కొన్నాయి. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద డేటా లీక్ ఉల్లంఘనల్లో ఒకటిగా తెలిపాయి. మే 23న విడుదలైన ఫోర్బ్స్‌లోని ఒక నివేదిక ప్రకారం.. యాపిల్, ఫేస్‌బుక్, గూగుల్, గిట్‌హబ్, టెలిగ్రామ్, ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలు లీక్ అయినట్లు తెలిపింది. వివిధ రకాల సామాజిక మాధ్యమాల ఖాతాలు, టెక్ సంస్థల యూజర్ల పాస్‌వర్డ్‌లు సైతం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. గతంలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలకు చెందిన 184 మిలియన్ల యూజర్ల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ సెక్యూరిటీ నిపుణులు పేర్కొనగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 16 బిలియన్లకు చేరిందని అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. నివేదికల ప్రకారం.. సైబర్ భద్రతా పరిశోధకులు మొత్తం 30 డేటాసెట్‌లను కనుగొన్నారు. ఒక్కో డేటాసెట్ లో 3.5 బిలియన్ రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. సోషల్‌మీడియా వీపీఎన్ లాగిన్‌లతో పాటు వివిధ కార్పొరేట్ డెవలపర్ ప్లాట్‌ఫారమ్‌లను కలిగిఉన్న సంస్థలకు చెందిన ఖాతాలలో 2025 ప్రారంభం నుంచి లాగిన్ అయిన అన్ని ఖాతాల వివరాలు వీటిలో రికార్డ్ అవుతున్నట్లు తెలిపారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.